ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం, జులై 22, 2026 | సంపుటి - 22 | సంచిక 294 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## పశ్చిమాసియాలో ఉద్రిక్తం

### పూర్తిస్థాయి యుద్ధం చేస్తున్నామన్న ఇరాన్

6



- అమెరికా అడ్వైజరీ జారీ
- అప్రమత్తంగా ఉండాలని సూచనలు
- ప్రపంచంలోని అమెరికన్స్‌కు హెచ్చరికలు

అమెరికా `ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు.

## మోడీ రాజీనామా చేయాలి



వివరాలు 2లో..

- సిజెపి మార్చ్ సందర్భంగా లాఠీఛార్జ్ దురదృష్టకరం
- ఈ ఘటనపై ప్రధాని మౌనం వీడాలి
- పార్లమెంటులో అత్యవసరంగా చర్చించాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- ప్రధాని నివాసం ఎదుట కాంగ్రెస్ మెరుపు ధర్నా
- జంతర్‌మంతర్ ఆందోళనకారులపై లాఠీఛార్జ్‌కు నిరసన

## కాక్రోచ్ పార్టీ ఆందోళనపై కేంద్రం అప్రమత్తం



వివరాలు 2లో..

- విద్యార్థులతో చర్చించేందుకు సిద్ధమని సంకేతాలు
- లాఠీఛార్జ్‌లో గాయపడ్డ విద్యార్థులను పరామర్శించిన జెపి నడ్డా

## హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు చేదు అనుభవం

గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని సెక్యూరిటీ సూచన

రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు ఆగ్రహం

వివరాలు 2లో..





# ఢిల్లీని కుదిపిన యువత ఆగ్రహం




### పార్లమెంట్ నుంచి వీధుల వరకు పోరు | పాలకులకు చివరి హెచ్చరికేనా?




- పేపర్ లీకులు, అవినీతిపై రగులుతున్న విద్యార్థులు
- రాజకీయ వ్యవస్థనూ ప్రశ్నించే స్థాయికి చేరారనే సంకేతం..
- నిరసనలను అణచివేయడం తాత్కాలికంగా అదుపు చేయడమే..

ఇటీవల విద్యా వ్యవస్థలో పారదర్శకత, పరీక్షల విశ్వసనీయత వంటి అంశాలపై ఉద్యమం చేపట్టిన సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఆ తర్వాత జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థులు, యువజన సంఘాలు, సామాజిక సంస్థలు భారీగా చేరి నిరసనలు చేపట్టడం ఈ సమస్య ఎంత లోతుగా వెళ్లిందో చూపించింది.

**దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులపై ఉవ్వెత్తున ఎగసిపడుతున్న యువత ఆగ్రహం ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీని కుదిపేస్తోంది. జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థులు, యువజన సంఘాలు, సామాజిక సంస్థలు చేపట్టిన నిరసనలు మంగళవారం మరింత ఉధృత మయ్యాయి. ఉద్యమానికి మద్దతుగా కాంగ్రెస్ ఎంపీలు ప్రధానమంత్రి నివాసం సమీపంలో నిరసనకు దిగడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు పలువురు ఎంపీలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. సంఘటనలను కవర్ చేస్తున్న కొందరు మీడియా ప్రతినిధులను కూడా నిర్బంధించారన్న ఆరోపణలు వెలువడటంతో ఈ వివాదం జాతీయ చర్చగా మారింది.**

**బిజిగిరి శ్రీనివాస్, ఎడిటర్-నినాదం:**

పేపర్ లీకుల సమస్య ఇప్పుడు కేవలం ఒక పరీక్షకు సంబంధించిన అంశం కాదని, దేశ యువత భవిష్యత్తును తాకుతున్న సంక్షోభంగా మారిందని ఉద్యమకారులు పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి కష్టపడి చదివిన అభ్యర్థులు పరీక్ష రాసిన తర్వాత ప్రశ్నాపత్రం లీకైందనే వార్తలు రావడం, పరీక్షలు రద్దు కావడం, నియామకాలు నిలిచిపోవడం వల్ల లక్షలాది మంది యువతలో తీవ్ర నిరాశ నెలకొంది. అప్పులు చేసి కోచింగ్‌కు పంపించిన కుటుంబాలు కూడా ఈ పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఇటీవల విద్యా వ్యవస్థలో పారదర్శకత, పరీక్షల విశ్వసనీయత వంటి అంశాలపై సోనం వాంగ్‌చుక్ చేపట్టిన ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చకు దారితీయగా, ఇప్పుడు అదే ఆవేదన జంతర్ మంతర్ వేదికగా భారీ విద్యార్థి ఉద్యమంగా రూపుదిద్దుకుంది. యువత డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని నిరసనకారులు కోరుతున్నారు.

రాజకీయంగా కూడా ఈ ఉద్యమం కొత్త మలుపు తిరిగింది. అధికార పక్షం పరీక్షల భద్రతను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెబుతుండగా, ప్రతిపక్షాలు మాత్రం వ్యవస్థ వైఫల్యాల వల్లే యువత వీధుల్లోకి రావాల్సి వచ్చిందని విమర్శిస్తున్నాయి. పార్లమెంట్ వెలుపల మొదలైన ఈ పోరాటం ఇప్పుడు పార్లమెంట్ లోపల కూడా ప్రతిధ్వనిస్తోంది.

భారతదేశంలో కూడా ఉద్యోగాలు, విద్య, పరీక్షల పారదర్శకత వంటి మౌలిక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఎన్నికల సమయంలో హామీలు, ప్రచారాలు మాత్రమే సరిపోతాయని భావించడం సరైన రాజకీయ అంచనా కాదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. కులం, మతం, ప్రాంతం వంటి భావోద్వేగ అంశాలతో అసలు ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నాలు ఎంతకాలం కొనసాగినా, ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువత చివరకు తమ భవిష్యత్తు గురించే ప్రశ్నిస్తారని వారు పేర్కొంటున్నారు.

***రాజకీయ పరిశీలకుల అభిప్రాయం ప్రకారం, యువత వీధిలోకి రావడం ఒక్క రోజులో జరిగే పరిణామం కాదు. సంవత్సరాలుగా పేరుకుపోతున్న నిరుద్యోగం, నియామకాలలో జాప్యం, పరీక్షల్లో అవకతవకలు, అవినీతి ఆరోపణలు, అవకాశాల కొరత కలిసి వచ్చినప్పుడే ఇలాంటి ఉద్యమాలు ఉద్భవిస్తాయి. అలాంటి పరిస్థితులను కేవలం అరెస్టులు లేదా పోలీసు బందోబస్తుతో పరిష్కరించడం సాధ్యం కాదని వారు పేర్కొంటున్నారు.***




నిపుణుల అభిప్రాయం ప్రకారం, పేపర్ లీక్ ముఠాలపై వేగవంతమైన దర్యాప్తు, పరీక్షా సంస్థలకు పూర్తి స్వయం ప్రతిపత్తి, అత్యాధునిక డిజిటల్ భద్రతా వ్యవస్థలు, బాధ్యులపై కఠిన చర్యలు, నష్టపోయిన అభ్యర్థులకు త్వరితగతిన న్యాయం చేయడం ద్వారా మాత్రమే యువతలో విశ్వాసాన్ని పునరుద్ధరించవచ్చు.

**ఇటీవల విద్యా వ్యవస్థలో పారదర్శకత, పరీక్షల విశ్వసనీయత వంటి అంశాలపై ఉద్యమం చేపట్టిన సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఆ తర్వాత జంతర్ మంతర్ వద్ద వేలాది మంది విద్యార్థులు, యువజన సంఘాలు, సామాజిక సంస్థలు భారీగా చేరి నిరసనలు చేపట్టడం ఈ సమస్య ఎంత లోతుగా వెళ్లిందో చూపించింది.**

యువత ప్రశ్నలకు అధికార పక్షం నుంచి తగిన రాజకీయ స్పందన కనిపించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ ఉద్యమానికి సంఘీభావం ప్రకటిస్తూ ఎంపీలతో కలిసి నిరసనల్లో పాల్గొనడం రాజకీయ చర్చకు కొత్త మలుపు తీసుకొచ్చింది. ప్రధానమంత్రి నివాసం సమీపంలో కాంగ్రెస్ ఎంపీలు ధర్నా చేయడం, పోలీసుల జోక్యం, అరెస్టులు, సంఘటనలను కవర్ చేస్తున్న కొందరు మీడియా ప్రతినిధులు కూడా నిర్బంధానికి గురయ్యారన్న ఆరోపణలు పరిస్థితి తీవ్రతను మరింత పెంచాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రశ్నలకు సమాధానం చర్చల ద్వారా రావాలి.



**ఢిల్లీలో వినిపిస్తున్న యువత స్వరం కేవలం రాజధానికి పరిమితం కాదని, దేశ వ్యాప్తంగా ఉద్యోగాల కోసం, న్యాయం కోసం ఎదురుచూస్తున్న కోట్లాది మంది యువత మనోభావాలకు ప్రతిబింబమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ హెచ్చరికను పాలకులు సమయానికి గుర్తించి స్పందిస్తారా? లేక అసంతృప్తి మరింత విస్తృత ఉద్యమంగా మారుతుందా? అన్నది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.**

అరెస్టులు, ఆంక్షలు, బలప్రయోగం అసలు సమస్యను పరిష్కరించలేవు. అవి తాత్కాలికంగా నిరసనను తగ్గించినా, అసంతృప్తిని మరింత లోతుగా నాటే ప్రమాదం ఉంది.

ఇక్కడ పాలకులు ఒక విషయం గుర్తుంచుకోవాలి. యువత వీధిలోకి రావడం అనేది ఒక్కరోజులో జరిగే పరిణామం కాదు. ఎన్నో సంవత్సరాల నిరీక్షణ, పదేపదే ఎదురయ్యే నిరాశ, అవకాశాల కొరత, వ్యవస్థపై నమ్మకం కోల్పోవడం.. ఇవన్నీ కలిసి చివరకు ఉద్యమంగా మారతాయి.

తరువాయి 2లో..

> **ప్రశ్నాపత్రాల లీకులు, నియామకాలపై అనుమానాలు, పరీక్షల రద్దులు, సంవత్సరాల నిరీక్షణ, నిరుద్యోగం.. ఇవన్నీ కలిసివచ్చి యువతలో తీవ్రమైన అసంతృప్తిని పెంచుతున్నాయి. వేలాది కుటుంబాలు అప్పులు చేసి పిల్లలను కోచింగ్ కేంద్రాలకు పంపిస్తున్నాయి. సంవత్సరాల పాటు చదివి పరీక్ష రాసే విద్యార్థికి ప్రశ్నాపత్రం ముందే లీకైందనే వార్త వినిపించిన క్షణంలో కూలిపోయేది కేవలం ఒక పరీక్ష కాదు; కూలిపోతుంది మొత్తం వ్యవస్థపై ఉన్న విశ్వాసం.**

## సిజెపి ఆందోళన వెనక కుట్ర కోణం?

- ప్రాణాలకు తెగించి రావాలని సందేశాలు
- ప్రాణత్యాగాలు చేసిన వారిని గుర్తుంచుకుంటాం
- సీక్రెట్ యాప్‌తో పరస్పరం సందేశాలు చేరవేత
- సంసద్ యాత్రపై కూపీ లాగుతున్న పోలీసులు

౨ వివరాలు



## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి

వివరాలు 2లో..

## ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

- ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం
- వర్షా భావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి
- కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి
- హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి




2

## త్వరితగతిన పనులు పూర్తి చేయండి

- అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి
- అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు
- భూబాధితులకు ఇళ్ళ పట్టాలు ఇవ్వండి
- కొడంగల్-నారాయణ పేట ఎత్తిపోతల పై ఆరా
- సెప్టెంబర్ లోగా భూసేకరణ పూర్తి చేయండి
- అధికారులపై ముఖ్యమంత్రి సీరియస్



**కొడంగల్, జులై 21(నినాదం)**

హకీంపేట్ పేట్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్ లోని హకీంపేట్ లో జరుగుతున్న ఎడ్యుకేషన్ హబ్,వెటర్నరీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల

తరువాయి 2లో..

## ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు.. కాలం తెచ్చిన కరువు కాదు

### 28 నెలల్లో సీఎంగా కేసీఆర్

- మంచిర్యాల ఎమ్మెల్యే పద్ధతి మార్చుకో
- మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు అందజేత
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

***28 నెలల్లో మళ్లీ సీఎంగా కేసీఆర్ వస్తాడని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు.. కాలం తెచ్చిన కరువు కాదన్నారు. యూరియా కష్టాలు కరెంటు కోతలు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.***



**మంచిర్యాల, జులై 21(నినాదం):**

మంగళవారం లక్షెట్టిపేట లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, రాష్ట్ర నాయకులు విజిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు సదుస్సులో పాల్గొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అకాల వర్షంతో లక్షెట్టి పేటలో గోడ కూలి మృతి చెందిన 4 రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రూ.20 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన ఒక రైతు కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు మాత్రమే ప్రభుత్వం అందించిందని, మిగిలిన 3 రైతు కుటుంబాలకు

తరువాయి 2లో..



## మోడీ రాజీనామా చేయాలి

**న్యూఢిల్లీ,జూలై21(నినాదం):**
భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. గూండాగిరి, నిరంకుశత్వం వద్దంటూ.. అణచివేత చర్యలు నడవవంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేసారు. ధర్నా సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. నిన్న యువతపై లాఠీచార్జ్‌కు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చకు అంగీకరించలేదని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనం లేదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మౌనం వీడాలని, నీట్ అంశంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ మార్చ్ సందర్భంగా ఢిల్లీ పోలీసులు విద్యార్థులు, నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. విద్యార్థులపై అణచివేతకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గేలతో పాటు కాంగ్రెస్ నాయకులు లోక్‌కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో పవన్ ఖేరా, పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షులు అమరీందర్ సింగ్ రాజా వారింగ్, దీపేందర్ హుడా, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. విద్యార్థుల్ని బీజేపీ ప్రభుత్వం క్రూరంగా హింసించిందని, కానీ బాధ్యత వహించడానికి, పార్లమెంట్‌లో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ నేతల ధర్నాతో ఒక్కసారిగా ఢిల్లీలో హైడ్రామా చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ కాంగ్రెస్ ధర్నా చేస్తున్న ప్రదేశానికి చేరుకుని రాహుల్ గాంధీతో చర్చిస్తున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయాలని రాహుల్ గాంధీకి నచ్చచెప్పేలా ప్రయత్నిస్తున్నారు. రాహుల్‌తో పాటు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో చర్చించారు. మరోవైపు, కాంగ్రెస్ శ్రేణులు రాజీనామా చేయాలంటూ నినాదాలు చేస్తున్నారు.

## లాఠీఛార్జ్ దురదృష్టకరం

ఢిల్లీలో సీజేపీ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యను కాంగ్రెస్ అగ్రనాయకుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఖండించారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. పోలీసుల లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగంలో గాయపడిన విద్యార్థులను రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ కలిసి పరామర్శించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య గురించి ప్రధాని మోదీ ఇప్పటివరకు స్పందించకపోవడం ఆశ్చర్యకరమన్నారు. విద్యార్థులపై జరిగిన ఘటనకు ప్రధాని క్షమాపణ చెప్పాలని, ఇలాంటి చర్యలు వెంటనే ఆగాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఈ ఘటనపై అత్యవసర చర్చ నిర్వహించాలని కోరారు. పోలీసు చర్యలో గాయపడిన విద్యార్థులు చికిత్స పొందుతున్న రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వెళ్లి వారిని పరామర్శించనున్నారు. విద్యార్థుల గొంతును అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ సహించబోదని రాహుల్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల వ్యవస్థలో నెలకొన్న సంక్షోభం, పోలీసు చర్యపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సీజేపీ మార్చ్ సందర్భంగా వేలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో 100 మందికి పైగా పోలీసులు, 60 మందికి పైగా నిరసనకారులు గాయపడినట్లు అధికారులు తెలిపారు.

## కాక్రోచ్ పార్టీ ఆందోళనపై కేంద్రం అప్రమత్తం

**న్యూఢిల్లీ,జూలై21(నినాదం):**
నీట్ ప్రశ్నపత్రం లీక్, విద్యా వ్యవస్థలో లోపాల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ సోమవారం చేపట్టిన 'చలో పార్లమెంట' యాత్ర ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో సీజేపీ ఆందోళనకు శాంతియుత పరిష్కారం చూపే దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థి ప్రతినిధులతో చర్చలకు సిద్ధమని కేంద్రం ప్రకటించినట్లు సమాచారం. ఈ సమస్యలకు చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అందుకోసం ఆ దిశగా చర్యలు చేపట్టింది. విద్య మంత్రిత్వ శాఖ లేదా ఉన్నతాధికారుల స్థాయిలో విద్యార్థులతో సమావేశం నిర్వహించే ఆస్కారం ఉందని తెలుస్తోంది. దీంతో నీట్ నిర్వహించే పరీక్షా వ్యవస్థలో పారదర్శకతతో పాటు సంస్కరణల దిశగా ముందడుగు పడనుంది. సోమవారం చలో పార్లమెంట్ యాత్రలో విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని మంగళవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డా పరామర్శించారు. అనంతరం విద్యార్థులతో కేంద్రం చర్చలకు సుముఖంగా ఉందనే ప్రచారం ప్రారంభమైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్, పోటీ పరీక్షల్లో అవకతవకలతో పాటు పేపర్ లీకేజీ వ్యవహారంపై విద్యార్థి లోకం భగ్గుమంది. దీంతో జాతీయ స్థాయిలో విద్యార్థుల నిరసనలు, నిరాహార దీక్షలు ఉధృతమయ్యాయి. దాంతో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 'చర్చల కోసం తలుపులు తెరిచే ఉన్నాయని' కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ఈ అంశంపై ప్రధాని మోదీకి విద్యావేత్తలతో పాటు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఒంకోవైపు నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని మోదీ తొలిసారి స్పందించారు. మంగళవారం న్యూఢిల్లీలో మంగళ్ మిలన్ పేరిట ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ ఘోర పాపమని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఈ పేపర్ లీకులను నివారించడం జాతీయ బాధ్యత అని ప్రధాని మోదీ తెలిపారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సీజేపీ ప్రతినిధులు సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమ 3 ప్రధాన డిమాండ్లతో కూడిన లేఖను కేంద్రమంత్రికి వారు అందజేసిన విషయం విదితమే.

# ఢిల్లీని కుదిపిన యువత ఆగ్రహం




ఆ దశకు వెళ్లిన తర్వాత దాన్ని పోలీసు బలంతో లేదా రాజకీయ ప్రచారంతో మాత్రమే అణచివేయడం సాధ్యం కాదు.
చరిత్ర చెబుతున్నది ఇదే. యువత ఆకాంక్షలను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు చివరకు భారీ రాజకీయ మూల్యం చెల్లించుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా ప్రజల ఆవేదన ఒక్కసారిగా ఉప్పొంగిన సందర్భాలు ఉన్నాయి. శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు; ప్రజలలో పేరుకుపోయిన అసంతృప్తి పాలక వ్యవస్థపై విస్ఫోటనమైంది. బంగ్లాదేశ్‌లో విద్యార్థి ఉద్యమాలు దేశ రాజకీయాలను కుదిపేశాయి. ప్రతి దేశ పరిస్థితి భిన్నమైనదే అయినప్పటికీ, ప్రజల అసంతృప్తిని నిరంతరం నిర్లక్ష్యం చేయడం ఏ ప్రజాస్వామ్యానికైనా ప్రమాదకర సంకేతమే.

<

భారతదేశం వంటి విస్తారమైన ప్రజాస్వామ్యంలో కూడా యువతలో పెరుగుతున్న అసంతృప్తిని చిన్నచూపు చూడడం సరైన రాజకీయ దూరదృష్టి కాదు. ఉద్యోగం లేకపోవడం, పరీక్షల్లో అవకతవకలు, అవినీతి, అవకాశాల్లో అసమానతలు——ఇవన్నీ కలిస్తే అది కేవలం విద్యార్థి సమస్యగా మిగలదు. అది సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రశ్నగా మారుతుంది.

ప్రతి ఎన్నికలో మతం, కులం, ప్రాంతం వంటి భావోద్వేగాలతో ప్రజల దృష్టిని మళ్లించవచ్చని, ఎన్నికల సమయంలో డబ్బు ఖర్చు చేస్తే సరిపోతుందని, యువత చివరకు మర్చిపోతుందని భావించడం ప్రమాదకరమైన రాజకీయ అంచనా. ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి శ్రమిస్తున్న యువకుడికి కులం కన్నా ఉద్యోగం ముఖ్యం. పరీక్ష రాసిన విద్యార్థికి మతం కన్నా న్యాయం ముఖ్యం. భవిష్యత్తు కోల్పోతున్న తరాన్ని ప్రచార నినాదాలతో శాశ్వతంగా మౌనం చేయడం సాధ్యం కాదు.

సమాజంలో సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, మరోవైపు కోట్లాది యువత ఉద్యోగాల కోసం పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. విద్య కూడా అనేక సందర్భాల్లో భారీ వ్యాపారంగా మారింది. పరీక్షల నిర్వహణ కూడా కార్పొరేట్ ప్రయోజనాలు, మధ్యవర్తుల ప్రభావం, అవినీతి ఆరోపణల నుంచి పూర్తిగా బయటపడలేకపోతోందనే విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బాధ్యత మరింత పెరుగుతుంది. విద్య, ఉపాధి, సమాన అవకాశాలు ప్రజల హక్కులుగా నిలవాలి గానీ, మార్కెట్ లాభాల బందీలుగా మారకూడదు.

ప్రభుత్వం ఇప్పటికైనా అత్యవసర చర్యలు చేపట్టాలి. పేపర్ లీక్ ముఠాలపై వేగవంతమైన, స్వతంత్ర దర్యాప్తు జరగాలి. పరీక్షా సంస్థలకు రాజకీయ జోక్యం లేకుండా స్వయం ప్రతిపత్తి కల్పించాలి. అత్యాధునిక డిజిటల్ భద్రతా వ్యవస్థలు అమలు చేయాలి. లీకుల వల్ల నష్టపోయిన అభ్యర్థులకు త్వరితగతిన న్యాయం చేయాలి. బాధ్యులపై ఉదాహరణగా నిలిచేలా కఠిన చర్యలు తీసుకోవాలి. నియామక ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడం ప్రభుత్వాల మొదటి బాధ్యత కావాలి.

ప్రతిపక్షాల బాధ్యత కూడా అంతే ముఖ్యమైనది. యువత సమస్యలను కేవలం అధికారాన్ని విమర్శించే రాజకీయ అవకాశంగా కాకుండా, దీర్ఘకాలిక విధాన మార్పులకు వేదికగా ఉపయోగించాలి. ప్రజల ఆవేదనను ఎన్నికల నినాదంగా మాత్రమే కాకుండా, వ్యవస్థలో సంస్కరణలకు దారితీసే ప్రజాస్వామ్య ఒత్తిడిగా మలచాలి.




యువత కూడా తమ ఉద్యమాన్ని శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, నిర్మాణాత్మకంగా ముందుకు తీసుకెళ్లాలి. హింస ఏ సమస్యకీ శాశ్వత పరిష్కారం కాదు. కానీ ప్రజల ప్రశ్నలకు పాలకులు స్పందించకపోతే, అసంతృప్తి మరింత విస్తృత రూపం దాల్చే అవకాశం మాత్రం ఉంటుంది.

దేశ భవిష్యత్తు పార్లమెంట్ భవనాల్లో మాత్రమే నిర్ణయించబడదు. పరీక్షా హాళ్లలో, విశ్వవిద్యాలయాల్లో, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువత మనసుల్లో కూడా నిర్ణయించబడుతుంది. అక్కడ విశ్వాసం నిలిస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది.
నేడు ఢిల్లీలో వినిపిస్తున్న యువత స్వరం కేవలం రాజధానికి పరిమితం కాదు. అది దేశమంతా మార్మోగుతున్న ఒక హెచ్చరిక. ఈ హెచ్చరికను పాలకులు సమయానికి వినకపోతే, రేపటి నిరసనలు మరింత విస్తృత రూపం దాల్చే అవకాశాన్ని ఎవరూ తేలికగా తీసుకోలేరు.

**పరీక్షా హాళ్లలో ప్రతిభ గెలవాలి... అవినీతి కాదు.**

**యువత ఆశలు నిలవాలి... అనుమానాలు కాదు.**

**ప్రజాస్వామ్యం నిలవాలంటే ప్రజల విశ్వాసం నిలవాలి. ఆ విశ్వాసాన్ని కాపాడటం ఏ ప్రభుత్వానికైనా అత్యున్నత బాధ్యత.**

దేశ చరిత్రలో ప్రతి పెద్ద మార్పు వెనుక యువత ఉంది. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి అత్యవసర పరిస్థితి వ్యతిరేక పోరాటాల వరకు, అవినీతికి వ్యతిరేక ఉద్యమాల నుంచి రాష్ట్రాల సాధన వరకు——ఎక్కడ చూసినా ముందుండింది యువతే. నేడు దేశ రాజధాని ఢిల్లీలో వినిపిస్తున్న నినాదాలు కూడా అదే చరిత్రను గుర్తు చేస్తున్నాయి. ఇవి కేవలం కొన్ని ప్రశ్నాపత్రాల లీకులపై ఆవేదన కాదు. తమ శ్రమకు విలువ ఇవ్వాలని, తమ భవిష్యత్తుతో ఆటలు ఆడొద్దని, ప్రజాస్వామ్యం తమను కూడా వినాలని ఒక తరం చేస్తున్న గట్టిపిలుపు.

# సిజెపి ఆందోళన వెనక కుట్ర కోణం?

**న్యూఢిల్లీ,జూలై21(నినాదం):**

దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం చేపట్టిన చలో సంసద్ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడం ఒక ఎత్తయితే..వారి ఆందోళనల వెనక ఉన్న కుట్ర కోణాలను పోలీసులు కూపీ లాగుతున్నారు. సోమవారం నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో పలువురు నిరసనకారులు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం కూడా పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. దీంతో రాజధానిలో హై టెన్షన్ నెలకొంది. మరోవైపు విపక్ష పార్టీలు ప్రధాని మోడీ నివాసం ఎదుట నిరసనకు దిగారు. సర్వత్రా టెన్షన్.. టెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది. అయితే తాజాగా పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సీజేపీ నిరసన హింసాత్మకంగా మారడానికి భారీ కుట్ర జరిగినట్లుగా పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయి. సోమవారం ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోయినా పెద్ద ఎత్తున నిరసనకారులు ఎలా రాగలిగారు అన్న దానిపై ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిరసనకారులు పరస్పరం సందేశాలు పంపించుకున్నట్లు కొన్ని చాట్ సందేశాలు వెలుగులోకి వచ్చాయి. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయినా పరస్పరం సంప్రదింపులు కొనసాగించేందుకు బ్లూటూత్ ఆధారిత 'సీక్రెట్ యాప' వినియోగించినట్లుగా తేటతెల్లమైంది. అంతేకాకుండా కొంతమంది ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండాలని సందేశాలు పంపించుకున్నారు. ప్రస్తుతం ఈ సందేశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చాట్‌ల వెనుక ఉన్న రహస్యం, వాటిని పంపిన వ్యక్తుల గుర్తింపును ధృవీకరించే ప్రక్రియ కొనసాగుతోంది. అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా బయటకు వచ్చిన చాట్‌లలో.. నిరసన ప్రాంతానికి చేరుకున్న తర్వాత మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవచ్చని హెచ్చరికలు ఉన్నట్లు సమాచారం. గతంలో కూడా పోలీసులు నెట్‌వర్క్ జామర్లు ఉపయోగించారని, ఈసారి కూడా అదే జరిగే అవకాశం ఉందని పేర్కొంటూ ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ మార్గాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఒక సందేశంలో.. 'నిరసన ప్రాంతానికి వెళ్లాక ఫోన్ నెట్‌వర్క్ ఉండకపోవచ్చు. అందుకే ముందుగానే అందరూ ఒకే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని కనెక్ట్ అవ్వాలని సూచించినట్లు పోలీసులు గుర్తించారు. బ్లూటూత్ సిగ్నల్ ఆధారంగా పనిచేసే కొన్ని యాప్‌ల లింకులను కూడా అదే గ్రూపులో షేర్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ యాప్‌లపై సైబర్ నిపుణులు సాంకేతిక విశ్లేషణ చేస్తున్నారు. చాట్‌ల్లో తీవ్ర రాజకీయ హెచ్చరికలు కూడా ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఒక సందేశంలో రేపే మోడీ ప్రభుత్వానికి చివరి రోజు అని ఉంది. మరోవైపు కొందరు నిరసనకారులు ఉద్యమం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఒక సందేశంలో.. ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నవారు గుర్తుంచుకోండి.. వి□ త్యాగాన్ని భావితరాలు గుర్తుంచుకుంటాయి.' అని ఉండగా.. మరో సందేశంలో 'ఎవరైనా చనిపోతే ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయాలేనా? లేక నిరసనలను హింసాత్మకంగా మార్చేందుకు ముందస్తు వ్యూహంలో భాగమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చాట్ సందేశాలతో పాటు సీసీటీవీ ఫుటేజ్, డ్రోన్ వీడియోలు, మొబైల్ ఫోన్ వీడియోలు, ఇతర డిజిటల్ ఆధారాలను కూడా ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు అధికారులు తెలిపారు. పోలీసుల ప్రకారం.. ప్రతి డిజిటల్ సందేశాన్ని సాంకేతికంగా ధృవీకరించిన తర్వాతే సాక్ష్యంగా పరిగణిస్తామని, దర్యాప్తులో లభించే ఆధారాల ఆధారంగానే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు.. కాలం తెచ్చిన కరువు కాదు



ఒక్క పైసా అందలేదన్నారు. రెండున్నర నెలలు గడిచిన ప్రభుత్వం స్పందించకపోవడంపై మండిపడ్డారు. రైతులు మృతి చెందినప్పుడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు రోడ్డుపై 8 గంటల పాటు దర్నా చేసిన కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే సైతం స్పందించకపోవడంతో చివరికి అదనపు కలెక్టర్ పంపించారు. నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేయడంతో హామీ ఇచ్చిన ప్రభుత్వం విస్మరించిందని పేర్కొన్నారు. వెంటనే వారు నా దృష్టికి తీసుకురావడం, కేసీఆర్ సమాచారం అందించడంతో రూ.20 లక్షలు ఇవ్వాలని ప్రకటించడం జరిగిందన్నారు. మృతి చెందిన రైతుల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

ప్రభుత్వం రైతులను పాములాగా కాటేస్తుందని పేర్కొన్నారు. సీఎం రెవంత్ రెడ్డికి రెండు మాత్రమే తెలుసు ఒకటి ఒట్లు రెండవది తిట్లు అని పేర్కొన్నారు. కేసీఆర్ కి పేరు వస్తుందని మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగినాయన్న సాకుతో కన్నెపల్లి పంప్ హౌజ్ నుంచి నీళ్లు తీసుకునే అవకాశం ఉన్న ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయకుండా రైతులను గోస పెడుతుందన్నారు. రైతులు నీళ్లు అడిగితే బీఆర్ఎస్ నేతల రక్తం చల్లాలని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటంపై తీవ్రంగా మండి పడ్డాడు. కాంగ్రెస్ పాలన ఇంటర్వెల్ వరకు ఫ్లాప్ సినిమాగా తేలిపోయిందని మిగిలిన సగం ఏమీ లేదన్నారు. రైతులకు నాలుగు సార్లు రైతు బందు ఎగ్గొంటిందన్నారు. 3 నెలల్లో పిల్లలు ఎలా పుడుతారన్న సీఎం 32 నెలల్లో పిల్లలు పుట్టకపోవడాన్ని ఎమనాలన్నారు. తెలంగాణలో రూ.50 లక్షలతో ఎమ్మెల్యేను కొనుగోలు చేసే జాతి మాది కాదన్నారు.

**-మంచిర్యాల ఎమ్మెల్యే పద్ధతి మార్చుకో..**

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పద్ధతి మార్చుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు క్షోభ పెడితే వదిలిపెట్టం అంటూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హాలు అమలు చేసేలా కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టిన అధికారులపై అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరిని కూడ రిటైర్ ఐన వదిలిపెట్టం అంటూ తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు.

**సీఎంకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్న కేటీఆర్**

**-బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్**

సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి భయపడి పార్ములా ఈ కార్ రేసులో కేసు పెట్టారని పేర్కొన్నారు. రైతులకు ఆపద్భాందవుడని కొనియాడాడు రానున్న రోజుల్లో సింగరేణిలో పర్యటిస్తారని పేర్కొన్నారు.

**-ఎమ్మెల్యే రూ.500 కోట్లు అప్పు కట్టాడు..**

**-మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు**

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు బ్యాంకులకు రూ.500 కోట్లు అప్పులు కట్టాడని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఆరోపించారు. 4 రైతులు చనిపోయిన సంఘటన స్థలానికి రాలేదని ప్రభుత్వం నుంచి మృతుల కుటుంబాలకు సహాయం అందలేదన్నారు. మళ్లీ కేసీఆర్ పాలనా రావలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

## త్వరితగతిన పనులు పూర్తి చేయండి

వంటి తదితర నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని అధికాలను ఆదేశించారు.హకీంపేట్, లగచర్ల లో జరుగుతున్న అభివృద్ధి పనులకు భూములు కోల్పోయిన రైతులకు వారంలోగా ఇళ్లపట్టాలు ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ప్రతీవారం తనకు రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. కొడంగల్–నారాయణ పేట్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,భూసేకరణ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, సెప్టెంబర్ లోగా భూసేకరణ పూర్తి చేయాలని అన్నారు. అదనపు పంపుల ఏర్పాటు కు అవసరమైన సివిల్ పనులన్నీ వర్క్ ఆర్డర్ ఇచ్చి పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంబడి పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి ప్రత్యేక చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వి.పి.గౌతమ్,మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ టికే శ్రీదేవి, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, టీజీ ఐఐసిబిసి ఎండి శశాంక,కడ ఆఫీసర్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు చేదు అనుభవం

**హైదరాబాద్,జూలై21(నినాదం):**
హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో చేదు అనుభవం ఎదురైంది. వీఐపీలు ప్రవేశించే గేట్ నంబర్ 6 నుంచి కాకుండా, సామాన్య ప్రజలు ప్రవేశించే గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని రంగనాథ్‌కు సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. దీంతో గేట్ నంబర్ 4 వద్ద సామాన్య ప్రజలు వాహనాలు పార్క్ చేసే స్థలంలో కారు పార్క్ చేసి, అక్కడి నుండి నడుచుకుంటూ కోర్టులోకి వెళ్లారు. కాగా, ప్రైవేట్ ఆస్తి వివాదంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఒకే అంశానికి సంబంధించి ఏకంగా 3 కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవడం అత్యంత తీవ్రమైన విషయమని వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం వెనుక కారణమేమిటని నిలదీసింది. ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని స్పష్టమైన ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని లెకచేయకుండా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన అలవాటుగా మారిందా? కోర్టు ధికరణనే పరిపాటిగా మార్చుకున్నారా? అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకటి కాదు, రెండు కాదు, ఒకే అంశంపై 3 కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవుతున్నా యంటే కోర్టు ఉత్తర్వుల పట్ల ఎంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతున్న దని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టుల పట్ల ఎంత గౌరవం ఉన్నదో ఈ పరిణామాలే చెప్తున్నాయని పేరొంది. ఇకడ బాధితుడు పిటిషనర్ కాదని, స్వయంగా కోర్టేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వులను ధికరించడం ఎంతమాత్రం సహించబోమని రంగనాథ్‌కు తేల్చిచెప్పింది. ప్రభుత్వమైనా, ప్రభుత్వాధికారులైనా చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల పరిరక్షణ పేరుతో కోర్టు ఉత్తర్వులను పకనపెట్టి ప్రైవేట్ భూముల్లోకి వెళ్లడం ఏ చట్టం ప్రకారం సమర్థనీ యమని ప్రశ్నించింది. యజమాని అనుమతి లేకుండా ప్రైవేట్భూమిలో అడుగు పెట్టరాదన్న ప్రాథమిక సూత్రం తెలియదా అని నిలదీసింది. ప్రభుత్వ భూమిని రక్షించడమే లక్ష్యమైతే ప్రైవేట్ వ్యక్తిపై పోలీసు ఫిర్యాదు ఎందుకు చేశారని ప్రశ్నించింది.

## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

హైదరాబాద్ : బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సవిక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూలైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువ□స్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణ యాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

**హన్మకొండ,జులై 21(నినాదం):**

రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సవి క్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# బాలికలను ప్రోత్సహించడం అభినందనీయం

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





**వనపర్తి ప్రతినిధి, జూలై 21( నినాదం) :** గ్రామీణ భాగస్వామ్య సంస్థ (విబిపి) బాలికల విద్యను ప్రోత్సహిస్తుండటం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ లో గ్రామీణ భాగస్వామి సంస్థ ఆధ్వర్యంలో బాలికల విద్యాభివృద్ధి, ఉన్నత విద్యపై వారిలో మరింత ప్రోత్సాహం కల్పించే లక్ష్యంతో గ్రామీణ భాగస్వామ్య సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.నాగేంద్ర స్వామి పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్ని మండలాల్లో 10వ తరగతిని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో చదివి ప్రథమ స్థానంలో నిలిచిన బాలికలకు ప్రోత్సాహక బహుమతులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు, గ్రామ సర్పంచులకు, వార్డు సభ్యులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి నగదు బహుమతి రూ.5000 వేలు, తల్లిదండ్రులకు వస్త్రాలు, అమ్మాయిల పైచదువుల కోసం రూ.20 వేలు బ్యాంక్ డిపాజిట్ చేయడం జరిగింది. గ్రామంలో పచ్చదనంలో భాగంగా చింత, నేరేడు, గానుగ మొక్కలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల విద్యను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థినులు కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం విద్యార్థుల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ 2016 మొదటి బ్యాచ్ అమ్మాయి కవిత వంటి విజేతలను స్ఫూర్తిగా తీసుకుని మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని విద్యార్థినులకు సూచించారు. అమరచింత నుంచి కే. యామిని 470 మార్కులు, ఆత్మకూర్ కు చెందిన పవిత్ర 530 మార్కులు, చిన్నంబావి నుంచి సింధు 490 మార్కులు, గోపాల్ పేట ఎం.భారతి 518 మార్కులు, ఖిల్లా ఘనపురం బి.మౌనిక 511 మార్కులు, ఏ.ఝాన్సీ రాణి 524 మార్కులు, మదనాపురం నుంచి జి.అరుణ 482 మార్కులు, పానగల్ కే.నందిని 547 మార్కులు, పెబ్బేరు జి.ఐశ్వర్య 522 మార్కులు, పెద్దమందడి పి.దీప్తి 536 మార్కులు, రేవల్లి కే.పావని 460 మార్కులు, వీదుల జి.జీవిత 460 మార్కులు, శ్రీరంగాపూర్ పి.మాధవి 499 మార్కులు, వీపన గండ్ల జి.రాజేశ్వరి 509 మార్కులు, వనపర్తి నుంచి నిహారిక 513 మార్కులు సాధించిన విద్యార్థినిలను శాలువాలతో సత్కరించి వారికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రంజిత్ రెడ్డి, విలేజెస్ ఇన్ పార్ట్నర్‌షిప్ టి.నాగేంద్ర స్వామి, శ్రీధర్, వెంకట్రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల సుందరీకరణకు కృషి

- ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు
- పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, జూలై 21 (నినాదం):** అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలోని చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్టిఎల్ పరిధిలోని స్థలాల ఆక్రమణకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. మంగళవారం సాయంత్రం నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో గల పోచమ్మ కుంట, అమీన్పూర్ డివిజన్ పరిధిలోని దయారా పరిధిలోని జంగంకుంటల పరిధిలో చెరువు సరిహద్దులను నిర్ణయించి.. సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వడక్పల్లి గ్రామ చెరువు బఫర్ జోన్ పరిధిలో ప్రముఖ నిర్మాణ సంస్థ బఫర్ జోన్ ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించిందని స్థానికులు ఫిర్యాదు చేయడం జరిగిందని.. వెంటనే దానిని తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తు తరాలకు నీటి వనరులను అందిస్తూ ప్రకృతి సమతుల్యతకు కీలకమైన చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని.. ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, డిఈ బాల గణేష్, తదితరులు పాల్గొన్నారు.


# గుట్టుచప్పుడు కాకుండా సెటిల్‌మెంట్?

ఆప్కారి కానిస్టేబుల్‌పై అక్రమాల ఆరోపణలు?

స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం,

పటిక నిర్వహణపై వివాదం

నిష్పక్షపాత విచారణకు స్థానికుల డిమాండ్



**మోతె, జూలై 20 (నినాదం):** తిరుమలయపాలెం మండలం గైగోలపల్లి గ్రామంలో స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్న 20 బస్తాల నల్లబెల్లం, రెండు క్వింటాళ్ల పటిక వ్యవహారం వివాదాస్పదంగా మారింది. మోతె మండలంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఆప్కారి కానిస్టేబుల్‌పై నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వాధీనం చేసుకున్న వస్తువులను అధికారికంగా శాఖ స్టేషన్‌లో అప్పగించకుండా వ్యవహరించారనే ప్రచారం స్థానికంగా చర్చనీయాంశమైంది. స్థానికుల కథనం ప్రకారం, గోపతండాకు చెందిన ముగ్గురు వ్యక్తులకు స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, పటికను విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనంతరం సంబంధిత వ్యక్తులు సూర్యాపేట ఆప్కారి స్టేషన్‌కు వెళ్లినప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని చెబుతున్నారు. అధికారిక రికార్డుల్లో స్వాధీనం చేసిన వస్తువుల నమోదు లేదని, అవి స్టేషన్‌కు చేరలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారాన్ని బయటకు రాకుండా మధ్యవర్తుల ద్వారా రాజీ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయనే ప్రచారం కూడా ఉంది. అక్రమాలకు పాల్పడిన వారిపై జరిమానాలు వసూలు చేసినప్పటికీ, స్వాధీనం చేసిన వస్తువుల నిర్వహణలో పారదర్శకత పాటించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా, ఓ బెల్లం వ్యాపారితో సదరు కానిస్టేబుల్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నెలవారీ మామూళ్లు తీసుకుంటూ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిపైనే చర్యలు తీసుకునేలా వ్యవహరించారనే ప్రచారం స్థానికంగా జరుగుతోంది. ఈ ఆరోపణల నేపథ్యంలో శాఖాపరమైన చర్యలకు బదులుగా సదరు కానిస్టేబుల్‌ను సెలవుపై పంపించారనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారం బయటకు రాకుండా మోతె మండలానికి చెందిన ఓ విలేకరితో రూ. 30 వేల మేర రాజీ (సెటిల్‌మెంట్) జరిగిందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ అంశంపై కూడా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు. స్వాధీనం చేసిన నల్లబెల్లం, పటికకు సంబంధించిన రికార్డులు, కేసు నమోదు ప్రక్రియ, స్వాధీనం అనంతరం అనుసరించిన విధివిధానాలపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి, నిజానిజాలు తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


# ఫీజు రియంబర్స్మెంట్‌లను వెంటనే విడుదల చేయాలి

- ఎమ్మెల్సీ వంశీ కోటిరెడ్డి





**నల్గొండ ప్రతినిధి, జూలై 21 (నినాదం):** పెండింగ్‌లో ఉన్న ఫీజు రియాంబర్స్మెంట్ ను విడుదల చేయాలి ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నల్గొండ పట్టణ కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశంనిర్వహించడం జరిగింది. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కాపాడటమే లక్ష్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నేతలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు, మేధావులు పెద్దయెత్తున హాజరై పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేయడం జరిగింది. వారు మాట్లాడుతూకాంగ్రెస్ పార్టీ అంటేనే సంక్షోభం, కేవలం 30 నెలల పాలనలోనే రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేయడం జరిగింది. విద్యా వ్యవస్థను నాశనం చేస్తే శాశ్వతంగా సమాజం భ్రష్టు పడుతుందన్న లక్ష్యంతోనే విద్యాశాఖ తన దగ్గర పెట్టుకొని స్వయంగా తన చేతులతోనే నాశనం చేస్తున్నారని అన్నారు. శాసన మండలిలో ఈ సమస్య నా వంతు పోరాటం చేసి కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచేలా కృషి చేస్తామని భరోసా ఇవ్వడం జరిగింది. మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ. జిల్లా కేంద్రంగా ఈ ఫీజు రీయింబర్స్మెంట్ పై 10 వేల మంది విద్యార్థులతో, తల్లిదండ్రులతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వొణికించేలా పెద్దయెత్తుల ఉద్యమం చేపడుతామని అన్నారు. ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతు పేద బడుగు బలహీన వర్గాల ప్రజల్ని విద్యకు దూరం చేసే కుట్ర కాబట్టి దాన్ని అడ్డుకోవాలనే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసాము. మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూభారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేటి వరకు విద్యా రంగం ఏ పార్టీ ప్రభుత్వానికి విద్యా వ్యవస్థ మొదటి ప్రాధాన్యం కాదని, పాలకుల ప్రియార్టీలో విద్యా వ్యవస్థ లేనన్ని రోజులు సమాజంలో మార్పు రావడం అసంబంధం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ , సామాజికవేత్త చెరుకు సుధాకర్ మాజీ మున్సిపల్ చైర్మన్ సైది రెడ్డి, బీసీ సంఘం నేతలు, ప్రజా సంఘాలు మిరియాల యాదగిరి, దుందుల లక్ష్మీ నారాయణ, జనార్ధన్ గౌడ్, కోడూరి లక్ష్మీ నారాయణ, రఫీ, పాలడుగుల నాగార్జున, రాకేష్ రెడ్డి, ప్రయివేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మారం నాగేందర్, హనుమంతు యాదవ్, జూనియర్ కళాశాలల సంఘం మల్లారెడ్డి, రాజేందర్ రెడ్డి, రాపోలు శ్రీజ, విద్యార్థి సంఘాల నేతలు దీ=హా౦ నేతలు నాగార్జున, షోయబ్, రమేష్, వాడపల్లి నవీన్, పురుషోత్తం యాదవ్, స్వేరోస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్, మీఖీ సుధీర్, జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్, జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, దేవేందర్ రెడ్డి, పిల్లట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్ల భద్రతకు పోలీసుల భరోసా



**కోదాడ, జూలై 21 (నినాదం):** కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ సిటిజన్స్ రక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శివశంకర్ మాట్లాడుతూ వృద్ధుల భద్రత, సంక్షేమానికి పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, వృద్ధులపై వేధింపులు లేదా మోసాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీనియర్ సిటిజన్లకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, అవసరమైతే డయల్--100 లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు అజయ్ కుమార్ ,ఉపేందర్ రెడ్డి కమిటీ సభ్యులు, స్థానిక వృద్ధులు పాల్గొన్నారు.

## మోడిఫైడ్ సైలెన్సర్లపై పోలీసుల ఉక్కుపాదం



**కోదాడ, జూలై 21 (నినాదం):** జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన పోలీసులు అధిక శబ్దం చేస్తున్న 40 మోడిఫైడ్ బుల్లెట్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని రంగా థియేటర్ చౌరస్తాలో రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు మార్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


IKF Home Finance

**ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**
ఈక్వినాక్స్ బై ఫోనిక్స్ - టవర్ 3,10వ అంతస్తు, డైమండ్ హిల్స్, లుంబినీ అవెన్యూ, రాయ్ దుర్గ్, గచ్చిబౌలి, హైదరాబాద్ , తెలంగాణ - 500 081

**ఇ-వేలం అమ్మకపు ప్రకటన (అమ్మకము ఇ-బిడ్డింగ్ ద్వారా మాత్రమే)**

**సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) మరియు 9(1) క్రింద జారీ చేయబడిన స్థిర సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకపు ప్రకటన**

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా **కాలమ్-(ఎ)**లోని రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జ్ చేయబడిన **కాలమ్-(సి)**లో వివరించిన స్థిరాస్తి (ఆస్తులు) సెక్యూర్డ్ క్రెడిటార్ **ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** హౌసింగ్ యొక్క **అధీకృత అధికారిచే కాలమ్-(డి)**లో వివరించిన విధముగా **స్వాధీనములోకి** తీసుకోబడినవి, అవి దిగువ తెలిపిన వివరాల ప్రకారం **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే", "ఉన్నవి ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏమున్నవో అవే"** ప్రాతిపదికపై విక్రయించబడతాయి.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని **రూల్ 9(1)** క్రింద **కాలమ్-(ఎ)లో** సూచించిన విధంగా రుణగ్రహీత/ తనఖాదారు(లు)/ సంబంధిత రుణగ్రహీత(లు)/ తనఖాదారు(ల)/ (మరణించినందున) యొక్క న్యాయవారసులు, న్యాయప్రతినిధులు **(తెలిసిన లేదా తెలియనివారు)**, ఎగ్జిక్యూటర్(లు), అడ్మినిస్ట్రేటర్(లు), వారసుడు(లు) మరియు అస్సైన్(లు)కు ఇందుమూలముగా పైన తెలిపిన విధంగా తెలియజేయడమైనది. అమ్మకము యొక్క సవివరమైన నియమనిబంధనల కొరకు **ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ అనగా **https://ikfhomefinance.com & https://bankauctions.in** లో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయగలరు.

| క్ర. సం. | [A] రుణ ఖాతా నెం./ రుణగ్రహీత(లు)/ తనఖాదారు(లు)/ హామీదారు(ల) పేర్లు | [B] రాబట్టుకోవలసిన మిగిలిన బకాయి మొత్తాలు (సెక్యూర్డ్ రుణాలు) | [C] స్థిరాస్తి/ సెక్యూర్డ్ ఆస్తి వివరణ | [D] స్వాధీనతా రకము | [E & F] రిజర్వు ధర (రూ.లలో) | [E & F] బయానా (రూ.లలో) | [G] వేలం తేది & సమయం |
|---|---|---|---|---|---|---|---|
| 1. | రుణ ఖాతా నెం.(లు). LNSRD02922-230004727 1. శ్రీ గౌడ్ల రాజశేఖర్, (దరఖాస్తుదారు) 2. శ్రీ గౌడ్ల రాజశేఖర్ 3. శ్రీమతి గౌడ్ల సుజాత, (సహ-దరఖాస్తుదారు) క్ర.సం. 1 & 3 కోసం చిరునామా: ఇం.నెం,8-82/16/ఎ, హౌసింగ్ బోర్డ్ జోగిపేట్, హౌసింగ్ కాలనీ దగ్గర కాలనీ మెదక్, అందోల్ మండలం, సంగారెడ్డి, తెలంగాణ-502 270.; మరియు క్ర.సం. 2 కోసం చిరునామా: దుర్గా పౌల్ట్రీ & చికెన్ సెంటర్ కార్యాలయం, ఇం.నెం.9-2/7, హౌసింగ్ బోర్డ్ జోగిపేట్, అందోల్ మండలం, సంగారెడ్డి, తెలంగాణ-502 270. | 05.06.2026 నాటికి బకాయి మొత్తం రూ. 16,44,779.18 (రూపాయలు పదహారు లక్షల నలభై నాలుగు వేల ఏడు వందల డెబ్బై తొమ్మిది మరియు పైసలు పద్దెనిమిది మాత్రమే) | సంగారెడ్డి జిల్లా, ఆందోల్ జోగిపేట మండలం, ఆందోల్ నగర పంచాయతి మరియు గ్రామం వద్ద 166 చ.గ.లు భూమి విస్తీర్ణంతో మరియు 1044.50 చ.అ.ల బిల్టప్ ఏరియా సైట్‌లో ఇం.నెం.8-33/1 (పాత), 9-99/1 (క్రొత్త) గల భూమి మరియు భవనం యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** దేవస్థానం ఖాళీ ప్రదేశం, **దక్షిణం:** కోటల రోడ్డుకు మార్గము, **తూర్పు:** ఖాళీ ప్రదేశం, **పడమర:** ఇం.నెం.8-33/1 యొక్క భాగం, బాబు మియా ఇల్లు. * పైన తెలిపిన ఆస్తి సంగారెడ్డి రిజిస్ట్రేషన్ జిల్లా మరియు జోగిపేట రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా పరిధిలో కలదు. | [illegible] | రూ. 30,00,000/- (రూపాయలు ముప్పై లక్షలు మాత్రమే) | రూ.3,00,000/- (రూపాయలు మూడు లక్షలు మాత్రమే) | 06.08.2026న మ.02.00 గం॥ల నుండి సా.04.00 గం॥ల వరకు (టెండరు డాక్యుమెంటు నిబంధనల ప్రకారం ప్రతి 5 ని॥లకు ఒకసారి ఆటోమెటిక్ పొడిగింపులతో) |
| 2. | రుణ ఖాతా నెం.(లు). LNBHN02822-230006130 & LNBHN02523-240010737 1. శ్రీ ఆపూరి రామనర్సయ్య, (దరఖాస్తుదారు) తండ్రి శ్రీ ఆపూరి నర్సింహ 2. శ్రీమతి ఆపూరి సునీత, (సహ-దరఖాస్తుదారు) భర్త శ్రీ ఆపూరి రామ నర్సయ్య క్ర.సం. 1 & 2 కోసం చిరునామా: ఇం.నెం.1-38, బండసోమారం, మైసమ్మ దేవాలయం దగ్గర, చందుపట్ల బి.ఓ., భువనగిరి, నల్గొండ, తెలంగాణ-508 118. | 13.07.2026 నాటికి బకాయి మొత్తం రూ. 8,68,518.50 (రూపాయలు ఎనిమిది లక్షల అరవై ఎనిమిది వేల ఐదు వందల పద్దెనిమిది మరియు పైసలు యాభై మాత్రమే) LNBHN02822-230006130 కు సంబంధించి & రూ. 2,29,157.92 (రూపాయలు రెండు లక్షల ఇరవై తొమ్మిది వేల నూట యాభై ఏడు మరియు పైసలు తొంభై రెండు మాత్రమే) LNBHN02523-240010737 కు సంబంధించి | యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం, బండసోమారం గ్రామం & గ్రామపంచాయతి వద్ద 670 చ.అ.ల ఆర్‌సిసి రూఫ్ ఏరియాతో 180 చ.గ.లు లేదా 150.48 చ.మీ.ల విస్తీర్ణంతో టాయిలెట్లు మరియు ఖాళీ ప్రదేశంతో ఒక హాల్, ఒక కిచెన్ గది, ఒక పూజా గది, రెండు గదులు గల అస్సెస్‌మెంట్ నెం. 463, గ్రామకంఠంలో ఇం.నెం.1-54/1 యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** బండసోమారం నుండి వీరవెల్లి రోడ్డు, **దక్షిణం:** సుప్రంగ రాములు ఇల్లు, **తూర్పు:** 10' వెడల్పు మార్గము, **పడమర:** ఎస్‌సి కమ్యూనిటీ హాల్. | [illegible] | రూ. 22,00,000/- (రూపాయలు ఇరవై రెండు లక్షలు మాత్రమే) | రూ.2,20,000/- (రూపాయలు రెండు లక్షల ఇరవై వేలు మాత్రమే) | 06.08.2026న మ.02.00 గం॥ల నుండి సా.04.00 గం॥ల వరకు (టెండరు డాక్యుమెంటు నిబంధనల ప్రకారం ప్రతి 5 ని॥లకు ఒకసారి ఆటోమెటిక్ పొడిగింపులతో) |

తనిఖీ తేది & సమయం : 04.08.2026న ఉ.11.00 గం.ల నుండి సా.4.00 గం.ల మధ్యన | కనీస బిడ్డు పెంపుదల మొత్తం: రూ. 10,000/-

పాల్గొనుటకు బిడ్/ బయానా/ దరఖాస్తు కొరకు అభ్యర్థన పత్రము దాఖలుకు ఆఖరి తేది: 05.08.2026న మ.12.00 గం॥ల లోగా.

* చెల్లింపు తేది మరియు/ లేదా అది వసూలు అయ్యే తేదీ వరకు లెక్కించే విధంగా రుణ ఒప్పందం నిబంధనల ప్రకారం వర్తించు విధంగా తదుపరి వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥గు॥ వాటితో పాటు. ఆస్తి తనిఖీకి సంబంధించిన ఏదేని సహాయం కొరకు లేదా బిడ్డు డాక్యుమెంట్ పొందేందుకు మరియు ఏదేని ఇతర విచారణల కొరకు **శ్రీ మల్యాల రవికిరణ్, మొబైల్ నెం.7794858855** మరియు ఇ-మెయిల్ ఐడి: **ravikiranadv@ikfhomefinance.com / శ్రీ బాలాజీ ఠాకూర్, మొబైల్ నెం.917396899696** పై ప్రధాన కార్యాలయం వద్ద సంప్రదించవలెను. **ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారికి తెలిసినంత వరకు లేదా సమాచారం మేరకు పైన తెలిపిన స్థిరాస్తులు/ సెక్యూర్డ్ ఆస్తులపై తాకట్టు రుణభారములు లేవు.

**తేది: 20.07.2026**
ప్రదేశం: సంగారెడ్డి/ యాదాద్రి భువనగిరి, తెలంగాణ

సం/- అధీకృత అధికారి
ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున


# రహదారి భద్రత సమర్థవంతంగా ఉండేందుకు చర్యలు

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, జులై 21 (నినాదం):** జిల్లాలో రహదారి భద్రతను మరింత సమర్థవంతంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లాల్లో రహదారి భద్రతకు సంబంధించిన చర్యలు, సుప్రీంకోర్టు కమిటీ ఆదేశాల అమలు పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతా రెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ, పోలీసు శాఖ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ సమన్వయంతో రహదారి భద్రతా చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు, ట్రక్కులు పార్కింగ్ చేయవద్దని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలు మినహా ఎక్కడా వాహనాలు పార్కింగ్ చేయవద్దని స్పష్టం చేశారు. అలాగే రోడ్డుపై ఆక్రమణలు ఉండకుండా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు అధికారులు, పోలీసులు, జాతీయ రహదారుల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే జాతీయ రహదారుల వెంట పోలీస్, రవాణా శాఖ అధికారుల పెట్రోలింగ్ వాహనాలు ఎప్పుడూ పెట్రోలింగ్ చేసేలా చూడాలని సూచించారు. ఆ వాహనంలో అత్యవసర సేవలు అందించే సామాగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ జిల్లా పరిధిలో అన్ని ఆసుపత్రుల వివరాలు, ట్రామా కేర్ సెంటర్ల వివరాలు మ్యాపింగ్ చేసి అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. అన్ని జిల్లాల్లో బ్లాక్ స్పాట్స్ గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి భద్రతపై సుప్రీంకోర్టు కమిటీ ఆదేశాల అమలుపై రేపటిలోగా పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై అక్రమ ఆక్రమణల తొలగింపు, పార్కింగ్ నిషేధిత ప్రాంతాల అమలు, రోడ్డు భద్రతా తనిఖీలు, సమర్థవంతమైన పహారా, తదితర అంశాలపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జిల్లా హైవేస్ టాస్క్‌ఫోర్స్ను మరింత చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసి అక్రమ ఆక్రమణల జాబితాను సిద్ధం చేసి తొలగింపు చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ఈఈ పరిమళ, డిటిఓ సురేష్ పాల్గొన్నారు.


IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT L.B NAGAR
S.O.P NO. 6 OF 2026

Between:

Sri Pratapgiri Rama murti S/o Late. P. Ravindranath, aged about 75 years, Occ: Retired Lecturer, r/o H.No. 10-28, Patel Nagar colony, Saroornagar, Dilsuk Nagar, Hyderabad ..Petitioner

The Unit Trust of India, Office Address: Tilak Road Abids, Hyderabad and others. ..Respondents

NOTICE

Please take notice that, the above named petitioner has filed Succession OP to declare the petitioner as the successor and legal heir of late P. Savitha, and the matter is posted for any claims or objections from any concerned. Hence if any person/s, is/are having any claims or objections. They may appear before this Hon'ble court **on 31.08.2026 at 10.30 am** either in person or through an advocate duly instructed by you. With all relevant documents, failing which, the matter will be decided in Ex-parte.

// BY ORDER OF THE COURT//

R. SRIDHAR
J. RAMU PAWAR
R. HARINI, R. JASWANTH
H.NO. T-44, Saroornagar colony, Saidabad, Hyderabad
COUNSEL FOR PETITIONER.
Mob: No. 9848802033, 9440123461


# కొల్చారం సత్యసాయి రైస్‌మిల్లుపై విజిలెన్స్ దాడి

**కొల్చారం, జూలై 21 (నినాదం):** మెదక్ జిల్లా కొల్చారం మండలం శివారులో గల సత్యసాయి ఆగ్రో ఇండస్ట్రీస్ పై సోమవారం పౌరసరఫరాల శాఖ ప్రత్యేక విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీ నిర్వహించారు. వారు నిర్వహించిన తనిఖీల్లో 2025--26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ ధాన్యం నిల్వల్లో భారీ తేడాలు వెలుగులోకి వచ్చాయి. 2025--26 ఖరీఫ్ సీజన్‌లో సత్యసాయి ఆగ్రో ఇండస్ట్రీస్‌కు సీఎంఆర్ కింద ప్రభుత్వం 7,720.520 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, ఈ ధాన్యానికి సంబంధించి సీఎంఆర్‌లో భాగంగా 5,172.000 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి సరఫరా చేయాల్సి ఉంది. కాగా, ఇప్పటివరకు 2,207.000 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ మార్కెటింగ్ ద్వారా ప్రభుత్వానికి సరఫరా చేశారు. సీఎంఆర్ కింద సరఫరా చేసిన బియ్యం నిల్వలను మినహాయిస్తే, మిల్లులో ఇంకా 4,426.490 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉండాల్సి ఉండగా, తనిఖీల సమయంలో కేవలం 1,396.536 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో 3,029.960 మెట్రిక్ టన్నుల ధాన్యం తనిఖీల్లో నిల్వలు గల్లంతైనట్లు తెలిపారు . ఈ నేపథ్యంలో విజిలెన్స్ పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లు యాజమాన్యం పై ఈసీ చట్టం--1955, సెక్షన్ 6(ఏ) కింద కేసునమోదు చేసి, మిల్లును సీజ్ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానంద తెలియజేశారు.



# అభివృద్ధిపై చర్చించే హక్కు బీఆర్ఎస్‌కు లేదు



**అమరచింత, జూలై 21, (నినాదం):** అవినీతిలో కూరుకుపోయి గత ఎన్నికల్లో గోరంగా ఓటమిపాలైన బీఆర్ఎస్ పార్టీకి అవినీతి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ డిసిసి కార్యదర్శి ముదిరాజు రమేష్ పట్టణ అధ్యక్షులు రవికాంత్ మాజీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రడ్డి పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్ ప్రకాశం తౌఫిక్ అన్నారు. మంగళవారం అమరచింత పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి గురించి మాట్లాడుతున్న అమరచింత టిఆర్ఎస్ పార్టీ నాయకులు మొన్న జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయి ప్రజల చీత్కారానికి గురయ్యారని తెలుసుకోవాలన్నారు. గీతా పారిశ్రామిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ అమరచింత వాసి కేశం నాగరాజు పై అనవసరమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎనిమిదో వార్డులో కాంగ్రెస్ పార్టీకి రెండో స్థానం దక్కిందని ఆ పార్టీ నుండి పోటీ చేసిన మీ అభ్యర్థికి ఎన్నో స్థానం వచ్చిందో తెలుసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు రేషన్ బియ్యం ఉచిత బస్సు హై స్కూల్ ఆవరణలో 60 లక్షల అదనపు గదులు ధర్మపురం నందిమల్ల రహదారులకు నాలుగు కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. మునిసిపాలిటీకి 15 కోట్ల రూపాయలు వచ్చాయని రెండు నెలల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని అప్పుడు తప్పు ఒప్పుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జింక రవి, కౌన్సిలర్ ఎరుకలి రాములు, చంద్రప్ప తాండ ఉప సర్పంచ్ సుజాత మహేష్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, రఫీ,హనుమంతు నాయక్, కరుణాకర్, కమలాకర్ గౌడ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు



**సూర్యాపేట ప్రతినిధి జూలై 21 (నినాదం):** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమని హెచ్చరించారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని విద్యార్థులకు సూచించారు. ట్రాఫిక్ ఎస్ఐ యాదవెందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు భద్రత పట్ల తల్లిదండ్రులను చైతన్యవంతం చేయాలని అన్నారు. పోలీస్ కళా బృందం వారు పాటలతో రోడ్డు భద్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ , ఎస్సై యాదవేంద్ర రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యాదయ్య వైస్ ప్రిన్సిపాల్ వాసు, మరియు ప్రసాద్,అధ్యాపక బృందం, పోలీస్ కళాబృందం ఇన్చార్జ్ యల్లయ్య, సభ్యులు గోపయ్య, కృష్ణ, చారి, సత్యం గురులింగం పాల్గొన్నారు.

# నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి

## అధికారులతో సమీక్షలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాద్ ప్రతినిధి, జూలై 21 (నినాదం):**

నిజామాబాద్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఆయన నగర అభివృద్ధిపై కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు, అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ పనులు తదితర అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నగరంలోని అన్ని ప్రధాన మార్గాలలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాలని అన్నారు. అవసరమైన చోట వన్ వే అమలు చేయాలని, యూటర్న్ ల వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రోడ్డు భద్రత నిబంధనలు పక్కగా పాటించేలా వాహన చోదకులకు అవగాహన కల్పిస్తూ, ట్రాఫిక్ రూల్స్ ను పక్కాగా అమలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.



కాగా, ఆయా ప్రాంతాలలో రోడ్లపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి వేయించాలని, చెడిపోయిన రహదారులకు మరమ్మత్తులు చేయించాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో గుంతల వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున ఈ పనులకు తక్షణమే చేపట్టాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన పురాతన వాటర్ ట్యాంకులను కూల్చి వేయించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పూలాంగ్ చౌరస్తా, ఓల్డ్ ఎల్ఐసి చౌరస్తా తదితర ముఖ్య కూడళ్ళ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులకు అవకాశం లేకుండా సర్కిళ్లను వెడల్పు చేయాలని అన్నారు. ప్రజల సౌకర్యార్థం చేపట్టిన సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ భవన సముదాయాల పనులను, కళాభారతి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయించి యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయించాలని సూచించారు. తాగునీటి సరఫరా లో ఇబ్బందులు ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ఎల్లమ్మ గుట్టలో మంచినీటి ట్యాంకును నిర్మించాలని సూచించారు. రింగ్ రోడ్డు ప్రతిపాదనలు రూపొందించాలని ఇంటింటికీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురి కాకుండా వాటి పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు అదనపు కలెక్టర్ భుజంగరావు, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రైతులు ఆరుతడి పంటలపై
# దృష్టి సారించేలా ప్రోత్సహించాలి

## సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల బ్యూరో జూలై 21( నినాదం )**



ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వ్యవసాయం, విద్యుత్, వైద్యం, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా మాట్లాడారు. ప్రతి గ్రామంలో కూరగాయల విత్తనాల ప్యాకెట్లను ఉచితంగా అందజేయడం జరిగిందని, రైతులు కూరగాయల సాగుతో పాటు ఆయిల్ పామ్ తోటల సాగు చేసేందుకు సహకరించాలన్నారు. వివిజి రాంజీ పథకంపై అవగాహన కలిగించాలని, వనమహోత్సవంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలను నాటాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు గ్రామాల్లోకమ్యూ నిటీ ఇంకుడు గుంతల నిర్మాణంతోపాటు అవసరమైన చోట బోర్ వెల్స్ రీఛార్జెస్ చేయించాలన్నారు. పైప్ లైన్స్ లీకేజీలతో తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 22న మండల స్థాయిలో, 23 నుంచి గ్రామస్థాయిలో సభలు నిర్వహించి ఈ అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, డిఆర్డిఓ ముషాహిదా బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటనారాయణ, డిపిఓ శ్రీకాంత్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల బ్యూరో జులై 21( నినాదం)**




రహదారి ప్రమాదాలతో ఏటా ఎంతో మంది మృత్యువాత పడడమే కాక క్షతగాత్రులుగా మారుతున్నారని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలపై మంగళవారం హైదరాబాద్ నుంచి బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రహదారుల భద్రతకు తమ వంతుగా కృషి చేస్తుందని, ఆయా జిల్లాల పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు వారికి సహకరించాలన్నారు. రవాణా, పోలీస్, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులతో కలిసి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలను ఎన్నుకోవాలన్నారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు, హైవే సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కమిటీలతో కలిసి పని చేసేందుకు తరచూ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, రోడ్ సేఫ్టీ కమిటీలు ఇప్పటివరకు రహదారి భద్రతపై నిర్వహించిన కార్యక్రమాల వివరాలను అడిగారు. హైవేలపై పెట్రోలింగ్ వాహనాల సేవలు, బ్లాక్ స్పాట్ల వద్ద తీసుకుంటున్న జాగ్రత్తలపై మాట్లాడారు. హైవే స్థలాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన దాబాలు, ఇతర నిర్మాణాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. హైవేల భద్రతకు సంబంధించి ఇది వరకు నిర్వహించిన కార్యక్రమాలు, సమావేశాలు, భవిష్యత్తులో చేయబోయే కార్యాచరణ ప్రణాళికపై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికలను సమర్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

### ఆటోపై నుంచి ప్రమాదవశాత్తూ పడి
# బాలుడు మృతి

**గద్వాల ప్రతినిధి జూలై 21నినాదం**

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో మంగళవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. పాల్వాయి గ్రామానికి చెందిన రంగముని అనే బాలుడు ప్రమాదవశాత్తూ ఆటోపై నుంచి కిందపడి మృతి చెందాడు.స్థానికుల వివరాల ప్రకారం, పాల్వాయి గ్రామం నుంచి ఓ ఆటో మల్దకల్ పశువుల సంతకు బయలుదేరింది. ఈ సందర్భంగా రంగముని ఆటోపైకి ఎక్కి కూర్చున్నాడు. పెద్దపల్లి సమీపానికి చేరుకోగానే ఆటో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో సమతుల్యం కోల్పోయిన బాలుడు కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఘటన గురించి తెలుసుకున్న మల్దకల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.



అనంతరం మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మల్దకల్ ఎస్ఐ శ్రీహరి తెలిపారు. బాలుడి మృతితో పాల్వాయి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



# ఓటర్ నమోదు ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలి

## సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ రాయల రాము

**ఖమ్మం ప్రతినిధి,వేంసూర్, జూలై 21(నినాదం)**

ఓటర్ నమోదు ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ రాయల రాము సూచించారు. మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండలం కుంచపర్తి గ్రామంలో సర్ ఓటర్ నమోదు ప్రక్రియ కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆగస్టు 3వ తేదీతో ఓటు నమోదు ప్రక్రియ గడువు ముగియనుందని, ఈలోగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బిఎల్వోలు ప్రతి గ్రామంలో, కాలనీల్లో ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుక్కపల్లి శ్రీనివాసరావు, రాకేష్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు చట్టసభలో 33%
# రిజర్వేషన్ కోసం ఢిల్లీలో ధర్నా

## పాల్గొన్న జిల్లా మహిళా అధ్యక్షురాలు సౌజన్య

**ఖమ్మం జులై 21(నినాదం ):**



ఢిల్లీ లో జాతీయ బిజెపి ఆఫీస్ దగ్గర అంతర్జాతీయ మహిళా అధ్యక్షురాలు అల్కా లంబా ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ నేతృత్వం లో మహిళలకి చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ధర్నా నిర్వహించటం జరి గింది. ఈ నిరసనలో జాతీయ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తో పాటు ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని భారతదేశంలో మహిళలు చిన్న చూపు చూస్తున్నారని పార్లమెంట్ సాక్షిగా వాగ్దానం చేసి కూడా పది సంవత్సరాలు గడిచిన అమలు చేయలేదని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం నిరంకుశ ప్రభుత్వ నడుపుతుందని ఈ పార్లమెంట్ సమావేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు అలాగే ఈ నిరసనలో అన్ని రాష్ట్రాల నుండి మహిళ అధ్యక్షురాళ్ల తో పాటు తెలంగాణ రాష్ట్ర అన్ని జిల్లా ల అధ్యక్షురాళ్లు పాల్గొనటం జరిగింది

### విద్యార్థుల జీవితాలతో
# కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోంది

## వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్

**వైరా, జూలై 21( నినాదం):**



విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని, ఢిల్లీలో విద్యార్థులు, యువత చేపట్టిన శాంతియుత నిరసనపై పోలీసులు లాఠీచార్జి చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ తీవ్రంగా ఖండించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,విద్యా వ్యవస్థలో నెలకొన్న అవకతవకలు, నీట్, జేఈఈ పరీక్షల పేపర్ లీకేజీలు తదితర అంశాలపై పార్లమెంట్‌కు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, యువతపై ఢిల్లీ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి రోడ్డుపై ఈడ్చుకుంటూ విచక్షణారహితంగా లాఠీచార్జి చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం దారుణమని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సింది పోయి వారి గొంతును అణచివేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.దేశ చరిత్రలో ఈ ఘటన ఒక చీకటి రోజుగా నిలిచిపోతుందని పేర్కొన్న కట్ల సంతోష్, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఈ ఘటనపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా స్వీకరించి సమగ్ర నివేదిక తెప్పించి, విద్యార్థుల హక్కుల ఉల్లంఘనకు బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.విద్యార్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, బలప్రయోగంతో ఉద్యమాలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు.

# ఆసరా దరఖాస్తుల స్థితి పరిశీలించుకోవాలి

## సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్

**భిక్నూర్, జూలై 21 (నినాదం)**



ఆసరా పెన్షన్లకు అర్హులైన వారు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని భిక్నూర్ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ తెలిపారు. గతంలో ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేసిన వారు కూడా గ్రామ సచివాలయానికి వెళ్లి తమ దరఖాస్తుల స్థితిని తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుల్లో ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని, తద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని పేర్కొన్నారు. ఆసరా పెన్షన్‌కు సంబంధించిన సందేహాలు, వివరాల కోసం గ్రామ సచివాలయ అధికారులను సంప్రదించాలని సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ సూచించారు. అర్హులైన ఒక్కరూ కూడా ఈ అవకాశాన్ని నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు

## మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో అరకొర భోజనం

**నిధుల కొరత పేరుతో చేతులెత్తేసిన యాజమాన్యం?**

**హాస్టల్ ఫీజులు, మెయింటెనెన్స్, ఫుడ్ చార్జీలు కోట్లలో వసూలు..?... అయినా విద్యార్థులకు పూట గడవని పరిస్థితి**

**"ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు" అంటూ ప్రిన్సిపాల్ సమాధానం... విద్యార్థుల్లో తీవ్ర ఆగ్రహం**






**లక్ష్మీదేవిపల్లి జూలై 21 (నినాదం):**

జిల్లా కేంద్రం సమీపంలోని కెఎస్ఎం క్యాంపస్‌లో ఉన్న మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చదువుల కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చి హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు సకాలంలో భోజనం అందడం లేదని, రోజూ ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పూట భోజనం ఇస్తే మరో పూట భోజనం లేక పస్తులు ఉండాల్సి వస్తోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల కథనం ప్రకారం... ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ వరకు హాస్టళ్లలో భోజనం పూర్తిగా నిలిపివేశారు. అనంతరం వేసవి సెలవులు ముగిసిన తర్వాత జూన్ 15 నుంచి జూలై 20 వరకు కూడా భోజనం సక్రమంగా అందించడం లేదని చెబుతున్నారు. కొన్ని రోజులు ఉదయం భోజనం లేకపోతే, మరికొన్ని రోజులు రాత్రి భోజనం లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. బయట హోటళ్లలో తినాలంటే అదనపు ఖర్చు భరించే స్తోమత చాలామందికి లేదని, పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సమస్య చెబితే స్పందన లేదు..!

తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రయత్నించినా కళాశాల యాజమాన్యం సహకరించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తే "ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదు. అందుకే సకాలంలో భోజనం పెట్టలేకపోతున్నాం. అప్పులు చేసి హాస్టళ్లను నడుపుతున్నాం" అని సమాధానం చెబుతున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు.

### ఫీజులు మాత్రం కచ్చితంగా వసూలు

హాస్టల్‌లో చేరే ప్రతి విద్యార్థి నుంచి యాజమాన్యం తప్పనిసరిగా ఫీజులు వసూలు చేస్తోంది. హాస్టల్ మెయింటెనెన్స్ ఫీజు – రూ.1,500, డిపాజిట్ – రూ.15,000, మొత్తం రూ.16,500 చెల్లించిన తర్వాతే హాస్టల్‌లో ప్రవేశం కల్పిస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం కనీసం 200 మంది కొత్త విద్యార్థులు చేరుతారని, వారి నుంచి మాత్రమే దాదాపు రూ.33 లక్షలు వసూలు అవుతున్నాయని పేర్కొంటున్నారు.

### 700 మంది విద్యార్థులు...కోట్లలో ఆదాయం..?

ప్రస్తుతం బాలురు, బాలికల హాస్టళ్లలో కలిపి దాదాపు 700 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. మెయింటెనెన్స్ ఫీజు రూపంలోనే సుమారు రూ.10.50 లక్షలు వసూలవుతున్నాయి. అదేవిధంగా నాన్-స్కాలర్ విద్యార్థులు ఒక్కొక్కరు నెలకు రూ.1,800 చొప్పున పది నెలలకు చెల్లిస్తున్నారు. ఈ విధంగా నాన్-స్కాలర్ విద్యార్థుల నుంచే సంవత్సరానికి సుమారు రూ.54 లక్షలు ఆదాయం వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. 700 మంది విద్యార్థుల్లో సుమారు 400 మంది స్కాలర్‌షిప్‌పై, మిగిలిన వారు స్వయంగా ఫుడ్ చార్జీలు చెల్లిస్తున్నారని సమాచారం. విద్యార్థుల అంచనా ప్రకారం యూనివర్సిటీకి వివిధ ఫీజుల రూపంలో సంవత్సరానికి రూ.2 కోట్ల వరకు ఆదాయం వస్తోందని, ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ నిధులు ఆలస్యమైనా నాన్-స్కాలర్ విద్యార్థుల చెల్లింపుల ద్వారానే రూ.1.35 కోట్ల వరకు అందుతున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు.

### కడుపునిండా భోజనం లేదు...

ఇంత మొత్తం వసూలు చేస్తున్నప్పటికీ హాస్టళ్లలో విద్యార్థులకు కడుపునిండా భోజనం అందించడం లేదని, నాణ్యమైన ఆహారం కూడా అందడం లేదని విద్యార్థులు మండిపడుతున్నారు. హాస్టళ్ల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ఉందని ఆరోపిస్తున్నారు. హాస్టల్ భోజన సమస్యను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ నిధులను విడుదల చేసి విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

"ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదు. హాస్టళ్ల నిర్వహణ కోసం అప్పులు చేసి మెయింటెనెన్స్ చేస్తున్నాం. అందుకే భోజన ఏర్పాట్లలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని." మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ చెప్పడం కొసమెరుపు.

### కచ్చితంగా కాకపోయినా...ఇదీ లెక్క...?

ఫస్ట్ ఇయర్ లో జాయిన్ అయ్యేటపుడు కచ్చితం గా అధి స్కాలర్షిప్ విద్యార్థులైన నాన్ స్కాలర్షిప్ అయిన 16500 కట్టే హాస్టల్ కి వెళ్ళాలి. 1st ఇయర్ లో ఒక 200 మెంబర్స్ కనిష్టంగా జాయిన్ అయ్యినా 16500×200=33,00,000 అవుతుంది. 1st ఇయర్ నుండి ఫైనల్ ఇయర్ చదివే మొత్తం హాస్టల్ విద్యార్థులు 700 మంది ఉంటె... 700×1500= 10,50,000 అవుతుంది. ఫుడ్ కోసం నానస్కార్షిప్ విద్యార్థులు ఒక 300 మంది (300×1800×10=54,00,000) చెల్లిస్తున్నారు. ప్రభుత్వ నుండి వచ్చే స్కాలర్‌షిప్ 400 మంది విద్యార్థులకి వస్తే 400×1800×10 =72,00,000. సెకండ్ ఇయర్ లో సంవత్సరం లో 200 మంది విద్యార్థులు వాళ్ళు కట్టే మెయింటెన్స్ ఫీజు 200× 16500= 33,00,000 కలిపి మొత్తం 2,03,00,000 స్కాలర్షిప్కు సంబందించిన 72,00,000 అవుద్ది. అయితే 2,03,00,000 నుంచి 72 లక్షలు తీసినా 1.30 కోట్లు ఫండ్స్ ఉంటె ఇంకా ఫండ్స్ లేవంటూ తమను పస్తులు పెట్టడం సరికాదని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్య పరిష్కారం అవుతుందో లేదో వేచి చూడాలి.




# నా కూతురిని నాకు అప్పగించండి

**కారేపల్లి పోలీసులు పట్టించుకోవడం లేదు**

**న్యాయం చేయాలని వేడుకున్న తల్లి గుగులోత్ సుజాత**

**ఖమ్మం ప్రతినిధి, జూలై 21 : (నినాదం )**

మే 31 నుండి తన కూతురు కనిపించడం లేదని, పోలీసులకు పిర్యాదు చేసినా ఇంతవరకూ ఆచూకీ తెలుసుకోలేదని, వెంటనే న్యాయం చేయాలని తల్లి గుగులోత్ సుజాత వేడుకుంది. ఖమ్మం లోన ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.... గతంలో ఒక సారి బాణోత్ ముఖేష్ అనే యువకుడు తన పాపను తీసుకెళ్తే వెతుకులాడి తీసుకొచ్చామని తెలిపింది. మళ్ళీ తన పాపకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లాడని, ఇంతవరకూ ఆచూకీ లేదని పేర్కొంది. ముఖేష్ మాత్రం ఉరిలోనే ఉన్నాడని, మేము ఎక్కడ వెతికినా పాప ఆచూకీ తెలియడం లేదని, ఈ విషయంపై కారేపల్లి పోలీసుకులకు పిర్యాదు చేశామని తెలిపింది. పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నామని, పట్టించుకోవడం లేదని తెలిపింది. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని పాప ను తమకప్పగించాలని వేడుకుంది. ఈ సమావేశంలో బాణోత్ మల్సూర్, బాణోత్ సరోజ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయండి

## తాసిల్దార్ ఎండి జమీల్

కోదేరు జూలై 21 (నినాదం): ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని తాసిల్దారు ఎండి జమీల్ బిఎల్ఓ లకు సూచించారు మంగళవారం నాడు మండలంలోని కొండరావుపల్లి ఎత్తం గ్రామాలలో పర్యటించారు ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను బి ఎల్ వో లు శ్రద్ధతో పూర్తి చేయాలన్నారు బిఎల్వోలు ప్రతి ఒక్క ఓటర్ ను కలిసి వారికి ఇచ్చిన ఫారాలను తీసుకొని ఆన్లైన్ లో పూర్తిచేయాలని బిఎల్ఓ లకు సూచించారు బి ఎల్ వోలు ఏ ఒక్క ఇంటిని కూడా వదలకుండా ప్రతి ఇంటికి వెళ్లి వారికి ఇచ్చిన ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని ఒకటి లేదా రెండుసార్లు వాళ్ళ ఇంటికి వెళ్లి వారిని పిలిపించుకొని సరియైన సమాచారం తీసుకుని ప్రతి ఒక్క ఓటర్ ప్రతి ఒక్కరిని కలిసి ఓటర్ జాబితాలో పేరు నమోదయ్య విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వారికి సూచించారు ఆగస్టు మూడో తేదీ వరకు గడువును పరిగించడం వలన ప్రతి ఒక్క బిఎల్వోలు అనుకున్న విధంగా వారి టార్గెట్లను పూర్తి చేసుకోవాలని ఆయన అన్నారు

# రాజాపూర్ లో వన మహోత్సవము

కోదేరు జూలై 21 (నినాదం): కోదేరు మండల పరిధిలోని రాజాపూర్ గ్రామంలో మంగళవారం నాడు వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మొక్కలు నాటారుసర్పంచ్ విజయలక్ష్మి హాజరై మాట్లాడారు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఆమె సూచించారు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడి కలుషితమైన గాలిని కాకుండా స్వచ్ఛమైన గాలిని తీసుకొని ఆరోగ్యంగా ఉంటామని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో ఏపీవో నాగరాజు పంచాయతీ కార్యదర్శి విష్ణు ఈసీ సరిత తదితరులు పాల్గొన్నారు



# వర్షపు నీటిని ఒడిసి పట్టి..భావి తరాలకు నీటి భద్రతను అందిద్దాం

## మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్... దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో వైభవంగా 'క్యాచ్ ది రెయిన్' కార్యక్రమం

**కామారెడ్డి రూరల్,జూలై 21 (నినాదం):**

మానవ మనుగడకు నీరే జీవాధారమని,వర్షించే ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రం లోని దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన "క్యాచ్ ది రెయిన్" (వేర్ ఇట్ ఫాల్స్,వెన్ ఇట్ ఫాల్స్) కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పడే ప్రతి వర్షపు బొట్టునూ వృధా చేయకుండా ఒడిసి పట్టుకొని, సరైన పద్ధతుల్లో సద్వినియోగం చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.రైతుల ఆవేదన – నీటి విలువ: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసే రైతులకు నీటి విలువ బాగా తెలుసని,ఒక్క వర్షపు చుక్క కోసం వారు ఎంతగానో ఎదురుచూస్తారని గుర్తుచేశారు.విద్యార్థులకు సూచన అంతటి విలువైన నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వృధా చేయవద్దని విద్యార్థులకు హితవు పలికారు.ఇళ్లలో కూడా నీటిని పొదుపుగా



వాడుతూ భావి తరాల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు.పాల్గొన్న ప్రముఖులు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి,కమిషనర్ పర్వతాలు,డి.ఈ. హన్మంత్ రావు, టి.పి.ఓ. వినీత్,హెడ్ మాస్టర్ గంగా కిషన్,ఉపాధ్యాయులు, మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పదేళ్ళ రాబంధు పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**




**నిజామాబాద్ ప్రతినిధి, జులై 21 (నినాదం) :** బీఆర్ఎస్ పదేళ్ళ రాబంధు పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడ్డారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పదేళ్ల పాలనపై రెండున్నర ఏళ్ల ప్రజాపాలన పై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. బిఆర్ఎస్ పదేళ్ళ పాలనలో అంతా తానే నడిపిన కేసీఆర్ కాళేశ్వరాన్ని నిర్మించి వేల కోట్లు దోచుకున్నారన్నారు. కాళేశ్వరంలో నీళ్ళ పేరుతో దోపిడి జరిగిందన్నారు. ఒక చోట కట్టాల్సిన ప్రాజెక్టును మరోచోట కట్టి కమిషన్ల దందా చేసింది కేసీఆర్ కుటుంబమని, ప్రాజెక్టు కుంగిపోవడానికి వారే కారణం కాదా అని అన్నారు. అప్పట్లో ఇరిగేషన్ శాఖలో తప్పులకుక ద్ర బిందువు అయిన హరీష్ రావు ఈరోజు కరువు కరువు అంటూ ఏకరువు పెట్టడం దుర్మార్గమన్నారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని , ఎందరో నిరుద్యోగుల ఉసురుపోసుకున్న కేటీఆర్ కు మాట్లాడే అ-ర్హత లేదని అన్నారు. ఉద్యోగాల పేరుతో కేటీఆర్ దొంగ ఏడుపు ఏడుస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ళలో 70 వేల ఉద్యోగాలు ఇచ్చిందని, వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలు మా దగ్గర ఉన్నాయని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ళు, మహిళలకు ఉచిత బస్సు హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వెళ్తున్నామన్నారు. నియోజకవర్గానికి మూడు వేలకు పైగా ఇళ్ళు ఇచ్చామని, ఇందిరమ్మ ఇళ్ళతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. విద్య వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రూ.20 వేల కోట్లకు పైగా రుణమాఫీ చేశామన్నారు. ఉద్యోగాల గురించి బీజేపీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రైవేట్ ఆస్తుల సొత్తును దోచుకోవాలని ఓ ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని, దొంగల్లా మాట్లాడుతున్నారన్నారు. సర్ పేరుతో నానాయగి చేస్తున్నారని, పేదవాడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఓటు విలువ ప్రామాణికమని, కాంగ్రెస్ పార్టీ ఓట్ల ను తొలగించే ప్రయత్నాన్ని అడ్డుకుంటున్నామన్నారు. బాల్కొండలో అభివృద్ధి జరుగలేదని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. మాదవనగర్ ఆర్వోబీ పనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జరుగుతున్నాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్రం తరపున అందాల్సిన నిధులు త్వరలోనే అందుతాయని, తద్వారా ఆర్ వోబి పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కామన్ సర్వీస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.ముక్తిద సూచించారు**



**కామారెడ్డి రూరల్ జులై 21 ( నినాదం ) :** కామారెడ్డి కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ కామన్ సర్వీస్ కేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.ముక్తిద సూచించారు. కామాడి జిల్లా కోడ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ కామన్ సర్వీస్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.ముక్తిద సూచించారు. మంగళ వారం సాయంత్రం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కామన్ సర్వీస్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.

**ఎస్ ఐ ఆర్ కామన్ సర్వీస్ సెంటర్ ఎంతో ఉపయోగం.**

జిల్లా జడ్జి మాట్లాడుతూ ఎస్ఐఆర్ దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేసుకోవడంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను న్యాయవాదులు,కోర్టు సిబ్బంది ద్వారా, పత్రికా కథనాల ద్వారా తెలుసుకున్నామన్నారు. కోర్టుకు వచ్చే న్యాయవాదులు, కక్షిదారులు,సాధారణ ప్రజలకు వెంటనే సేవలు అందేలా జిల్లా కోర్టు ప్రాంగణంలోనే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా న్యాయవాదులు,కోర్టు సిబ్బంది,పోలీసు సిబ్బంది,అడ్వకేట్ క్లర్కులు, కక్షిదారులు,సాధారణ ప్రజలు ఎస్ఐఆర్ దరఖాస్తులను సులభంగా నమోదు చేసుకుని ప్రభుత్వ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర,అదనపు కలెక్టర్ విక్టర్,మొబైల్ కోర్ట్ జడ్జి దీక్ష,జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి టి.నాగరాణి,సీనియర్ సివిల్ జడ్జి డా.సూర సుమలత,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నారాయణ,ప్రభుత్వ న్యాయవాది శ్యామ్ గోపాల్ రావు,తహశీల్దార్ హిమబిందు, కోర్టు సీఏవో రాంచందర్,సూపరింటెండెంట్ భుజంగరావు, వెంకట్ రెడ్డి,చంద్రసేన్ రెడ్డి,పారా లీగల్ వలంటీర్ విజయ్ కుమార్ తో పాటు న్యాయవాదులు,కోర్టు సిబ్బంది,పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు**





**గద్వాల బ్యూరో జులై 21 (నినాదం) :** మంగళవారం గద్వాల మండలం రేకులపల్లి గ్రామం లోని ప్రాథమిక పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి విద్య సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, ఆహార నాణ్యత తదితర అంశాలపై స్వయంగా వివరాలు, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యత, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాల సాధనపై దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత ప్రమాణాలతో బోధన నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యతో పాటు క్రీడలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వంద శాతం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని కమ్యూనిటీ సోక్ పిట్, విఓఎ భవన నిర్మాణపు పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. గద్వాల ఎంపీడీవో శైలజ, గ్రామ సర్పంచ్ సత్యమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు వెట్టి చాకిరి

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్**





**కల్వకుర్తి జులై 21 (నినాదం) :** కల్వకుర్తి పట్టణంలోని కేజీబీవీ పాఠశాల, కళాశాలలో పరిపాలనా నిర్వహణలో సంచనల దృశ్యాలు తెలుగులోకి వచ్చాయి. పలు అవకత వకలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు విధి నిర్వహణ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కునుకు తీస్తున్నారని,హాజరు రిజిస్టర్‌లో విద్యార్థుల పేర్లను ఉపాధ్యాయులే నమోదు చేయాల్సి ఉండగా విద్యార్థుల చేతనే రాయిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా, పాఠశాల పరిశుభ్రత బాధ్యతలను సిబ్బంది నిర్వహించాల్సి ఉండగా విద్యార్థులతోనే పారిశుధ్య కార్యక్రమాలు చేయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇది విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక ప్రవేశాల రిజిస్టర్ (అడ్మిషన్ రిజిస్టర్) నిర్వహణలోనూ లోపాలు ఉన్నాయని, ఉపాధ్యాయుల రాకపోకల నమోదు పుస్తకం (టీచర్స్ మూవ్‌మెంట్ రిజిస్టర్) సక్రమంగా నిర్వహించడం లేదని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు, పాఠశాల పరిపాలనా వ్యవహారాల్లో అధికారిక హోదా లేని వ్యక్తులు జోక్యం చేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సంబంధిత ఉద్యోగి భర్త పాఠశాల వ్యవహారాల్లో ప్రమేయం చూపుతున్నారన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆరోపణలపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు. ఆరోపణల్లో నిజా నిజాలు తేలిన పక్షంలో బాధ్యులపై జిల్లా విద్యాధికారి మండల విద్యాధికారి వెంటనే జోక్యం చేసుకొని శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## డ్రగ్స్ కు నో చెప్పండి ఆరోగ్యకరమైన సురక్షితమైన భవిష్యత్తుకు ఎస్ చెప్పండి

**యాదాద్రి భువనగిరి అదనపు ఎస్పి**



**మునుగోడు, జులై 21 (నినాదం):** మంగళవారం ఆంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం,యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు ఎస్పీ చౌటుప్పల్ డీఎస్పీ ఆదేశాలు, మార్గదర్శకత్వంలో, మునుగోడు నియోజకవర్గం, యాదాద్రి భువనగిరి జిల్లా. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో వీవీఆర్ గార్డెన్స్‌లో విద్యార్థులు, యువత కోసం ఆంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితం, సమాజం మరియు భవిష్యత్తుపై కలిగే తీవ్ర దుష్పరిణామాలను వివరించారు. మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి మార్గంలో ముందుకు సాగాలని, ఎక్కడైనా డ్రగ్స్‌కు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. వారితో, డ్రగ్స్‌కు నో చెప్పండి... ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తుకు ఎస్ చెప్పండి."అని ప్రతిజ్ఞ చేయించారు.

# మానవత్వం చాటిన జర్నలిస్టులు.. చిన్నారి చికిత్సకు చేయూత



**కోదాడ,జులై 21(నినాదం) :** కాలేయ సమస్యతో బాధపడుతున్న గాంధీనగర్‌కు చెందిన చిన్నారి వడ్లమూడి దక్షిక చికిత్స కోసం ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. జర్నలిస్టుల సంఘం రాష్ట్ర నాయకుడు కారింగుల అంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ సహాయాన్ని అందించారు. చిన్నారి చికిత్సకు ఇంకా ఆర్థిక సహాయం అవసరమని, దాతలు ముందుకు రావాలని కోరారు.కార్యక్రమంలో: సలిగంటి మురళి, పిడమర్తి గాంధీ, కుడుముల సైదులు, మరికంటి లక్ష్మణ్, వెన్నెబోయిన పూర్ణచందర్‌రావు, నజీర్, చెరుకుపల్లి శ్రీకాంత్, తోటపల్లి నాగరాజు, గంధం వెంకటనారాయణ, వాసు, సంపత్, పల్లపు శ్రీను, కోలా వెంకట్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల చిరకాల కల సాకారం

**ఏండ్లనాటి కల నెరవేరింది**
**వేల ఎకరాలకు సాగునీరు రైతు కళ్ళల్లో సంతోషం**
**ధర్మారెడ్డిపల్లి కాలువలో సాగునీటిని విడుదల చేసిన**
**ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**
**భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**





**వలిగొండ, జులై 21 (నినాదం):** భువనగిరి నియోజకవర్గ రైతాంగం చిరకాలంగా ఎదురుచూస్తున్న శుభ ఘడియ ఆవిష్కృత మైంది వలిగొండ మండలంలోని సంగెం-ధర్మారెడ్డి పల్లి కాలువలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువన గిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి లు కలిసి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేసిన అనం తరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు 125 కోట్ల వ్యయంతో చేపట్టిన ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల్లోనే సగానికి పైగా పూర్తి చేసి, రైతులకు సాగునీటిని అందించే స్థాయికి తీసుకువచ్చిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుకు తమ ప్రభుత్వం వేగం తీసుకొచ్చి రైతుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో పూర్తి చేసి, రైతులకు శాశ్వతంగా సాగునీటిని అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలువ పూర్తయిన అనంత రం వేలాది ఎకరాలకు సాగునీరు అందడం తో వ్యవసాయ ఉత్పత్తి పెరగడమే కాకుండా రైతుల ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతో దోహద పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లా డుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యం త ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ధర్మారెడ్డిపల్లి కాలువలో నీటి విడుదలతో ఈ ప్రాంత రైతుల చిరకాల నిరీక్షణకు తెరపడిందని, కాలువ పూర్తయిన తర్వాత ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు, ఇరిగేషన్ ఈఇ, డిఇ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మానసిక వేధింపులకు బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**రెండు పేజీల సూసైడ్ నోట్ స్వాధీనం**



**రాజేంద్రనగర్, జులై 21(నినాదం) :** మానసిక వేధింపులు భరించలేక ఒక ఇంజనీరింగ్ విద్యార్థిని ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన దారుణ సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని పుప్పాల గూడలో మంగళవారం చోటుచేసుకుంది.

**పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం:**

హైదరాబాద్‌లోని ప్రముఖ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమారి వి. శ్రేయ (20) అనే విద్యార్థిని, పుప్పాలగూడలోని తన నివాసంలో జులై 19, 20 మధ్యరాత్రి సమయంలో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురై వెంటనే నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. జులై 20న సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, అక్కడే లభించిన రెండు పేజీల సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వతహాగా సున్నిత మనస్తత్వం కలిగిన శ్రేయ, తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు సూసైడ్ నోట్ ద్వారా వ్యక్తమైంది. జులై 17న జరిగిన పరీక్ష సమయంలో ఒక అధ్యాపకుడు తనను ఉద్దేశించి అత్యంత అనుచిత వ్యాఖ్యలు చేశారని, వ్యక్తిగత వేధింపులే తన ఆత్మహత్యకు ప్రధాన కార ణమని ఆమె ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు జతీ. చీశీ. 1366/2026, ఖ/o 194 దీచీూ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, విచారణలో తేలిన అంశాల ఆధారంగా శ్రేయ ఆత్మహత్యకు కారణమైన బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# నీట్‌లో విజయం సాధించిన కార్తీక్ కు ఘన సన్మానం



**చింతపల్లి, జులై 21(నినాదం) :** మండల కేంద్రానికి చెందిన విగ్రహాల శ్రీనాథ్ కుమారుడు విగ్రహాల కార్తీక్ ఇటీవల నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్ )లో 438 మార్కులు సాధించి ఉత్తీర్ణత పొందిన సందర్భంగా మంగళవారం గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కార్తీక్‌ను అభినందిస్తూ, ఆయన సాధించిన విజయం గ్రామానికి గర్వకారణమని కొనియాడారు. పట్టుదల, కృషి, లక్ష్యసాధనతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని కార్తీక్ నిరూపించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో వైద్య విద్యను అభ్యసించి మంచి వైద్యుడిగా ఎదిగి గ్రామానికి, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురా వాలని ఆకాంక్షిం చారు. అలాగే కార్తీక్ తల్లిదండ్రులు విగ్ర హాల శ్రీనాథ్ కుటుంబ సభ్యులను ప్రత్యే కంగా అభినం దించి, వారి ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధ్యమైందని ప్రశంసిం చారు. గ్రామంలోని విద్యార్థులు కార్తీక్‌ను ఆదర్శం గా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో కృషి చేసి విజయాలను సాధించాలని సూచించా రు. ఈ సన్మానంలో గ్రామ సర్పం చ్ కాసారపు శ్వేత శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, ఉప సర్పం చ్ రెహనా బేగం సిద్ధిక్ బాబా, పంచాయతీ కార్యదర్శి అశోక్, వార్డు సభ్యులు వందనపు ఆంజనేయులు, చెట్లపల్లి స్వాతి హరిప్ర సాద్, గునుకుల మౌనిక నరేష్, ఎండి అబ్బాస్, ఎండి జాఫర్, సిద్దే స్వామి, బీఎల్వోలు గోవిందు అంజలి, శీలం మేఘమాల, సుంకోజు పద్మ, విగ్రహాల మన్మధ చారి, కారోబార్ ముంతాజ్, గ్రామ ప్రజలు, యువత, తదితరులు పాల్గొని కార్తీక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**




**వనపర్తి ప్రతినిధి, జులై 21 (నినాదం) :** ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుదర్శన్ రెడ్డి రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లాల్లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఎన్యుమరేషన్ ఫారంల డిజిటలైజేషన్ ఎంత శాతం పూర్తయిందని, ఇంకా ఎంత మేర చేయాల్సి ఉందని దానిపై ఆరా తీశారు. మరో వారం రోజుల్లో 90 శాతానికి చేరుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అన్ని జిల్లాల అధికారులకు సూచించారు. వీసి అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ అందరూ తహసీల్దార్లు ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి ఫారాల సేకరణ, ఆన్లైన్ లో నమోదు, తదితర పనులను వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసిల్దార్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కొండగట్టు బాధితులను ఎందుకు పరామర్శించలేదు..?


**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**



**జగిత్యాల ప్రతినిధి జులై 21 (నినాదం) :** 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు కళ్ళు నెత్తికెక్కి కొండగట్టు ప్రమాద బాధితులను పరామర్శించడానికి రాని కేటీఆర్ నీతులు చెప్పడం హాస్యా స్పదంగా ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు .మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలో మంత్రి అడ్లూరి పర్యటించారు. ఈ సందర్భంగా నంది మేడారం, రచ్చపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఏనాడు రైతుల సమస్యలు పట్టించుకోలేదని మంత్రి ఆరోపించారు. అధికారం దూరమైన తర్వాత కేటీఆర్ రైతుల పరామర్శ పేరట డ్రామాలు వాడుతున్నారని లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. కొండగట్టు బస్సు ప్రమాదంలో మరణించిన బాధ్యత కుటుంబాలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు పరామర్శించలేదని మంత్రి ప్రశ్నించారు. ఒకవైపు ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక రాష్ట్ర రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో రైతులకు అండగా ఉండి వారికి మనోధైర్యం కల్పించాల్సిన బాధ్యత మరిచి ప్రతిపక్ష నాయకులు వ్యవహరిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. నంది మేడారం రిజర్వాయర్ నిర్మాణ సమయంలో నంది మేడారం గ్రామస్తులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మిస్తామని నాటి మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట ఇచ్చి తప్పారని మంత్రి ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

# గోశాలను ఏర్పాటు చేసి గోవులను రక్షించండి

**మున్సిపల్ కమిషనర్ ను కోరిన కాంగ్రెస్ నాయకులు**



**జమ్మికుంట, జులై21 (నినాదం) :** జమ్మికుంట పట్టణం లో రోడ్లపై గోమాతలు తిరుగు తున్నాయని దానివల్ల పట్టణ ప్రజలకు వాహనదా రులకు ఇబ్బందులు ఎదురవుతున్నా యని ఆ సమస్యలు తలెత్తకుండా జమ్మికుంట పట్టణంలో గోశాలను ఏర్పాటు చేసి గోవుల ను రక్షించాలని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామికి వినతి పత్రం అందించిన కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ, భారతదేశ ప్రజలు ఎంతో పవిత్రంగా పూజించే గోవులను రక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని వాటి సంరక్షణ కోసం గోషాలను ఏర్పాటు చేసి వాటిని కాపాడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులు చేపట్టాలని కోరారు. ప్రతిరోజు రాత్రి సమయంలో వాటికి స్థలం లేక నడి రోడ్ల పై విశ్రమిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ విషయాన్ని గమనించి మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందించగా ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

# ఉరుముతున్న యుద్ధమేఘాలు !

సంపాదకీయం

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు మళ్లీ కమ్ముకోవడంతో ప్రపంచదేశాలు దిక్కుతోచని స్థితికి చేరాయి. రష్యా`ఉక్రెయిన్ యుద్ధం కూడా మళ్లీ తీవ్రస్థాయికి చేరింది. నియంతల కారణంగా ప్రపంచానికి శాంతి లేకుండా పోతోంది. వాళ్లు,వాళ్లు కొట్టుకు చస్తున్నా ఫర్వాలేదు..ఇందులో మిగతా దేశాలు తల్లడిల్లి పోతున్నాయి. ముఖ్యంగా అమెరికా మళ్లీ ఇరాన్‌పై భీకరదాడులకు దిగుతోంది. ట్రంప్‌ను అంతమొందిస్తాం అంటూ ఇరాన్‌లో పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. అలాగే ప్రపంచంలోని అమెరికన్లు జాగ్రత్తగా ఉండాలంటూ అమెరికా ప్రజలకు హెచ్చరికలు చేసింది. ఈ క్రమంలో యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చనుందన్న సంకేతాలు వస్తున్నాయి. దీంతో చమురు సమస్యలు మళ్లీ మొదటికి అన్నట్లుగా పరస్థితులు కనిపిస్తున్నాయి. ఇరాన్‌ను సర్వనాశనం చేసే వరకు వదలనని ట్రంప్ భీష్మించుకున్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ వెనక్కి తగ్గగా అమెరికానే యుద్ధాన్ని ఎగదోస్తోంది. మరోవైపు అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా`ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘూ మాట్లాడుతూ అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హర్మూజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్యత ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తో పాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, వాటిని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదని తెలిపారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ వి డియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్నప్పటికీ.. దాన్ని ఎక్కువ రోజులు అధీనంలో ఉంచుకోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒక వేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోవి టర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం దాదాపు ఐదు నెలలు కావస్తోంది. అయినా అగ్గి చల్లారడం లేదు. ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ట్రంప్ మళ్లీమళ్లీ దాడులకు తెగిస్తున్నారు. తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ గతంలోనే స్పష్టం చేశారు.శాంతి ఒప్పందానికి చిల్లు పెట్టారని, ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా`ఇరాన్ మధ్య ప్రస్తుతానికి చర్చలు జరగడం లేదు. ఇకపై మంచివాడిగా ఉండను అని గతంలో ట్రంప్ చేసిన హెచ్చరికలు తాజా పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అమెరికా`ఇరాన్ మధ్య ఉన్న సున్ని తమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచదేశాలు కూడా పెద్దగా స్పందించడం లేదు. ఏ దేశం కూడా ఈ సుదీర్ఘ యుద్ధానికి అడ్డుపడడం లేదు. ఇరాన్ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. అయితే ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాడోపేడో తేల్చుకునేదాకా వదిలేది లేదని హెచ్చరికలు చేస్తోంది. అలాగే అమెరికా స్థావరాలపై భీకర దాడులు చేస్తోంది. ఈక్రమంలో ఈ యుద్ధం ఇప్పట్లో ముస్తుందని అనుకోవడానికి లేదు. ప్రపంచదేశాలు ఏకమైతే తప్ప యుద్ధ పరిస్థితులను అదుపు చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది.

# యువత ఆగ్రహం.. పాలకులకు చివరి హెచ్చరిక!

**పేపర్ లీకులు, అవినీతి, అన్యాయాలపై రగులుతున్న అసంతృప్తి...**

**ఇప్పటికైనా వ్యవస్థను చక్కదిద్దకపోతే?**

అంతర్మథనం



✍ బిజిగిరి శ్రీనివాస్
సంపాదకులు – నినాదం

**దేశ చరిత్ర ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతోంది. యువత ఆశలు దెబ్బతిన్న ప్రతిసారీ చరిత్ర కొత్త మలుపు తిరిగింది. ఉద్యోగం కోసం, విద్య కోసం, సమాన అవకాశాల కోసం పోరాడే యువత ఒక దశ వరకు మాత్రమే సహనం ప్రదర్శిస్తుంది. ఆ తర్వాత వారి ఆవేదనే ఉద్యమంగా మారుతుంది. నేడు దేశవ్యాప్తంగా పేపర్ లీకులు, నియామకాలపై అనుమానాలు, పెరుగుతున్న అవినీతి నేపథ్యంలో వ్యక్తమవుతున్న యువత ఆగ్రహన్ని కేవలం ఒక నిరసనగా చూడలేం. ఇది పాలక వ్యవస్థకు వినిపిస్తున్న గంభీరమైన హెచ్చరిక. ఈ సంకేతాలను ఇప్పటికైనా అర్థం చేసుకుని పరిపాలనను సరిదిద్దకపోతే, భవిష్యత్తులో మరింత విస్తృతమైన సామాజిక, రాజకీయ అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశం ఉందనే ఆందోళనను విస్మరించలేం.**



ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ప్రజల నుంచి పన్నులు వసూలు చేసేది కేవలం రోడ్లు వేయడానికి, భవనాలు నిర్మించడానికి మాత్రమే కాదు. ప్రజల జీవితాలకు భరోసా కల్పించే వ్యవస్థలను నిర్మించడానికి. ముఖ్యంగా విద్య, ఉపాధి, న్యాయవ్యవస్థ, పరిపాలన వంటి రంగాల్లో సమాన అవకాశాలను కల్పించడం ప్రభుత్వాల అత్యంత కీలక బాధ్యత. కానీ నేడు దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు చూస్తుంటే, ఆ వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసం క్రమంగా దెబ్బతింటోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షలు, ప్రవేశ పరీక్షలు, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాల లీక్ ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. ఇది ఒక రాష్ట్రం సమస్య కాదు. ఒక పరీక్ష సమస్య కాదు. వివిధ రాష్ట్రాల్లో వివిధ రూపాల్లో ఈ తరహా ఘటనలు వెలుగులోకి రావడం యువతను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పుడు ఏ పరీక్ష జరిగినా "పేపర్ లీక్ అయిందా?" అనే అనుమానం ముందుగా రావడం అత్యంత ప్రమాదకర పరిస్థితి. పరీక్షల విశ్వసనీయత దెబ్బతింటే, నియామక వ్యవస్థపై ప్రజల విశ్వాసం కూడా కూలిపోతుంది.

లాంగ్ చున్ నిరాహార దీక్ష, దానిని పోలీసులు భగ్నం చేయడం, అనంతరం జంతర్ మంతర్ వద్ద వేలాది మంది కాక్రోజంతా పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు, యువత శాంతియుతంగా నిరసన తెలపడం, వారిపై లాఠీచార్జ్ జరిగినా వెనక్కి తగ్గకుండా నిలబడడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆ దృశ్యాలు ఒక విషయం స్పష్టంచేశాయి. యువత కోపం ఒక్క పరీక్ష మీద కాదు. వ్యవస్థ మీద పేరుకుపోతున్న అసంతృప్తి మీద.

ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాలు, పౌరసంఘాలు చేస్తున్న ప్రధాన ఆరోపణ ఏమిటంటే, పేపర్ లీక్‌ల వెనుక ఉన్న నెట్‌వర్క్‌లను పూర్తి స్థాయిలో వెలికితీయాలని, బాధ్యులెవరైనా సరే చట్టం ముందు నిలబెట్టాలని. ఇలాంటి సంఘటనలపై పారదర్శక దర్యాప్తు జరగకపోతే ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతాయని వారు చెబుతున్నారు. ప్రజాస్వామ్యంలో అనుమానాలకు ముగింపు పలికేది అణచివేత కాదు, పారదర్శక విచారణ మాత్రమే.

పేద రైతు పొలం అమ్మి పిల్లలను చదివిస్తాడు. కూలీ తన జీవిత పొదుపును కోచింగ్ ఫీజులకు ఖర్చు చేస్తాడు. మధ్యతరగతి కుటుంబం అప్పులు చేసి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తుంది. సంవత్సరాల శ్రమ తర్వాత పరీక్ష రాసిన విద్యార్థికి ప్రశ్నాపత్రం ముందే లీకైందని తెలిసిన క్షణంలో ఓడిపోయేది ఒక్క అభ్యర్థి కాదు. నిజాయితీ, ప్రతిభ, సమాన అవకాశాలపై నమ్మకమే.

ప్రజలు లక్షల కోట్ల రూపాయల పన్నులు చెల్లించి ప్రభుత్వాలను నడిపిస్తారు. ఆ ప్రజాధనాన్ని ప్రజల సంక్షేమానికి, నాణ్యమైన విద్యకు, పారదర్శక నియామకాలకు వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. అయితే అభివృద్ధి పనుల్లో అవినీతి, కాంట్రాక్టుల్లో అక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో లోపాలపై తరచూ విమర్శలు వినిపిస్తున్న వేళ, ఇప్పుడు విద్యా వ్యవస్థ కూడా అక్రమాల చర్చలోకి రావడం అత్యంత ఆందోళనకరం. పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలే డబ్బుకు అమ్ముడవుతున్నాయనే భావన సమాజంలో బలపడితే, దాని ప్రభావం తరతరాలపై పడుతుంది.

ప్రతిభతో గెలవాల్సిన ఉద్యోగాలు డబ్బు, పలుకుబడి, అక్రమ మార్గాల ద్వారా దక్కుతున్నాయనే భావన ఏర్పడితే, అర్హులైన యువత వెనుకబడతారు. అనర్హులు బాధ్యతాయుత స్థానాల్లోకి వస్తారు. రేపటి ఉపాధ్యాయుడు, వైద్యుడు, ఇంజనీర్, పోలీసు అధికారి, పరిపాలనా అధికారి ఎంపికలోనే లోపాలు ఏర్పడితే, దేశ నిర్మాణానికే పునాది బలహీనమవుతుంది.

**ఇది కేవలం ఉద్యోగాల సమస్య కాదు. ఇది సామాజిక న్యాయం ప్రశ్న. రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల ప్రశ్న. ప్రజాస్వామ్య విశ్వసనీయత ప్రశ్న.**

అయితే పరిష్కారాలు కూడా స్పష్టంగానే ఉన్నాయి. ప్రతి పేపర్ లీక్ ఘటనపై కాలపరిమితితో కూడిన స్వతంత్ర దర్యాప్తు జరగాలి. పరీక్షల రూపకల్పన నుంచి ప్రశ్నాపత్రాల ముద్రణ, రవాణా, నిల్వ, పంపిణీ వరకు అత్యాధునిక సాంకేతిక భద్రత ఏర్పాటు చేయాలి. లీక్‌లకు పాల్పడిన వారితో పాటు వారిని కాపాడే అధికారులు, ప్రభావశీలులు ఎవరైనా ఉంటే చట్టం ముందు నిలబెట్టాలి. పరీక్షలు నిర్వహించే సంస్థలకు పూర్తి స్వతంత్రత, పారదర్శకత, ప్రజా జవాబుదారీతనం కల్పించాలి. లీక్‌ల వల్ల నష్టపోయిన అభ్యర్థులకు త్వరితగతిన తిరిగి పరీక్షలు నిర్వహించి వారి శ్రమ వృథా కాకుండా చూడాలి.

అంతకంటే ముఖ్యంగా ప్రభుత్వాలు యువతను ప్రత్యర్థులుగా కాకుండా దేశ భవిష్యత్తుగా చూడాలి. ప్రశ్నలు అడిగిన వారికి లాఠీలు కాదు, సమాధానాలు ఇవ్వాలి. నిరసనలను అణచివేయడం ద్వారా అసంతృప్తిని కొంతకాలం తగ్గించవచ్చు. కానీ సమస్యను పరిష్కరించలేరు. వ్యవస్థపై నమ్మకం కోల్పోయిన యువత ఒక దశలో మరింత బలమైన సామాజిక, రాజకీయ మార్పును కోరే దిశగా అడుగులు వేయడం చరిత్రలో ఎన్నోసార్లు జరిగింది.

నేడు వినిపిస్తున్న యువత ఆగ్రహాన్ని తాత్కాలిక ఆవేశంగా కొట్టిపారేయడం పాలకులకు మంచిది కాదు. అది ఈ తరం మనోవేదన. వారి భవిష్యత్తుపై ఉన్న భయం. వారి శ్రమకు న్యాయం కావాలనే డిమాండ్. ఆ స్వరాన్ని వినగలిగితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది.


**దేశ భవిష్యత్తు పార్లమెంట్ భవనాల్లో మాత్రమే కాదు, పరీక్షా హాళ్లలో కూడా నిర్ణయించబడుతుంది. అక్కడ ప్రతిభ గెలిస్తే దేశం గెలుస్తుంది. అక్కడ అవినీతి గెలిస్తే దేశం ఓడిపోతుంది.**

**యువత ఆగ్రహం ఇప్పటికైనా పాలకులకు హెచ్చరికగా మారాలి. లేకపోతే ప్రశ్నాపత్రాల లీకులతో మొదలైన విశ్వాస సంక్షోభం, రేపు మొత్తం పరిపాలనా వ్యవస్థనే ప్రశ్నించే స్థాయికి చేరే ప్రమాదాన్ని ఎవరూ తక్కువ అంచనా వేయలేరు.**

# "భారత జాతీయ పతాక నేపథ్యం"

**జూలై 22... జాతీయ పతాక ఆమోద దినం**

**20వ శతాబ్దం ప్రారంభంలో స్వాతంత్ర్యోద్యమం బాగా ఊపందుకున్నప్పుడు జాతీయోద్యమ స్ఫూర్తిని, లక్ష్యాలను ప్రతిబింబించే జాతీయ పతాకం అవసరమైంది. 1904లో వివేకానందుడి శిష్యురాలైన ఐరిష్ వనిత సోదరి నివేదిత భారతదేశపు మొట్టమొదటి పతాకాన్ని రూపొందించింది. ఇది పసుపు, ఎరుపు రంగుల్లో ఉన్న జెండా. జెండా మధ్య భాగంలో వజ్రాయుధం, తెల్ల తామర గుర్తులున్నాయి. "(భారత) మాతకు వందనం" అనే అర్థం వచ్చే బెంగాలీ మాటలు (వందేమాతరం)" ఆ జెండా మీదున్నాయి. ఎరుపు స్వాతంత్ర్య పోరాటానికి, పసుపు విజయానికి, తెల్లతామర స్వచ్ఛతకు చిహ్నాలు.**





1907 లో మేడం భికాజీ కామా ఎగరేసిన జండా మొట్టమొదటి త్రివర్ణ పతాకం1905లో జరిగిన బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో 1906 ఆగష్టు7 న కలకత్తాలోని పార్శీబగాన్ స్క్వేర్లో శచీంద్ర ప్రసాద్ బోస్ చే ఆవిష్కరించ బడింది. ఈ పతాకాన్ని "కలకత్తా పతాకం" అంటారు. ఈ పతాకంలో సమాన వెడల్పుతో అడ్డంగా మూడు పట్టీలున్నాయి: పైన నారింజ రంగు, మధ్యలో పసుపుపచ్చ, క్రింద ఆకుపచ్చ. పైపట్టీ మీద సగం విచ్చుకున్న ఎనిమిది తామర పూలు, క్రింది పట్టీ మీద నెలవంక, మధ్యలో దేవనాగరి లిపిలో "వందేమాతరం" అనే అక్షరాలు ఉన్నాయి. 1917 లో హోంరూల్ ఉద్యమంలో వాడిన జండా, 1907 ఆగష్టు 22 న మేడం భికాజీ కామా జర్మనీ లోని స్టుట్‌గార్ట్ లో మరో జండాను ఎగరేసింది. ఈ జండాలో పైన ఆకుపచ్చ, మధ్యన కాషాయం, అడుగున ఎరుపు రంగులు ఉన్నాయి. ఇందులో ఆకుపచ్చ ఇస్లాముకు, కాషాయం హిందూ, బౌద్ధాలకు సూచికలు. ఆకుపచ్చ పట్టీలో బ్రిటిషు భారతంలోని 8 ప్రావిన్సులకు గుర్తుగా 8 పద్మాలు ఉన్నాయి. మధ్యనున్న కాషాయ పట్టీలో దేవనాగరి లిపిలో వందేమాతరం రాసి ఉంది. అడుగున ఉన్న పట్టీలో స్థంభానికి దగ్గరగా నెలవంక, రెండో చివర సూర్యుడు ఉన్నాయి. ఈ జండాను భికాజీ కామా, వీర సావర్కార్, శ్యాంజీ కృష్ణ వర్మలు కలిసి తయారు చేసారు. మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యాక, బెర్లిన్ కమిటీలోని భారతీయ విప్లవకారులు దీన్ని స్వీకరించాక, ఈ జండా బెర్లిన్ కమిటీ జండాగా పేరు పొందింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో మెసొపొటేమియాలో ఈ జండాను విస్తృతంగా ఉపయోగించారు. గదర్ పార్టీ జండాను కూడా అమెరికాలో భారతీయ చిహ్నంగా కొన్నాళ్ళు ఉపయోగించారు.

1917లో తిలక్, అనీబిసెంట్లు హోంరూల్ ఉద్యమంలో ఐదు ఎరుపు, నాలుగు ఆకుపచ్చని అడ్డపట్టీలు గల ఇంకొక జెండాను వాడారు. జెండా పైభాగంలో ఎడమ వైపు తాము కోరిన డొమినియన్ హోదాకు సూచికగా యూనియన్ జాక్ గుర్తు, కుడివైపు తార–నెలవంక గుర్తులను వాడారు. దానికి దిగువన హిందువులకు పవిత్రమైన సప్తర్షి మండలానికి గుర్తుగా ఏడు నక్షత్రాలున్నాయి. యూనియన్ జాక్ ఉండడం వల్లనేమో ఇది జనామోదం పొందలేకపోయింది. 1916లో మచిలీపట్నానికి చెందిన పింగళి వెంకయ్య ఒక జాతీయ పతాకాన్ని రూపొందించే ప్రయత్నం చేశాడు. ఆయన ప్రయత్నాన్ని గుర్తించిన ఉమర్ సుభాని, ఎస్.బి.బొమ్మన్‌జీ ఇండియన్ నేషనల్ ఫ్లాగ్ మిషన్ ను ఏర్పాటుచేశారు. వెంకయ్య తాను రూపొందించిన పతాకాన్ని గాంధీజీకి చూపించగా, ఆయన దాంట్లో భారతదేశానికీ, దేశం తానెదుర్కొంటున్న సమస్యలనుంచి విముక్తి పొందడానికీ చిహ్నంగా నిలిచిన చరఖా (రాట్నము)ను చేర్చమని సలహా ఇచ్చాడు. నిరాడంబరమైన రాట్నము గాంధీజీ నేతృత్వంలో భారతదేశ ఆర్థిక పునరుత్థానానికి ప్రతీకగా నిలిచింది. పింగళి వెంకయ్య గాంధీ సూచన ప్రకారం ఎరుపు–ఆకుపచ్చ రంగు పట్టీలమీద రాట్నము గుర్తును రూపొందించి చూపాడు. ఐతే అది అన్నిమతాలకూ ప్రాతినిధ్యం వహించేలా లేదని గాంధీ దాన్ని తిరస్కరించాడు. గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ఇంకొక త్రివర్ణపతాకం పైనుంచి క్రిందకు వరుసగా తెలుపు, ఆకుపచ్చ, ఎరుపుపట్టీలతో, మూడు పట్టీలమీదుగా ఒకే పెద్ద రాట్నము గుర్తుతో రూపొందించబడింది. ఆ మూడు పట్టీలు మైనారిటీ మతాలు, ముస్లిం, హిందూ మతాలకు సూచికలు. ఇది అప్పటి బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యపోరాటం సాగిస్తోన్న ఐర్లాండు పతాకాన్ని పోలి ఉంది. ఈ పతాకాన్ని అహమ్మదాబాదు కాంగ్రెసు సమావేశంలో ఆవిష్కరించారు. ఇది కాంగ్రెసు అధికార పతాకం కాకపోయినా జాతీయోద్యమంలో ఎక్కువగా వాడారు. ఐతే ఆ జెండాలో మతాలకు చిహ్నాలుండడం చాలామందికి నచ్చలేదు.1924లో కలకత్తాలో సమావేశమైన ఆలిండియా కాంగ్రెస్ హిందువులకు చిహ్నాలుగా కాషాయ రంగును, గదను చేర్చాలని కోరింది. అదే సంవత్సరం హిందూ యోగుల, ముస్లిం ఫకీర్లు–దర్వేషీల వైరాగ్యానికి చిహ్నమైన జేగురు రంగును చేర్చాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. సిక్ఖులు తమ మత చిహ్నంగా పసుపురంగును కూడా చేర్చాలని, లేనట్లైతే మతపరమైన సూచికలను పూర్తిగా తొలగించాలని కోరారు. భారత దేశంలో అతిపెద్ద రాజకీయ వేదికగా ఉన్న భారత జాతీయ కాంగ్రెసు 1921లో తెలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగులతో అనధికారికంగా ఒక పతాకాన్ని రూపొందించుకొంది. ఎరుపు హిందూ మతానికి, ఆకుపచ్చ ఇస్లాం మతానికి, తెలుపు ఇతర మతాలకు సూచికలు. కాంగ్రెసు 1931లో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో, మధ్యలో రాట్నము బొమ్మగల పతాకాన్ని తన అధికారిక పతాకంగా స్వీకరించింది. ఈ పతాకంలో ఎటువంటి మతపరమైన ప్రతీకలూ లేవు.

1931లో సూచించబడిన జెండా

ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1931 ఏప్రిల్ 2న ఈ వివాదాలను పరిష్కరించడానికి ఏడుగురు సభ్యులతో ఫ్లాగ్ కమిటీని నియమించింది. "జెండాలోని మూడు రంగులూ మతాలనుద్దేశించినవే కాబట్టి అభ్యంతరకరమైనవేనని" కమిటీ తీర్మానించింది. ఫలితంగా పూర్తిగా ఎర్రమట్టిరంగులో, పైభాగాన రాట్నము గుర్తుతో ఒక కొత్త జెండా తయారైంది. దీన్ని ఫ్లాగ్ కమిటీ ఆమోదించినా ఇది కూడా మతపరమైన భావజాలాన్నే సూచిస్తోందనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఆమోదించలేదు.

1931లో, పింగళి వెంకయ్య రూపకల్పన చేసి, 1923లో మొదట ఎగిరిన స్వరాజ్ పతాకం అని పేరున్న భారత జాతీయ కాంగ్రెస్ పతాకం భారత జాతీయ పతాకానికి ఆధారం. రెండవ ప్రపంచ యుద్ధంలో ఆజాద్ హింద్ ఫౌజ్ వాడిన జెండా, అదే సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ ఈ పతాకాన్ని స్వల్ప మార్పులతో – చరఖా స్థానంలో "ఆజాద్ హింద్" అన్న అక్షరాలు, ముందుకు దూకుతున్న పులి బొమ్మతో – వాడుకొంది. ఈ మార్పులు గాంధీ అహింసాయుత పద్ధతులకు, సుభాష్ చంద్ర బోస్ వీరోచిత పద్ధతులకు గల తేడాను ప్రతిబింబిస్తాయి. ఈ త్రివర్ణపతాకం భారత దేశపు గడ్డమీద మొదటి సారిగా బోస్ చేత మణిపూరులో ఆవిష్కరించ బడింది. స్వతంత్ర భారతదేశ జాతీయ పతాకాన్ని నిర్ణయించడానికి రాజ్యాంగసభ, 1947 జూన్ 23న బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, కె.ఎం.పణిక్కర్, సరోజినీ నాయుడు, రాజాజీ, కె.ఎం.మున్షీ, బి.ఆర్.అంబేద్కర్ లతో ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ 1947 జూలై 14న కాంగ్రెస్ పతాకాన్నే అన్ని పార్టీలకు, మతాలకు ఆమోదయోగ్యమయ్యే మార్పులతో జాతీయ పతాకంగా స్వీకరించాలని నిర్ణయించింది. దాంట్లో మతపరమైన సూచికలేవీ ఉండరాదని తీర్మానించింది. 1947 ఆగస్టులో భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి కొన్నిరోజుల ముందు ఏర్పాటైన రాజ్యాంగసభ, కాంగ్రెస్ పార్టీ పతాకాన్నే అన్ని పార్టీలకు, అన్ని మతాల వారికి ఆమోదయోగ్యమైన మార్పులు చేసి జాతీయపతాకంగా స్వీకరించడానికి నిర్ణయించింది. అన్నిటికంటే ముఖ్యమైన మార్పు రాట్నము స్థానంలో అశోకచక్రాన్ని చేర్చడం. చరఖా స్థానంలో సారనాథ్ స్థూపంలోని ధర్మ చక్రాన్ని చేర్చారు. 1947 జూలై 22న భారత రాజ్యాంగ పరిషత్ సమావేశంలో ప్రస్తుతం ఉన్న రూపంలో ఆమోదం పొందింది. ఈ కొత్త పతాకాన్ని స్వతంత్ర భారత జాతీయ పతాకంగా ఉద్వేగ భరిత వాతావరణంలో 1947 ఆగష్టు 15 నాడు ఆవిష్కరించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

**పశ్చిమాసియాలో పరిస్థితి**

## మళ్లీ ఉద్రిక్తం

**పూర్తిస్థాయి యుద్ధం చేస్తున్నామన్న ఇరాన్**

టెహ్రాన్ : అమెరికా`ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ప్రస్తుతం కేవలం సైనిక పరంగానే కాకుండా ఆర్థిక రంగంలో కూడా తీవ్ర పోరాటం కొనసాగుతోందని, ప్రజల జీవనోపాధిని కాపాడటం ప్రభుత్వానికి అత్యంత కీలక బాధ్యతగా మారిందని ఆయన పేర్కొన్నారు. దేశం యుద్ధ పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజల దైనందిన జీవితం దెబ్బతినకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెజెష్కియన్ అన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ప్రజల జీవన ప్రమాణాలను కాపాడడం ప్రస్తుతం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇరాన్ వ్యాప్తంగా అమెరికా దాడులు చేస్తోందని, ఆ పరిణామాలను దేశ ప్రజలు అంగీకరించాలని కోరారు. టీవల కొద్ది రోజులుగా అమెరికా`ఇరాన్ మధ్య వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ చమురు సరఫరాపై కూడా ప్రభావం పడుతోంది. అయితే యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, ఉద్రిక్తతలను తగ్గించేందుకు పలు దేశాలు దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. కానీ, ఇరు దేశాలు తమ తమ వైఖరిని మార్చుకోకపోవడంతో పరిస్థితి ఇంకా అనిశ్చితంగానే ఉంది.

## పశ్చిమాసియా యుద్ధంతో అమెరికా అడ్వైజరీ జారీ

**ప్రపంచంలోని అమెరికాను పౌరులకు హెచ్చరికలు**

**అప్రమత్తంగా ఉండాలని సూచనలు**

వాషింగ్టన్ : పశ్చిమాసియాలో రోజురోజుకూ ఉద్రిక్త పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ పౌరులకు 'వరల్డ్‌వైడ్ కాషన' పేరుతో భద్రతా హెచ్చరిక జారీ చేసింది. అమెరికన్లు విదేశాల్లో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించింది.పశ్చిమాసియలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా ప్రయోజనాలు, పౌరులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేసినట్లు స్టేట్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. ముఖ్యంగా అమెరికా రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలను కచ్చితంగా పాటించాలని పౌరులకు సూచించింది. వసరం లేని ప్రయాణాలను నివారించాలని, జనసమ్మర్ధ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, స్థానిక వార్తలు, భద్రతా హెచ్చరికలను నిరంతరం గమనించాలని, సవి పంలోని అమెరికా రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్ సూచనలను అనుసరించాలని, అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించింది. గత కొద్ది రోజులుగా ఇరాన్‌పై అమెరికా వరుస దాడులు చేస్తోంది ఇరాన్‌లోని పలు కేంద్రాలపై వైమానిక దాడులు చేస్తోంది. అందుకు ప్రతిగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది.

# చేపలకు నీళ్లు లేవు.. మత్స్యకారులకు ఉపాధి లేదు

**బతుకులు ప్రశ్నార్థకం!**

## వర్షాభావంతో చెరువులు, కుంటలు వెలవెల.. చేపల పెంపకంపై తీవ్ర ప్రభావం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):**
తెలంగాణలో మత్స్యకారుల జీవనం ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానంగా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లపై ఆధారపడి బతుకుతున్న వీరికి ఏడాది వర్షాభావం దెబ్బతీసింది. చేపల పెంపకం ద్వారా వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ప్రభుత్వం కూడా మత్స్యరంగాన్ని ప్రోత్సహించేందుకు ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో ఉచితంగా చేప పిల్లలను విడుదల చేస్తోంది. అయితే వర్షాభావ పరిస్థితులు మత్స్యకారుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు కురవక పోవడంతో రాష్ట్రంలోని అనేక చిన్న నీటి వనరుల్లో నీటి మట్టాలు



తగ్గిపోతున్నాయి. చెరువులు, కుంటలు నిండకపోవడంతో చేపల పెంపకానికి అనుకూల పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో ఇప్పటికే చేప పిల్లలను వదిలిన నీటి వనరుల్లో అవి ఎదగక పోవడం, నీరు తగ్గిపోతే చేపలు చనిపోయే ప్రమాదం ఉండటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

### రాష్ట్రంలో నీటి వనరులు


తెలంగాణలో మత్స్యరంగానికి ప్రధాన ఆధారంగా 25,628 ట్యాంకులు, రిజర్వాయర్లు ఉండగా, వాటి మొత్తం నీటి విస్తీర్ణం సుమారు 7.08 లక్షల హెక్టార్లుగా ఉంది. వీటిలో 93 రిజర్వాయర్లు,100 ఎకరాలకు పైబడిన 4,195 చెరువులు, 100 ఎకరాల లోపు 21,717 చెరువులు ఉన్నాయి. ఈ నీటి వనరులపై ఆధారపడి లక్షలాది మత్స్యకారులు తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు.
ఏటా కోట్లాది చేప పిల్లల విడుదల చేసి చేపల ఉత్పత్తిని పెంచడంతో పాటు మత్స్యకారులకు ఉపాధి



కల్పించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేప పిల్లలను విడుదల చేస్తోంది. నీటి వనరుల్లో చేపలు, రొయ్యల పిల్లలను నిల్వ చేస్తున్నారు. 23,106 నీటి వనరుల్లో 7,612.69 లక్షల ఫింగర్లింగ్స్ (చేప పిల్లలు), 922 లక్షల రొయ్య పిల్లలు నిల్వ చేస్తున్నారు. అయితే ప్రతి సంవత్సరం చేప పిల్లల విడుదల సంఖ్య నీటి వనరుల స్థితి, నీటి లభ్యత, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల ఆధారంగా మారుతూ ఉంటుంది.

### వర్షాభావంతో చెరువులు, కుంటలు వెలవెల

చేపల పెంపకానికి నీరు అత్యంత కీలకం. చెరువులో తగినంత నీరు ఉంటేనే చేప పిల్లలు వేగంగా ఎదుగుతాయి. నీటి మట్టాలు తగ్గితే చేపల పెంపకం మందగించడంతో పాటు చేపల మరణాలు సంభవించే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో చిన్న చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు లేక విలవిల బోతున్నాయి వర్షాలు ఆలస్యంగా కురిస్తే పరిస్థితి మరింత తీవ్రంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా వర్షాధార చెరువులపై ఆధారపడే మత్స్యకార కుటుంబాలు ఈ పరిస్థితితో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి.



### చేపల పెంపకమే జీవనాధారం

రాష్ట్రంలో వేలాది మత్స్యకార కుటుంబాలకు చేపల పెంపకం, చేపల వేట ప్రధాన ఆదాయ వనరు. చేప పిల్లలను పెంచి వాటిని విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. చేపలతో పాటు రొయ్యల పెంపకం కూడా



అనేక ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. అయితే చెరువుల్లో నీరు లేకపోతే చేపల పెంపకం నిలిచిపోవడంతో మత్స్యకారుల కుటుంబాలు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

### చేపల ఉత్పత్తి పెరిగినా.. నీరే కీలకం

తెలంగాణలో గత కొన్నేళ్లుగా మత్స్యరంగం గణనీయంగా అభివృద్ధి చెందింది. రాష్ట్రంలో చేపల ఉత్పత్తి సుమారు 2.60 లక్షల టన్నులు ఉండగా, ప్రస్తుతం అది సుమారు 4.39 లక్షల టన్నులకు రెండింతలకు చేరింది. చేపల ఉత్పత్తి పెరగడానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు, చేప పిల్లల ఉచిత పంపిణీ, చెరువుల అభివృద్ధి వంటి చర్యలు దోహదపడ్డాయి. అయితే ఈ అభివృద్ధి కొనసాగాలంటే నీటి వనరుల్లో తగినంత నీరు ఉండటం అత్యవసరం.

### ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మత్స్యకారుల కోసం ప్రత్యేక కార్యాచరణరూపొందించాల్సిన అవసరం ఉంది. నీరు పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉన్న చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. నీరు ఉన్న చెరువులను గుర్తించి అక్కడే చేప పిల్లలను విడుదల చేయడం, అవసరమైన చోట్ల నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం, చెరువుల పూడికతీత చేపట్టడం, మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో ప్రారంభమైన ట్రెండ్ ఫ్యూజన్ ఇండియా ఆడిషన్స్





**హైదరాబాద్ బ్యూరో, జూలై 19 (నినాదం):**
దేశంలోనే తొలి మల్టీ–డిసిప్లిన్ టాలెంట్ వేదిక ట్రెండ్ ఫ్యూజన్ ఇండియా (టీ ఎఫ్ ఐ ) జాతీయ స్థాయి ఆడిషన్స్ హైదరాబాద్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ప్రారంభమయ్యాయి. ఐకానిక్ మల్టీమీడియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెస్ట్ ఫిజిక్, కిడ్స్, మిస్, మిసెస్, మిస్టర్ ఫ్యాషన్ షోలు నిర్వహించారు. హీనా భాటియా, షాజియా బకల్ షరీఫ్, నిహారికా సూద్, సుధా జైన్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. హైదరాబాద్‌తో ప్రారంభమైన ఈ ఆడిషన్స్ దేశంలోని పలు నగరాల్లో కొనసాగనున్నాయి.








## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరగడం, విదేశీ మదుపర్లు విక్రయాలు జరపడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. దీంతో సెన్సెక్స్ 238 పాయింట్లు కోల్పోగా.. సెన్సెక్స్ 50 పాయింట్ల మేర పతనమైంది. సెన్సెక్స్ 238.41 పాయింట్ల నష్టంతో 77,470.11 వద్ద ముగిసింది. నిఫ్టీ 50.80 పాయింట్లు పతనమై 24,187.70 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్ సీఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, ఎస్‌బీఐ, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రుపాయి విలువ 96.24 వద్ద ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.33 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,066 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## కేంద్ర ఓబీసీ జాబితాలో తెలంగాణ 40 బీసీ కులాల చేర్పునకు వినతి

**న్యూఢిల్లీ బ్యూరో, జూలై 21 (నినాదం):**
తెలంగాణకు చెందిన 40 బీసీ కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, అభివృద్ధి విభాగాల గౌరవ సలహాదారు వి. హనుమంతరావు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సీబీసీ) చైర్‌పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించేందుకు ఈ కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సాధ్వి నిరంజన్ జ్యోతి, పెండింగ్‌లో ఉన్న సాంకేతిక అడ్డంకులను తొలగించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర గుర్తింపు పొందిన ఈ కులాలు కేంద్ర జాబితాలో లేకపోవడంతో తెలంగాణ యువత అవకాశాలను కోల్పోతున్నారని హనుమంతరావు పేర్కొన్నారు.




## ఇకపై ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే పేమెంట్స్

### డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలక మార్పు..

**దేశంలో డిజిటల్ పేమెంట్స్ సిస్టమ్ లో మరో విప్లవాత్మక మార్పు రాబోతున్నది. ఇంటర్నెట్ కనెక్షన్ లేని ప్రాంతాల్లోనూ సులభంగా యూపీఐ చెల్లింపులు జరిపేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఒక కొత్త ఫీచర్‌ను అభివృద్ధి చేస్తున్నది. దీని ద్వారా యూజర్ ఫోన్, వ్యాపారి వద్ద ఉండే 'పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్ రెండూ ఆఫ్‌లైన్‌లో ఉన్నప్పటికీ.. రూ.2,000 వరకు చెల్లింపులు చేయవచ్చు.**

ఈ సదుపాయాన్ని నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఆధారంగా 'ట్యాప్–టు–పే' విధానంలో తీసుకురానున్నారు. ఈ కొత్త ఫీచర్ పనితీరుపై అందుతున్న సమాచారం ప్రకారం వినియోగదారులు ముందుగా తమ ఫోన్‌లో ఇంటర్నెట్ ఉన్నప్పుడు 'ఆన్–డివైస్ యూపీఐ లైట్ వ్యాలెట్' లోకి నగదును లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఇంటర్నెట్




సిగ్నల్ లేని ప్రదేశాల్లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు, తమ ఎన్ఎఫ్‌సీ ఆధారిత స్మార్ట్‌ఫోన్‌ను వ్యాపారి వద్ద ఉన్న సర్టిఫైడ్ ఆఫ్‌లైన్ పీఓఎస్ టెర్మినల్‌పై ట్యాప్ చేస్తే చాలు. ఎలాంటి యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే లావాదేవీ పూర్తవుతుంది.
ఈ లావాదేవీ వివరాలను పీఓఎస్ టెర్మినల్ తనలో స్టోర్ చేసుకొని, తిరిగి ఇంటర్నెట్ కనెక్టివిటీ వచ్చిన వెంటనే సెటిల్‌మెంట్ కోసం పంపుతుంది. ముఖ్యంగా విమానాలు, భూగర్భ మెట్రో స్టేషన్లు, మారుమూల గ్రామాలు వంటి నెట్‌వర్క్ సరిగాలేని లేదా అసలు లేని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఈ ఫీచర్‌ను రూపొందిస్తున్నారు. దీనివల్ల ప్రయాణ సమయాల్లో, సిగ్నల్ సమస్యలు ఎదురయ్యే చోట్ల డిజిటల్ చెల్లింపుల విశ్వసనీయత, సౌలభ్యం గణనీయంగా పెరుగుతుంది. ఈ ఏడాది చివరి నాటికి ప్రముఖ తయారీదారుల నుంచి పీఓఎస్ టెర్మినల్స్‌కు ధ్రువీకరణ పత్రాలు జారీచేసే ప్రక్రియను ఎన్‌పీసీఐ ప్రారంభించవచ్చని తెలుస్తున్నది.

## ఉద్యోగులను కోటీశ్వరులుగా మార్చిన ఐపీవో

### ఎస్‌బీఐ ఫండ్స్: సబ్‌స్క్రిప్షన్‌లో అదుర్స్.. లిస్టింగ్‌లో నిరాశే


స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అనుబంధ ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ దలాల్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఐపీఓలో అనూహ్య స్పందన లభించినప్పటికీ.. లిస్టింగ్‌లో మాత్రం అంతగా ఆకట్టుకోలేకపోయింది. దీంతో వాటాదారులకు నిరాశే ఎదురైంది. మంగళవారం ఎస్‌బీఐ ఫండ్స్ షేర్ ఇష్యూ ధర రూ.574 పోలిస్తే.. కేవలం 6 శాతం ప్రీమియంతో ఎన్ఎస్ఈలో రూ.613 వద్ద ట్రేడింగ్ మొదలెట్టింది. బీఎస్ఈలో రూ.610 వద్ద లిస్ట్ అయ్యింది. అనంతరం దాదాపు 9 శాతం ప్రీమియంతో రూ.625 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బీఎస్ఈలో రూ. 616 వద్ద ట్రేడవుతోంది.
ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సుమారు రూ.1.17 లక్షల కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వచ్చింది. రూ.11,693 కోట్ల నిధులను సమీకరించింది. ఐపీఓ ధరల శ్రేణిని రూ.545–574గా ప్రకటించింది. జులై 14 నుంచి 16 వరకు జరిగిన సబ్‌స్క్రిప్షన్‌కు అనూహ్య స్పందన లభించింది. 41.66




రెట్ల బిడ్డింగ్‌లను అందుకుంది. పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఈ పబ్లిక్ ఇష్యూ జరిగింది. ఎస్‌బీఐ, అముండీ ఇండియా హోల్డింగ్ ఐపీఓలో భాగంగా తమ వాటాలు విక్రయించాయి.
ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీఓ ద్వారా 13 మంది ఉద్యోగులు కోటీశ్వరులుగా మారారు. 2018 నుంచి అమలు చేసిన ఉద్యోగ స్టాక్ ఆప్షన్ల వల్ల పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు కేటాయించిన షేర్లు భారీ లాభాలను ఆర్జించాయి. వీరిలో డిప్యూటీ ఎండీ దేవేందర్ పాల్ సింగ్‌కు చెందిన వెస్టెడ్ షేర్ విలువ రూ. 21.14 లక్షల నుంచి రూ.121 కోట్లకు పెరిగింది. ఫండ్ హౌస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసన్ రామ అయ్యర్ షేర్ విలువ రూ.105 కోట్లుగా ఉంది. మొత్తంగా 13 మందికి పైగా ఉద్యోగుల షేర్ల విలువ రూ.1 కోటి కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం.

## మారుతీ సుజుకీ కార్లు మరింత ప్రియం

ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ వినియోగదారులకు మళ్లీ షాక్ ఇచ్చింది. జూన్ నెలలోనే అన్ని మోడళ్లపై రూ.30 వేల వరకు ధరలు పెంచిన కంపెనీ.. మరోసారి రూ.30 వేలు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఆగస్టు నుంచి ఇది అమలవుతుందని తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. దీంతో ఈ కార్ల ధరలు మరింత ప్రియం కానున్నాయి. ఉత్పత్తి వ్యయాలు పెరగడమే ఇందుకు కారణంగా కంపెనీ పేర్కొంది. "కొన్ని నెలలుగా ధరలను తగ్గించేందుకే ప్రయత్నిస్తున్నాం. కానీ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ధరలు పెంచాల్సిన పరిస్థితి వచ్చింది. వినియోగదారులపై సాధ్యమైనంత మేర తక్కువ స్థాయిలోనే ఆ ప్రభావం ఉండేలా చూసుకుంటాం" అని కంపెనీ తెలిపింది. మారుతీ సుజుకీ ప్రస్తుతం ఎస్–ప్రెస్సో వంటి ఎంట్రీలెవల్ మోడళ్ల నుంచి ప్రీమియం యుటిలిటీ వెహికల్ అయిన ఇన్విక్టో వరకు పలు మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరలు రూ.3.5 లక్షల నుంచి ప్రారంభమై రూ.28.7 లక్షల (ఎక్స్‌షోరూం) వరకు ఉన్నాయి.




## గూగుల్ ఉద్యోగుల ఆందోళన..

### సుందర్ పిచాయ్‌కు వినతి!

ప్రపంచవ్యాప్తంగా ఏఐ గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఏఐ వల్ల పనులు వేగంగా, సులభంగా పూర్తవుతున్నాయి. అయితే.. మరోవైపు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఉద్యోగాలు పోతాయా?.. అనే భయం కూడా చాలా మందిలో పెరుగుతోంది. ఇదే ఆందోళన ఇప్పుడు ప్రముఖ టెక్ దిగ్గజం అయిన గూగుల్ ఉద్యోగుల్లో కూడా కనిపిస్తోంది. దీంతో సుమారు 4500 మందికిపైగా ఉద్యోగులు సీఈఓ సుందర్ పిచాయ్‌కు ఒక పిటిషన్ సమర్పించారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు ఈ కథనంలో చూసేద్దాం. సుందర్ పిచాయ్‌కు అందించిన పిటిషన్‌లో.. ఏఐ కోసం కంపెనీ భారీగా పెట్టుబడులు పెడుతూనే, మరోవైపు ఉద్యోగులను తొలగించడం సరికాదని వెల్లడించారు. ఉద్యోగులకు భద్రత కల్పించే విధంగా.. కొత్త విధానాలు తీసుకురావాలని వారు కోరారు. అంతే కాకుండా క్యాంపస్ వెలుపల 100 మంది ఉద్యోగులు శాంతియుతంగా నిరసన కూడా చేపట్టారు. ఉద్యోగ భద్రత కోసం.. గూగుల్ చరిత్రలో జరిగిన అతిపెద్ద ఉద్యమాల్లో ఇది ఒకటిగా చెప్పవచ్చు. ఉద్యోగుల డిమాండ్ ఏమిటంటే కంపెనీ లేఆఫ్‌లు చేయాల్సి వచ్చినా.. ముందుగా స్వచ్ఛందంగా ఉద్యోగం వదిలే అవకాశం ఇవ్వాలి. ఉద్యోగం కోల్పోయే వారికి తగిన సెవరెన్స్ ప్యాకేజీ అందించాలి. అలాగే ఉద్యోగుల పని తీరును అంచనా వేసే విధానంలో కూడా మార్పులు చేయాలని కోరుతున్నారు. ఎందుకంటే.. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం చాలామందికి అన్యాయం చేస్తోందని ఉద్యోగులు భావిస్తున్నారు. గతంలో కూడా గూగుల్ ఉద్యోగులు.. నైతిక అంశాలపై, ఏఐ వినియోగంపై నిరసనలు చేశారు. కానీ.. ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. ఇప్పుడు వారి ఆందోళన పూర్తిగా తమ ఉద్యోగాల గురించే. ఏఐ అభివృద్ధి చెందుతున్న కొద్దీ.. తమ ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయనే భయం వారిని ఈ ఉద్యమానికి దారితీసింది.

## ఆంజనేయ స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు



**ఆమనగల్లు, జూలై 21(నినాదం):** గట్టు ఇప్పలపల్లి గ్రామంలోని బండల గడ్డ ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తన సతీమణి మాధవిరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలు, కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని ఆశీస్సులు పొందారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు సజావుగా సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులందరి పేర్లు ఓటర్ల జాబితాలో నమోదు కావాలి

### మాజీ కార్పొరేటర్ సబితఅనిల్ కిశోర్



**అల్వాల్, జూలై 21(నినాదం):** అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశానుసారం సర్ కార్యక్రమం జరుగుతున్న వెస్ట్ వెంకటాపురం, ఫేస్ మిస్సర్ వర్క్, రామచంద్రయ్య కాలనీలలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ, బి ఎల్ ఏ, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ లో కార్పెంటర్ అదృశ్యం

### పిఎస్‌లో ఫిర్యాదు చేసిన తండ్రి



**జవహర్‌నగర్, జులై 21 (నినాదం):** కార్పెంటర్ అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ లో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... సాయి కుమార్ (25) గత కొద్ది కాలంగా బాలాజీ నగర్ లో తల్లిదండ్రులతో కలిసి నివాసముంటున్నాడు. గత కొద్ది కాలంగా సాయికుమార్ కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం నాలుగున్నర గంటలకు కార్పెంటర్ పని ఉందని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లి ఆ తర్వాత తన సోదరికి ఫోన్ చేసి బంధువులు మందలించడంతో మనసు చెలించిపోయి చనిపోతున్నా అని చెప్పి తన ఫోను స్విచ్ ఆఫ్ చేశాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు అతని గురించి చుట్టుపక్కల వెతికిన తెలిసిన వారి వద్ద వెతికిన అతని సమాచారం లభించలేదు. ఈ మేరకు సాయికుమార్ తండ్రి సోమనారాయణ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా ఎల్లమ్మ కళ్యాణోత్సవం



**అల్వాల్, జూలై 21 (నినాదం):** మచ్చబొల్లారం జనప్రియ దగ్గర గల జేజే నగర్ లో ఎల్లమ్మ ఆలయంలో అంగరంగ వైభవంగా ఎల్లమ్మ కళ్యాణోత్వంఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవం మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి, సబిత అనిల్ కిషోర్ గౌడ్ లు పాల్గొని అమ్మవారి ఆశీర్వచం తీసుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రజలు సుఖశాంతులతో భారీ వర్షాలు కురవాలని కోరుకున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు డోలి రమేష్, నార్ల సురేష్, పవన్, ప్రశాంత్, సులోచన తదితరులు పాల్గొన్నారు.

# యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలి


### క్రీడల్లో రాణించేందుకు
### పోటీలు మంచి వేదికగా నిలుస్తాయి
### ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్ వివేకానంద

**కుత్బుల్లాపూర్, జూలై 21 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద ఈ నెల 26వ తేదీ (ఆదివారం) కొంపల్లి లోని టార్క్ టౌన్ ఫిట్నెస్ నందు నిర్వహించనున్న డబ్బాసి తెలంగాణ ఓపెన్ డిస్ట్రిక్ట్ పవర్లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని నిర్వాహకులు ఆహ్వానించారు. కొంపల్లిలోని టార్క్ టౌన్ ఫిట్నెస్ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక పవర్లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను ప్రోత్సహించాలని నిర్వాహకులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతలో ఫిట్నెస్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు పవర్‌లిఫ్టింగ్ వంటి శక్తి క్రీడలను ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని అన్నారు. యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు క్రీడల్లో రాణించేందుకు ఇలాంటి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్ విజయవంతం కావాలని, రాష్ట్ర స్థాయిలో మరిన్ని ప్రతిభావంతులైన పవర్‌లిఫ్టర్లను తీర్చిదిద్దే దిశగా నిర్వాహకులు పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ నెల 26న నిర్వహించనున్న ఈ ఛాంపియన్‌షిప్‌లో బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా నలుమూలల నుండి పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారులు పాల్గొననున్న ఈ పోటీల్లో విజేతలకు మొత్తం రూ. 30వేల నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు, మెడల్స్ ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ కిరణ్, వర్ష, కీర్తన ఆకాష్ పాల్గొన్నారు.



# 32 ఏళ్ల తర్వాత మళ్లీ కలిసిన బాల్యమిత్రులు

### నార్సింగి జడ్పీ హైస్కూల్
### పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం
### ఏడాదికోసారి కలుద్దామని తీర్మానం
### అవసరంలో ఒకరికొకరు అండగా ఉంటామని ప్రతిజ్ఞ



**రాజేంద్రనగర్, జూలై 21 (నినాదం):** కాలం మూడు దశాబ్దాలకు పైగా గడిచినా.. వారి బాల్య స్నేహం మాత్రం చెక్కుచెదరలేదు. 1994--95 విద్యా సంవత్సరంలో నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 32 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఖానాపూర్ గ్రామంలోని 'మండవ ఇల్లు' వేదికగా అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ అపూర్వ సమ్మేళనం తీవ్ర భావోద్వేగ క్షణాలకు నిలయంగా మారింది. ఈ ఆత్మీయ కలయికకు సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ, చిన్ననాటి అల్లరులు, గురువుల బోధనలు, పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఎంతోకాలం తర్వాత కలుసుకున్న మిత్రులు తమ జీవిత ప్రయాణంలో ఎదురైన కష్టసుఖాలను పంచుకుంటూ ఆనందబాష్పాలు రాల్చారు. మిత్రులందరి కలయికతో ఖానాపూర్ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.


**ఘనంగా నిర్వాహకుల సత్కారం..**
ఈ కార్యక్రమాన్ని సహచర విద్యార్థులు మహికృష్ణ, హరికృష్ణ, రాజు, రమేష్, నాగిరెడ్డి, ప్రవీణ్ కుమార్, సుధాకర్, శ్రీపాల్ తదితరులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ వేడుకను అద్భుతంగా ఏర్పాటు చేసిన నిర్వాహకులను సహచర విద్యార్థినులు త్రివేణి, ఉమాదేవి ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు మరియు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా త్రివేణి, ఉమాదేవి మాట్లాడుతూ.. "ఇలాంటి ఆత్మీయ కలయికలు జీవితంలో చాలా అరుదుగా వస్తాయి. మన స్నేహితులందరూ ఎక్కడ ఉన్నా ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలి. మన స్నేహబంధం తరతరాలకు ఆదర్శంగా నిలవాలి" అని ఆకాంక్షించారు.

**వార్షిక సమావేశాలు:** గతంలో 15 ఏళ్ల క్రితం ఒకసారి కలుసుకున్నామని, ఇకపై ప్రతి ఏటా తప్పనిసరిగా సమావేశమై పలకరించుకోవాలని పూర్వ విద్యార్థులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

**పరస్పర సాయం:** జీవితంలో ఎలాంటి ఆర్థిక, సామాజిక, వ్యక్తిగత ఇబ్బందులు ఎదురైనా ఒకరికొకరు అండగా నిలవాలని, సహచర మిత్రుల సంక్షేమమే తమ బాధ్యతగా భావిస్తామని ప్రతిజ్ఞ చేశారు. "కోట్లాది రూపాయల ఆస్తి ఉన్నా... చిన్ననాటి స్నేహితులతో కలిసి గడిపే కొన్ని గంటల ఆనందానికి ఏదీ సాటిరాదు. ఆ జ్ఞాపకాలు జీవితాంతం చిరస్థాయిగా నిలిచిపోతాయి" అని పూర్వ విద్యార్థులు భావోద్వేగంగా పేర్కొన్నారు. మధుర జ్ఞాపకాలు, ఆత్మీయ పలకరింపులు, నవ్వులు, కన్నీటి తడులు కలగలిసిన ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రతి ఒక్కరి హృదయంలో చెరిగిపోని ముద్ర వేసింది.

## ఆగస్టు 30న గండిగూడెం గ్రామ దేవతల ఆలయాల విగ్రహ ప్రతిష్టాపన, ప్రారంభోత్సవం

### దయారా జంగంకుంట ఆక్రమణలపై కఠినచర్యలు
### పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, జూలై 21(నినాదం):** అమీన్పూర్ డివిజన్ పరిధిలోని గండిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవతల ఆలయాలలో ఆగస్టు 30న ప్రతిష్టాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన ఆలయంలో దుర్గమ్మ, భూలక్ష్మమ్మ, చిత్తారమ్మ దేవతల విగ్రహాలను ప్రతిష్టించబోతున్నట్లు తెలిపారు. పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. మరో రెండు వారాల్లో పనులు పూర్తిచేసి.. ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

**జంగంకుంట ఆక్రమణలపై కఠిన చర్యలు..**
సుల్తాన్పూర్ మెడికల్ డివైస్ పార్క్ పరిధిలోని జంగంకుంట పరిధిలో ఇటీవల కొందరు మట్టి నింపుతూ ఆక్రమణలకు పాల్పడడంపై ఎమ్మెల్యే జిఎంఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల దయారా గ్రామస్తులు ఈ అంశం పైన ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా.. మంగళవారం ఉదయం స్థానికులతో కలిసి కుంటను పరిశీలించారు. కుంటకు ఒక వైపు నుండి మట్టి నింపుతూ అక్రమించేందుకు ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ తో ఫోన్ లో మాట్లాడి.. కుంటను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కుంట పరిరక్షణకు సంపూర్ణ సహకారం అందిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు రాజు, భాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



### కబ్జాలో ఉన్న బాధితులకు

# న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం

- తహసీల్దార్ మునిరుద్దీన్



**వికారాబాద్, జూలై 21(నినాదం):** కబ్జాలో ఉన్న బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మోమిన్ పేట తహసిల్దార్ మునీరుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని టేకులపల్లి గ్రామానికి చెందిన సమస్యాత్మక భూమిని ఆయన సందర్శించి పరిశీలించారు. గత 50 సంవత్సరాల నుండి సర్వేనెంబర్ 437, 438, 4:40 నంబర్లలో సుమారు 50 మంది కబ్జాలో ఉన్నారు. గత 50 సంవత్సరాల క్రితం పట్టాదారు వద్ద కొనుగోలు చేశారు. అయినప్పటికీ అప్పటినుండి ఇప్పటివరకు పట్టాదారుల పేర్ల మీదనే ఆన్లైన్లో ఉండటం వల్ల, వారి వారసులు కబ్జాలో ఉన్న వారిని బెదిరించి డబ్బులు కావాలని మమ్మల్ని డిమాండ్ చేస్తున్నారని బాధితులు తహ సిల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు తాసిల్దార్ కబ్జాలో ఉన్న బాధితులు వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడం వల్ల పట్టాదారులకు రైతుబంధు గాని ఎలాంటి లబ్ధి చేకూరదని బాధితులకు అట్టి భూమి పైన హక్కు ఉంటుందని, అందుకోసం బాధ్యులకు న్యాయం చేసేందుకు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ద్వారా పంచనామా నిర్వహించి, సర్వే నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని రైతులకు ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుండి అర్హులైన పేద ప్రజలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో, ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి పి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మీకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. గ్రామంలో సమస్యలు తలెత్తకుండా గ్రామస్తుల సమక్షంలో శాంతి యుతంగా సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మన్మోహన్ గౌడ్, మాజీ ఎంపిటిసి భాస్కర్, జిపిఏ శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ చారి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుమార్, నరేందర్ గౌడ్, ఫయాజ్, రహమత్ అలీ, మాణిక్యం, కబ్జాలో ఉన్న బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై ఎమ్మెల్యే సమీక్ష

### అర్హులందరికీ ఓటు హక్కు!

**ఆమనగల్లు, జూలై 21(నినాదం):** తలకొండపల్లి మండలం, గట్టిపల్లపల్లి గ్రామపంచాయతీలో కల్వకుర్తి ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి గారు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పై కీలక సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి 10 మంది బి ఎల్ఎ లకు నియమించబడిన 27 మంది సూపర్వైజర్లతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రతి సూపర్వైజర్ తమ పరిధిలోని బి ఎల్ఎ, బిఎల్ఓ లతో సమన్వయం చేసుకుంటూ, వార్డు పరిధిలోని ప్రతి ఓటరిని ప్రత్యక్షంగా కలిసి, పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఆగస్టు 3వ తేదీలోపు ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాకు దూరం కాకుండా



బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జిలు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, సంధ్యా రెడ్డి, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

# అలుపెరుగని పాదయాత్రలు..

- మొక్కవోని పట్టుదలతో డంపింగ్ ఎత్తివేత దీక్షలు
- 11వ రోజుకు చేరిన పాదయాత్రలు





**జవహర్ నగర్, జులై 21 ,(నినాదం):** ఆలు పెరగని పోరాటం... మొక్క వోని దీక్ష.. వెల్లువెత్తిన ప్రజా చైతన్యం... వెరసి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్రలు 11వ రోజుకు చేరాయి. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జ్యోతి కాలనీ సిపిఐ కాలనీ బజరంగ్ కాలనీ లలో మహా పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి ఎస్ బోస్ పాల్గొని మాట్లాడుతూ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వలన ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారని ప్రజలు ప్రాణాలు గాలిలో పెట్టుకుని జీవిస్తున్నారని జవహర్ నగర్ ప్రజల 25 ఏళ్లుగా డంపింగ్ యార్డ్ ఎప్పుడు ఎత్తివేస్తారా? అని ఎదురు చూస్తున్నారనీ అనేక వినతులు సమర్పించారని తెలిపారు. ప్రజా ప్రతినిధులను కలిసినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. ఇప్పుడు జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ అనేది ప్రజల తాగు నీటిని విష పూరితము చేస్తూ గాలిని విషపూరిత రోగాల పాలు చేస్తున్న ఒక పెద్ద పర్యావరణ విపత్తు అని తాత్కాలిక చర్యలతో కాలయాపన చేసే సమయం దాటిపోయిందని చట్టాలు శాస్త్రాలు స్పష్టంగా చెపుతున్నాయని ఇక్కడ ప్రజలు బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వెంటనే డంపింగ్ యార్డ్ ను ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ సలహాదారుడు ఆర్ నరసింహ గౌడ్, చైర్మన్ షేక్ షావలి, కో కన్వీనర్స్ తోటపల్లి శంకర్, శివ బాబు, ఐ ఎఫ్ టి యు బహుజన సత్త బండ కింది సింగరయ్య గౌడ్, రైతు సంఘం జిల్లాకార్యదర్శి నిమ్మల నరసింహులు, సిపిఐ జిల్లా కౌన్సిల్ నెంబర్ కసర్ల నాగరాజు, సిపిఎం నాగేష్, అంబాల ఎల్లయ్య, షేక్ అజిత్, పెరికసునీత, ఫాతిమా, సిపిఐ నాయకులు వి. స్వరూప, రవి నాయక్ , వెంకటరమణభాస్కర్ రావు వెంకట్ రాజ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దాడి ప్రజాస్వామ్య విరుద్ధం

### ఎన్ఎస్యుఐ ఫరిద్



**ఆమనగల్లు, జూలై 21(నినాదం):** ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఎన్ఎస్యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్ పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లను అణచివేయకుండా, సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై నమోదైన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని ఆయన కోరారు.

# ఆటా - 2026 వేడుకలకు లక్ష్మీ నర్సింహా రెడ్డికి ఆహ్వానం

**ఆమనగల్లు, జూలై 21(నినాదం):** అమెరికాలోని తెలుగు రాష్ట్రాల ప్రవాస భారతీయులు 37 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాలలో సేవే పరమావధిగా అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతూ సొంత గడ్డపై వారికున్న మమకారాన్ని చాటుతున్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా 2019 వ సంవత్సరంలో ఆటా - 2020 వేడుకలకు ప్రీమియర్ స్పాన్సర్ గా కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి వ్యవహరించి ప్రవాస భారతీయుడు,అమెరికా తెలుగు సంఘం ప్రతినిధి కిషోర్ గూడూరు ద్వారా మండలములో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. 2019,2021,2023,2025 సంవత్సరాలలో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో, ముద్విన్ ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులు, మంచినీటి సౌకర్యాలు, విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూలు బ్యాగులు,కరోనా సమయంలో కరోనా కిట్లు, నిరుపేదలకు వృత్తిపరమైన పనిముట్లు మరియు ప్రమాదాల నివారణలో పోలీసు వారు వినియోగించే వేగ నియంత్రికలు అందజేసి సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. నవత,యువత, భవిత అనే నినాదంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ మేరకు తెలుగు రాష్ట్రాలలో రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఆటా వేడుకలలో చురుకైన పాత్ర పోషించిన లక్ష్మీ నర్సింహా రెడ్డికి అమెరికా తెలుగు సంఘం నుండి జులై 31 నుండి ఆగస్టు 2, 2026 తేదీలలో బాల్టిమోర్(మెరిలాండ్),అమెరికా నగరంలో జరిగే 19వ అమెరికా తెలుగు యూత్ కన్వెన్షన్ కు ఆటా అధ్యక్షుడు



జయంత్ చల్లా, బోర్డ్ ఆఫ్ ట్రస్టీ కిషోర్ గూడూరుల నుండి ఆహ్వానం అందినట్లు తెలియజేసారు. అమెరికాలో జరిగే ఆటా - 2026 వేడుకలకు ఆహ్వానం అందడం చాలా సంతోషంగా ఉందని ఇట్టి కార్యక్రమానికి హాజరవుతున్నట్లు లక్ష్మీ నర్సింహా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## గురుమూర్తి నగర్ లో "సర్" హెల్ప్ డెస్క్ ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూలై 21 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గురుమూర్తి నగర్ లో డిసిసి ఉపాధ్యక్షులు బుయ్యని శివ కుమార్ ఏర్పాటు చేసిన "సర్" హెల్ప్ డెస్క్ కార్యక్రమాలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటర్లకు "సర్ " ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ పై అవగాహన కల్పిస్తూ, అవసరమైన సమాచారం అందించడం, నమోదు ప్రక్రియలో సహాయ సహకారాలు అందించేందుకు ఈ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంతారెడ్డి మాట్లాడుతూ "సర్" కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందించడంలో హెల్ప్ డెస్క్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి అర్హులైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని వివరించారు.

## గిరిజన యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణలు

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, జూలై 21(నినాదం ):** గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థిక స్వావలంబన సాధించేలా చేయడం లక్ష్యంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ట్రైకోర్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను వికారాబాద్ జిల్లాలో విస్తృతంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. వ్యవసాయం, బ్యూటీ అండ్ వెల్నెస్, అప్పారెల్, టూరిజం, హాస్పిటాలిటీ, టెలికాం, లాజిస్టిక్స్, ఐటీ, ఐటీఈఎస్, ఆటోమొబైల్ తదితర రంగాలలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్కెట్ ఆధారిత నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 10,500 మంది నిరుద్యోగ గిరిజన యువతకు ఈ శిక్షణలను అందించే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణలు జాతీయ నైపుణ్య అర్హతా చట్రం ఎన్ ఎస్ క్యూ ఎఫ్ ప్రమాణాలకు అనుగుణంగా గుర్తింపు పొందిన శిక్షణా సంస్థల ద్వారా నిర్వహించబడతాయని, శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన అర్హులైన గిరిజన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆసక్తి గల జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిడీ టి డీ వో వికారాబాద్ కార్యాలయాన్ని సంప్రదించి తమ పేర్లను ఈ నెల 25.7.2026 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు, ఇతర వివరాలకు ఫోన్.నం. 8464006666 ను సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు



**కుత్బుల్లాపూర్, జూలై 21 (నినాదం):** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ( ఏఐసీసీ ) అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖర్గే కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బండి శామ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ వీరేందర్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ ఇన్‌చార్జి కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొలన్ జీవన్ రెడ్డి, వరుగాని వాసు, మురళి, మైసిగారి శ్రీనివాస్, రాజి రెడ్డి, బంటు నరేష్, బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

44 మంది లబ్ధిదారులకు రూ.15.98 లక్షల విలువైన చెక్కుల అందజేత





**బుగ్గారం, జూలై 21,(నినాదం )**

బుగ్గారం మండల ఎంపీడీవో కార్యాలయంలో మంగళ వారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్య క్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని అర్హులైన 44 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.15,98,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేద,మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర సమయంలో అండగా నిలుస్తున్న గొప్ప సంక్షేమ పథక మని అన్నారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స పొందలేని కుటుంబాలకు ప్రభుత్వం సకాలంలో ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందని తెలిపారు.ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రజా సేవే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచులు నక్క రాజవ్వ,ధర్మరాజు,తిరుపతి, ఉప సర్పంచ్ లు జంగా లావణ్య శ్రీనివాస్ గజ్జల విజయ్ ఉగ్గారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్, బుగ్గారం మండల తాసిల్దార్ భువనేశ్వర్ వివిధ స్థాయిల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పాతర్లపల్లిలో భూ భారతి-రీ సర్వే అవగాహన సదస్సు

**హాజరైన అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ,మండల అధికారులు**

**జమ్మికుంట, జూలై 22 (నినాదం)**

ఇల్లందకుంట మండల పరిధిలోని పాతర్లపల్లి గ్రామంలో స్థానిక గ్రామ సర్పంచ్ బైరెడ్డి వెంకటరమణ రెడ్డి అధ్యక్షతన భూ భారతి రీ సర్వే పై గ్రామసభ ప్రత్యేక అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించే భూ రీ–సర్వే ద్వారా సరిహద్దు తగాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పారదర్శకమైన భూ రికార్డుల ప్రక్షాళనతో ప్రతీ రైతుకూ తమ భూములపై స్పష్టమైన హక్కులు లభిస్తాయని, రైతులు ఈ ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. అనంతరం రైతుల సందేహాలను అధికారులతో చర్చించి నివృత్తి చేశారు.ఈ అవగాహన సదస్సులో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తేజస్విని, ఆర్డిఓ జల కుమారి ఏడి ఎంపిడిఓ, విజయ్ కుమార్, ఎంఆర్ఓ మనోజ్ కుమార్,సర్వేయర్లు, జీపీఓ ఏఈఓ పంచాయతీ కార్యదర్శి ఉప సర్పంచ్ చల్లూరి కుమార్, వార్డు సభ్యులు కోడం నవీన్, మొగిలి, రోహిణి, అఖిలలతో పాటు గ్రామ రైతులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.



## తిప్పని శ్రీకాంత్ గౌడ్ ఆకస్మిక మృతి బాధాకరం

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు**

**మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ**

**జమ్మికుంట, జూలై 22 (నినాదం)**

వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తిప్పని శ్రీకాంత్ గౌడ్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. శ్రీకాంత్ గౌడ్ దశదినకర్మ మంగళవారం పోతిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి హాజరైన మంథని మాజీ శాసనసభ్యులు బీఆర్ఎస్ నేత పుట్ట మధు కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ తో కలిసి పరామర్శించారు. శ్రీకాంత్ గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పుట్ట మధు మాట్లాడుతూ, అతి చిన్న వయసులోనే గుండెపోటుతో శ్రీకాంత్ గౌడ్ మరణించడం ఆ కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిప్పని అజయ్ గౌడ్ ఒల్లాల శ్రీకాంత్ గౌడ్ సిరి శెట్టి వెంకట మల్లయ్య గౌడ్ ఓదెల గౌడ్ జక్కు రాకేష్ భాస్కర్ లింగంపల్లి శ్రీనివాసరావు ప్రకాష్ మనోహర్ జోడు శ్రీనివాస్ కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

**ఫిర్యాదు చేసినప్పటికీ ఆలస్యం ఎందుకు? కమిషనర్, మేయర్ వివరణ ఇవ్వని కమిషనర్, మేయర్**

**కరీంనగర్ అసెంబ్లీ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్**

**కరీంనగర్, జులై 21(నినాదం)**



కరీంనగర్ నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ఉద్యోగిని ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు లైంగికంగా వేధిస్తున్నారనే ఆరోపణలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ డిమాండ్ చేశారు. భర్త మృతి చెందిన అనంతరం కారుణ్య నియామకంలో ఉద్యోగంలో చేరిన మహిళను అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు కొంతకాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తూ, ఫోన్ల ద్వారా వేధింపులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. తమను కలవకపోతే ఉద్యోగం పోతుందని బెదిరించడం, ఒంటరిగా బయటకు రావాలని ఒత్తిడి చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ వేధింపులపై బాధిత మహిళ ఈ నెల 13న నగరపాలక సంస్థ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా, విచారణకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు సంబంధిత ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అబ్దుల్ రెహమాన్ ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై నగరపాలక సంస్థ కమిషనర్, మేయర్ ప్రజలకు వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలకు పూర్తి భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటూ, ఈ ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ఉద్యోగులను సేవల నుంచి తొలగించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అబ్దుల్ రెహమాన్ కోరారు. భవిష్యత్తులో మహిళా ఉద్యోగులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడమే లక్ష్యం: డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, జులై21(నినాదం)**

కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ రాష్ట్రానికి ప్రతీకగా నిలిచే రాష్ట్ర పండుగ అని అన్నారు. ప్రతి ఏడాది కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసే ఉద్దేశంతో బోనాల వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 'బోనం' అంటే భోజనం అని, దానిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి అనంతరం భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తారని వివరించారు. ఈ ఆచారం సమాజంలో సుఖశాంతులు, ఐకమత్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు.వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ వి. నరేందర్ రెడ్డికి విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికి ప్రత్యేక నృత్య ప్రదర్శనతో అలరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డైరీ చైర్మన్ రాజేశ్వర్ రావుకు గౌరవ డాక్టరేట్

**అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**

**కరీంనగర్, జులై 21 (నినాదం)**



అమెరికాలోని మేరీల్యాండ్ విశ్వవిద్యాలయం ప్రదానం చేసిన ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ అందుకున్న కరీంనగర్ డైరీ చైర్మన్ డా. చలిమెడ రాజేశ్వర్ రావును బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆయన సప్తగిరి కాలనీలోని నివాసంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ, గత నాలుగు దశాబ్దాలుగా కరీంనగర్ డైరీని విజయవంతంగా ముందుకు నడిపిస్తూ, పాడి పరిశ్రమ అభివృద్ధికి డా. రాజేశ్వర్ రావు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగానే ఈ గౌరవ డాక్టరేట్ లభించిందన్నారు. వేలాది మంది పాడి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తూ కరీంనగర్ డైరీకి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పాడి పరిశ్రమ అభివృద్ధికి మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టి, కరీంనగర్ డైరీ ఖ్యాతిని దేశవ్యాప్తంగా మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తూ డా. చలిమెడ రాజేశ్వర్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలుపై అధికారులకు కీలక ఆదేశాలు

**జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు**

**జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా**



**కరీంనగర్, జులై21(నినాదం)**

జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రవాణా, పోలీసు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు సమన్వయంతో సమగ్ర కార్యాచరణ రూపొందించి, చేపట్టిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని సూచించారు.ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ నిర్వహించిన వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా రహదారి భద్రతా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రహదారి భద్రతకు సంబంధించిన చర్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జాతీయ రహదారుల హక్కు మార్గం (రైట్ ఆఫ్ వే) పరిధిలో కొత్త వాణిజ్య నిర్మాణాలు, మున్సిపల్ లేదా వాణిజ్య అనుమతులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. జాతీయ రహదారుల వెంట ఆక్రమణలను గుర్తించేందుకు డ్రోన్ల ద్వారా నిఘా చేపట్టాలని సూచించారు.రోడ్డు భద్రత కోసం ప్రత్యేక హైవే నిఘా బృందాలను ఏర్పాటు చేసి, అక్రమ పార్కింగ్, అతివేగం, ఇతర ఉల్లంఘనలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. వేగ నిర్ధారణ పరికరాలు, నిఘా కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, అత్యవసర కాల్ బాక్సుల పనితీరును పరిశీలించాలని ఆదేశించారు.



## ప్రతిపాదిత తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

**మల్లాపూర్, జూలై 21 (నినాదం):**

మల్లాపూర్ మండలంలోని సతారాం గ్రామంలో ప్రతిపాదిత తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించి, పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, అవసరమైన సదుపాయాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, ఫర్నిచర్, విద్యుత్ తదితర మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, పాఠశాల ప్రారంభానికి ముందే విద్యార్థుల వినియోగానికి సిద్ధంగా ఉంచేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పాలనాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి రెవెన్యూ డివిజన్ అధికారి నరసింహారావు, మండల విద్యాధికారి దామోదర్ రెడ్డి, తహసీల్దార్ రామచందర్, సర్పంచ్ నారాయణ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రజలు నీటి ఇబ్బందులు తీర్చేందుకే బోరు బావి వేయించాం

**కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్**

**కోరుట్ల, జూలై 21 (నినాదం)**

నీరు అడుగంటిపోయి నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్న దృష్ట్యా నీటి ఇబ్బందులు తీర్చేందుకే బోరు బావి వేయించామని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ అన్నారు. కోరుట్ల పట్టణంలోని 14వ వార్డులో నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన చైర్ పర్సన్ మున్సిపల్ ద్వారా నూతన మోటార్ ను అమర్చి బోర్ మోటార్ ని స్థానిక వార్డు కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి తో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండవేణి వెంకటేష్, రిజ్వాన్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## పేరు మార్పుకు రూ.1,000 డిమాండ్..?

**ఫిర్యాదు చేస్తే బెదిరింపులు!**

**మల్లాపూర్, జూలై 21 (నినాదం):**

మల్లాపూర్ గ్యాస్ కనెక్షన్ పేరు మార్పు కోసం రూ.1,000 డిమాండ్ చేశారని, ఆ విషయంపై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు, అనంతరం తనను ఫోన్ ద్వారా బెదిరించారని మల్లాపూర్ మండలానికి చెందిన ఏనుగు వెంకట్ రెడ్డి ఆరోపించారు. వెంకట్ రెడ్డి పిర్యాదు మేరకు, తన తండ్రి మరణించడంతో గ్యాస్ కనెక్షన్‌ను తన పేరుపై మార్చుకునేందుకు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీని ఆశ్రయించినట్లు తెలిపారు. ఏజెన్సీ నిర్వాహకుడు తోట రాజం, ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న వ్యక్తి, పేరు మార్పు ప్రక్రియ కోసం రూ.1,000 డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. పెరు మార్పుకు రసీదు ఇవ్వబోమని చెప్పినట్లు ఆయన తెలిపారు. దీంతో ఈ విషయంపై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఫీర్యాదు మేరకు ఏజెన్సీకి చెందిన వ్యక్తి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను వెంకట్ రెడ్డి కోరారు. గత కొన్ని రోజులుగా ఏజెన్సీపై పలు ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోక పోవడంపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## వైద్య సేవలో ఆదిత్య ఆసుపత్రి సేవలు అభినందనీయం

**బాల వికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం.. ఉచిత పరీక్షలు మందుల పంపిణీ**




**జమ్మికుంట, జూలై 21 (నినాదం)**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో బాల వికాస ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జమ్మికుంట పట్టణంలోని ప్రముఖ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులైన ఆదిత్య, అమృత హాస్పిటల్స్ యజమాన్యం ఉచిత వైద్య సేవలను అందించారు. సుమారు 300 మంది హాజరైన ఈ వైద్య శిబిరంలో అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదిత్య ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, సమాజసేవలో బాలవికాస సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని వారి సహకారంతో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆదిత్య అమృత ఆసుపత్రుల ఆధ్వర్యంలో గతంలో ఎన్నో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత మందులు పరీక్షలు నిర్వహించామని భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 13 వ వార్డు కౌన్సిలర్ ఏగీత సుజాత అశోక్ 14వ వార్డు కౌన్సిలర్ మైస శిరీష రవి బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన ఆదిత్య హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యం

**వన మహోత్సవంలో మొక్కలు నాటిన సిపి.. సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు**





**జమ్మికుంట, జూలై 22 (నినాదం)**

ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యమని, పోలీసింగ్ లో ప్రజల భాగ్యస్వామ్యమే విజయానికి మూలమని కరీంనగర్ సీపీ గౌస్ అలాం అన్నారు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజా భద్రత పర్యావరణ పరిరక్షణ విద్యార్థులతో అవగాహన, రోడ్డు భద్రత పోలీసింగ్ బలోపేతానికి సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా అత్యవసర పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లు ముద్రించిన ఎక్సమ్ పాళ్లను విద్యార్థులకు పంపిణీ చేసి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ ప్రజల సమన్వయంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని గ్రామాల్లో మాదకద్రవ్యాలు, జూదం ,సైబర్ మోసాలు, గురించి తెలిసినట్లయితే పోలీసులకు సమాచారం అందజేయాలని వెల్లడించారు. ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్లో వార్షిక తనిఖీని నిర్వహించి చట్ట అమలు క్రైమ్ వెహికల్స్ ప్రభుత్వ ఆసుపత్రులు పలు కేసుల దర్యాప్తు గురించి పారా తీసి సూచనలు ఇచ్చారు. అనంతరం జమ్మికుంట రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ప్రతి విషయం గురించి పోలీస్ అధికారులను ఆరా తీయడంతో పాటు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు వేగవంతమైన పారదర్శకమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట రూరల్ ఇన్స్పెక్టర్ పులి వెంకట్ ఎస్సై క్రాంతి కుమార్ తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్లలో ఘనంగా ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు

పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ అన్నం లావణ్య




**కోరుట్ల, జూలై 21 (నినాదం)**

కోరుట్ల పట్టణంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని మహిళలు గోరింటాకు వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా గోరింటాకు తెచ్చుకుని, నూరుకొని చేతులకు పెట్టుకున్నారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల కలిగే ఆరోగ్య, ఆధ్యాత్మిక విశిష్టతలను ఈ సందర్భంగా మహిళలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కోరుట్ల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అన్నం లావణ్య పాల్గొన్నారు. ఆమెతో పాటు సంగెం గ్రామ సర్పంచ్ స్వరూప, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మి , మాజీ కౌన్సిలర్ రాధిక, మరియు ప్రముఖ మహిళా ప్రతినిధులు విజయ, నవ్య, కీర్తన, రజిత, జల, విజయ, సంగీత, శ్యామల, బుచ్చమ్మ, భూమిక, లలిత తదితరులు పాల్గొన్నారు. మహిళలందరూ ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొని గోరింటాకు విశిష్టతను చాటిచెప్పారు.

# వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




**హన్మకొండ, జూలై 21 (నినాదం ):** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ మీసాల ప్రకాష్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతకు వచ్చిన వరి నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజు పూర్తిస్థాయిలో పనిచేసేలా చెరువులు నింపుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమస్యలన్నీ ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

**పరిస్థితి ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను సన్నద్ధం చేయాలి - మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్థక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశు గ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల ప్రస్తుత స్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## విద్యార్థులకు షీటీం అవగాహన సదస్సు



**కాటారం, జూలై 21( నినాదం):** విద్యార్థినుల్లో వ్యక్తిగత భద్రత, సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో మండలంలోని గంగారం మోడల్ స్కూల్లో మంగళవారం జిల్లా షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా షీ టీం ఎస్సై ప్రజ్వల్ ఖాన్ ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులకు పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా గుడ్ టచ్–బ్యాడ్ టచ్, మహిళలపై వేధింపులు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై పూర్తి దృష్టి పెట్టాలన్నారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా మహిళలపై వేధింపులు జరిగినా వెంటనే షీటీం మొబైల్ నంబర్ 8712658162కు సమాచారం అందించాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడిన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## మంగపేటలో దోమల మందు పిచికారి చేపట్టాలి

**బీఆర్ఎస్ నేత గుడివాడ శ్రీహరి డిమాండ్**



**ములుగు ప్రతినిధి, జూలై 21 (నినాదం):** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మంగపేట మండలంలోని అన్ని గ్రామాల్లో వెంటనే దోమల మందు పిచికారీ చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ సోషల్ మీడియా ఇంచార్జ్ గుడివాడ శ్రీహరి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం మాట్లాడుతూ, వర్షాల కారణంగా దోమల సంఖ్య పెరిగిందని, దీంతో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. అయినప్పటికీ మండలంలోని గ్రామాల్లో ఇప్పటివరకు దోమల మందు పిచికారీ చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, సంబంధిత అధికారులపై ఉందని గుర్తు చేశారు. వెంటనే అన్ని గ్రామాల్లో దోమల మందు పిచికారీతో పాటు పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేయాలని కోరారు. ప్రజల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వద్దని, తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఐటీడీఏ ఏటూరునాగారంలో అధికారుల కొరత

**ఏపీఓ, ఏవో, ఎస్ఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి**



**ములుగు ప్రతినిధి, జూలై 21 (నినాదం):** తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐటీడీఏ ఏటూరునాగారం నేడు అధికారుల కొరతతో నిర్వీర్యమైందని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిసె బాలకృష్ణ విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధికి కేంద్రబిందువైన ఐటీడీఏలో పరిపాలించే అధికారులు లేక పరిస్థితి దిగజారిందన్నారు. ఏపీఓ, ఏవో, ఎస్ఓ వంటి కీలక పోస్టులు నెలలుగా ఖాళీగా ఉండటంతో అడ్మినిస్ట్రేషన్ స్తంభించిందని తెలిపారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ఆదివాసీల జీవన స్థితిలో మార్పు రావడం లేదని, పైగా ఐటీడీఏలను బలోపేతం చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. అధికారులు లేక గిరిజనులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పనులు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐటీడీఏలో ఖాళీగా ఉన్న ఏపీఓ, ఏవో, ఎస్ఓ పోస్టులను వెంటనే భర్తీ చేసి గిరిజనుల అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసీలందరినీ ఏకం చేసి దశలవారీ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి డిమాండ్లను సాధించుకుంటామని హెచ్చరించారు.

## ఎస్ఐఆర్ 100% పూర్తిచేసి మిర్యాలగూడను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంచుతాం

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డిసిసి అధ్యక్షులు కైలాస్ పున్న నేత**



**మిర్యాలగూడ జూలై 21( నినాదం ):** ఎస్ ఐ ఆర్ ను 100% పూర్తిచేసి రాష్ట్రంలోనే మిర్యాలగూడ ను మొదటి స్థానంలో ఇస్తామని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ పున్న నేత అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్ లో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సర్ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షబ్బీర్ అలీ సమక్షంలోమిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, వార్డ్ ఇన్‌చార్జ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లు ( బి ఎల్ ఏ లు )తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే అత్యంత కీలకమైన ప్రక్రియ అని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడంతో పాటు, ఎలాంటి తప్పులు, లోపాలు లేకుండా ఓటరు జాబితాను రూపొందించడంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. 29వ వార్డ్ లో చురుకుగా పాల్గొని దాదాపు 500 ఫామ్స్ ఫిల్ చేసిన దీూా అంగవైకల్యం కలిగిన యువతీ శివానిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి అని అన్నారు.. ఈ సందర్భంగా శివానిని అభినందించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ , పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టణ కౌన్సిలర్లు, వార్డ్ ఇన్‌చార్జ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లు , పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారులపై ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

**జిల్లాలోని బ్లాక్ స్పాట్స్ గుర్తించాలి**

**స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్**



**నల్లగొండ ప్రతినిధి జూలై 21 (నినాదం):** జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యమని స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్ స్పష్టం చేశారు. జాతీయ రహదారులపై రోడ్డు భద్రత చర్యలపై స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, పోలీస్ శాఖ, జాతీయ రహదారి శాఖ అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచిమంగళ వారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షసమావేశం నిర్వహించారు, స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు, ట్రక్కులు పార్కింగ్ చేయవద్దని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలు మినహా ఎక్కడా వాహనాలు పార్కింగ్ చేయవద్దని స్పష్టం చేశారు. అలాగే రోడ్డుపై ఆక్రమణలు ఉండకుండా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు అధికారులు, పోలీసులు, జాతీయ రహదారుల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే జాతీయ రహదారుల వెంట పోలీస్, రవాణా శాఖ అధికారుల పెట్రోలింగ్ వాహనాలు ఎప్పుడూ పెట్రోలింగ్ చేసేలా చూడాలని సూచించారు. ఆ వాహనంలో అత్యవసర సేవలు అందించే సామాగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ జిల్లా పరిధిలో అన్ని ఆసుపత్రుల వివరాలు, ట్రామా కేర్ సెంటర్ల వివరాలు మ్యాపింగ్ చేసి అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. అన్ని జిల్లాల్లో బ్లాక్ స్పాట్స్ గుర్తించి.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు భద్రత కింద జారీ చేసిన ఆదేశాలను జిల్లాలో పక్కాగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్. లో ఎస్పీ శరత్ చంద్ర పవర్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ జిల్లా రెవెన్యూ అధికారి దశరథ జిల్లా రవాణా అధికారి. శ్రీవాణి పాల్గొన్నారు.

## కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలతో అరుదైన రికార్డు

**వయోభారంతో సంబంధం లేకుండా ఆధునిక చికిత్సలు**

**డాక్టర్ రాజశేఖర్ చక్రవర్తి, మురళి నాథ్**

**మిర్యాలగూడ జూలై 21( నినాదం) :** యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ యూనిట్ కిడ్నీ చికిత్స విభాగం 395 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి అరుదైన రికార్డు నెలకొల్పిందని ప్రముఖ నెఫ్రాలజిస్టులు డాక్టర్ రాజశేఖర చక్రవర్తి, డాక్టర్ మురళీనాథ్ వాకడల తెలిపారు. మంగళవారం మిర్యాలగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ శస్త్రచికిత్సల ద్వారా వందలాది మంది రోగులకు కొత్త జీవితాన్ని అందించామని చెప్పారు. సాధారణంగా కిడ్నీ మార్పిడికి రక్తగ్రూపులు ఒకే విధంగా ఉండాల్సి వచ్చినప్పటికీ, అత్యాధునిక వైద్య విధానాలతో రక్తగ్రూపులు వేరుగా ఉన్న రోగులకూ విజయవంతంగా కిడ్నీ మార్పిడి చేసినట్లు వెల్లడించారు. వయస్సు కూడా శస్త్రచికిత్సలకు అడ్డంకి కాదని, 60 ఏళ్లు పైబడిన వృద్ధుల్లోనూ విజయవంతంగా కిడ్నీ మార్పిడి నిర్వహించినట్లు తెలిపారు. డయాలసిస్ తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, కిడ్నీ మార్పిడి ద్వారా రోగుల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయని పేర్కొన్నారు. యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ యూనిట్ అత్యాధునిక మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో అంతర్జాతీయ ప్రమాణాల చికిత్స అందిస్తూ దేశంలోని ప్రముఖ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రంగా ఎదుగుతోందని చెప్పారు. సమావేశంలో మార్కెటింగ్ హెడ్ చంద్రకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



## అనాథ చిన్నారికి అండగా ఆదర్శ హైస్కూల్

**కాటారం, జూలై 21( నినాదం):** ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితులు ఏ చిన్నారి విద్యకు అడ్డంకి కాకూడదనే సామాజిక బాధ్యతతో ఆదర్శ హైస్కూల్ యాజమాన్యం మరోసారి తన సేవాభావాన్ని చాటుకుంది. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన ఓ చిన్నారికి పూర్తిగా ఉచిత విద్యను అందించేందుకు పాఠశాల ముందుకు వచ్చింది. కాటారం మండలంలోని దామెరకుంట గ్రామానికి చెందిన అప్పాల రక్షిత చిన్న వయస్సులోనే తల్లిదండ్రులు బాలరాజు, మీనాలను కోల్పోయి అనాథగా మిగిలింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, వారిలో రక్షిత చిన్న కుమార్తె. ప్రస్తుతం ఆమె రెండో తరగతి చదువుతోంది. రక్షిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆదర్శ హైస్కూల్ చైర్మన్ జనగామ కరుణాకర్ రావు మానవతా దృక్పథంతో స్పందించారు. ఆర్థిక ఇబ్బందులు ఆమె చదువుకు అడ్డంకిగా మారకుండా, పాఠశాలలో పూర్తిగా ఉచితంగా విద్యను అందించనున్నట్లు ప్రకటించారు. విద్యే జీవితాన్ని మార్చే శక్తి అనే విశ్వాసంతో, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో గత 36 ఏళ్లుగా ఎంతోమందికి ఉచిత విద్యను అందించామని, దానిలో భాగంగానే నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆదర్శ హైస్కూల్ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్థానికులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు అభినందిస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు.



## కార్గిల్ విజయ్ దివాస్‌ను విజయవంతం చేయాలి

**కార్గిల్ సోల్జర్స్ మెమోరియల్ సొసైటీ చైర్మన్ గాదె రాంబాబు**



**డోర్నకల్/మరిపెడ జులై 21(నినాదం):** 1999 కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన భారత వీర జవాన్ల త్యాగాలను స్మరించుకునేందుకు మహబూబాబాద్ జిల్లా ప్రజలందరూ ఒకేతాటిపైకి రానున్నారు. కార్గిల్ సోల్జర్స్ మెమోరియల్ సొసైటీ,తెలంగాణ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాబోయే ఆదివారం,జూలై 26,2026న ఉదయం 10:30 గంటలకు మరిపెడ మండలం,కార్గిల్ సెంటర్ వద్ద ఉన్న కార్గిల్ స్తూపం వద్ద ఘన నివాళుల కార్యక్రమం జరగనుంది. సొసైటీ చైర్మన్ గాదె రాంబాబు విడుదల చేసిన ప్రకటనలో,దేశం కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరులను ప్రతి భారతీయుడూ స్మరించుకోవాల్సిన బాధ్యత ఉంది. వారి త్యాగఫలమే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజలు,విద్యార్థులు, ఉపాధ్యాయులు,ప్రభుత్వ, ప్రైవేట్‌ఉద్యోగులు, యువత, మహిళలు, రైతులు,వ్యాపారులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని అమరవీరులకు పుష్పాంజలి ఘటించాలని సొసైటీ పిలుపునిచ్చింది. 2005లో స్థాపించబడిన కార్గిల్ సోల్జర్స్ మెమోరియల్ సొసైటీ రిజి.నెం. 79/2005 ఆధ్వర్యంలోనే మహబూబాబాద్ జిల్లా మరిపెడలో కార్గిల్ స్తూపం నిర్మించబడింది. ఢిల్లీలోని కార్గిల్ వార్ మెమోరియల్ తర్వాత దేశంలో నిర్మించిన రెండవ కార్గిల్ స్తూపం ఇదే కావడం జిల్లా ప్రజలకు గర్వకారణమని సొసైటీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోహి రెడ్డి వైస్–చైర్మన్ గాదె ఉషా లతా రెడ్డి తెలిపారు. కమిటీ సభ్యులు బాలుగూరి శ్రీనివాస్ రెడ్డి, పెంటయ్య,చిలుకూరి వెంకన్న,దార ఇందు భారతి,భూక్యా సుధాకర్ నాయక్ తదితరులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు."నా దేహం ముక్కలైనా...దేశం ముక్కలు కానివ్వను" అన్న అమరవీరుల స్ఫూర్తితో దేశభక్తిని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా హాజరు కావాలని సొసైటీ కోరింది.

## దేవాలయ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు

- జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వినోద్ కుమార్





**అమరచింత, జూలై 21, (నినాదం):** దేవాలయ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని వనపర్తి జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆత్మకూరు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఎండోమెంట్ భూములను, సొంత బజారులోని ఎల్లమ్మ బండారు పసుపు కు సంబంధించిన గ్రామకంఠ భూమిని తనిఖీ చేశారు. అంతకుముందు అదనపు కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయంలో మునిసిపల్ చైర్ పర్సన్ మాజీ పర్సన్ బి ఎల్ వో ల తో కలిసి సర్ కార్యక్రమంపై చర్చించారు. ఆత్మకూర్ మండలంలో 84% మున్సిపాలిటీలో కేవలం 77% మాత్రమే పర్సంటేజ్ అయిందని ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతి నిధులు సహకరించి కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ కోరారు. అనంతరం ఆత్మకూరు పట్టణ శివారులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ భూములను పరిశీలించారు. ఆలయ భూముల ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ శివారులోని జూరాల రోడ్డు వెంబడి కొందరు అక్రమంగా డబ్బాలు వేసుకున్నారని వాటిని స్వచ్ఛందంగా రోజుల్లో తొలగించుకోవాలని లేని పక్షంలో వారిపై పెట్టాలని తహసిల్దార్ జెకే మోహన్లు ఆదేశించారు. పరమేశ్వర స్వామి చెరువులో రాళ్లు వేసిన వారిపై అలాగే పరమేశ్వర స్వామి చెరువు భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ను ఆదేశించారు. అనంతరం సొంత బజార్ లోనీ ఎల్లమ్మ పసుపు బండారు గ్రామకంఠం భూమిని పరిశీలించారు. ఎల్లమ్మ బండారు స్థలానికి సంబంధించిన ఎల్లమ్మ దేవర్ల కమిటీ సభ్యులు రమేష్ యాదవ్, మల్లేష్ యాదవ్‌తో పాటు మరికొంత మంది గ్రామకంఠ భూమిని కాపాడాలని చేతులు జోడించి అదనపు కలెక్టర్ ను వేడుకున్నారు. ఈ గ్రామ భూమిలో ఎవరు కూడా నిర్మాణాలు చేపట్టరాదని అదన కలెక్టర్ హెచ్చరించారు. ఈ స్థలాన్ని ఆక్రమించుకోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తహసీల్దారు ఆదేశించారు.

## ప్రజాస్వామ్యవాదులపై దాడి అమానుషం

**టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు యంఏ. ఖాదర్ పాష ఆగ్రహం**



**వనపర్తి ప్రతినిధి, జూలై 21 (నినాదం):** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులపై పోలీసుల దమనకాండను తెలంగాణ జన సమితి వనపర్తి జిల్లా అధ్యక్షులు యంఏ. ఖాదర్ పాష తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటనపై ఆయన మంగళవారం స్పందించారు. నీట్ పేపర్ లీకేజీ, విద్యాశాఖ వైఫల్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలపై ప్రశ్నిస్తే లాఠీ చార్జీలు, రబ్బర్ బుల్లెట్లు, విషవాయువులతో దాడి చేయడం రౌడీయిజమేనని మండిపడ్డారు. ఢిల్లీ పోలీసుల అరాచకంపై వెంటనే పూర్తిస్థాయి విచారణ జరిపించాలని, దాడికి తెగబడిన పోలీసు అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నీట్ అక్రమాలపై చర్యలు తీసుకుని స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ప్రజాస్వామ్యయుతంగా పోరాడే విద్యార్థులు, నిరుద్యోగుల హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.

## పాలకీడు నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలించిన సీఐ



**హుజూర్ నగర్, జూలై 21 (నినాదం):** పాలకీడు మండల ప్రజలకు మరియు శాంతిభద్రతల పరిరక్షణకు ఇది ఎంతో శుభపరిణామం అని సిఐ చరమంద రాజు అన్నారు. నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి సంబంధించి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వారి ఆదేశాల మేరకు మంగళవారం హుజూర్ నగర్ సీఐ గజ్జె చరమంద రాజు ఎస్సైతో కలిసి పోలీస్ స్టేషన్ కొరకు ప్రతిపాదిత స్థలాన్ని మరియు భవన డిజైన్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో, రెండు కోట్ల ముప్పై ఎనిమిది లక్షల రూపాయల రు (2.38) కోట్లు అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ నూతన పోలీస్ స్టేషన్ భవనంతో పాలకీడు మండల ప్రజల సుదీర్ఘకాల నిరీక్షణ ఫలించబోతోంది. ఆధునిక వసతులతో విశాలమైన రెండు ఎకరాల ప్రాంగణంలో నిర్మించబోయే ఈ నూతన పోలీస్ స్టేషన్ భవనం అందుబాటులోకి వస్తే మండలంలో పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని, శాంతిభద్రతలు మరింత మెరుగ్గా అమలు జరుగుతాయని ఈ అక్టోబర్ నెలలో పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవం జరిపేలా ప్రణాళికా సిద్ధం చేసినట్టు హుజూర్ నగర్ సీఐ చరమందరాజు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు



**ములుగు ప్రతినిధి, జూలై 21 (నినాదం):** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను మంగపేట మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి సీతక్క ఆదేశాలు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు మండల అధ్యక్షులు చెట్టిపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా చెట్టిపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఖర్గే గారు రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి ఇస్సార్ ఖాన్, జిల్లా నాయకులు ఆక రాధాకృష్ణ, చింత పున్నారావు, అ-య్యోరి యానయ్య, పూజారి సురేందర్, పాయం అనిత, తుడి భగవాన్ రెడ్డి, ఎర్రంగారి సురేష్, బోడ బొరయ్య, బసారికారి నాగార్జున్, భూక్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని ఎమ్మెల్యే నాయిని స్వాగతం

**హనుమకొండ జూలై 21, (నినాదం ):** ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షా సమావేశానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదినాన్నిపురస్కరించుకుని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# రామగుండం ప్రజల సమస్యలు వదిలేసి రాజకీయాలు చేయొద్దు..!!

ముందు హామీలు అమలు చేయండి
బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి



**గోదావరిఖని, జూలై 21 (నినాదం):** స్థానిక సమస్యలపై సమాధానం చెప్పకుండా రాష్ట్ర రాజకీయాలపై విమర్శలు సరికాదు, ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీలు అమలు చేసి తర్వాతే ఇతరులపై వ్యాఖ్యలు చేయాలని డిమాండ్ చేశారు. తాగునీరు, ఉపాధి, బూడిద దందా, ఇళ్ల కూల్చివేతలపై ప్రభుత్వాన్ని నిలదీసిన బి.ఆర్.ఎస్ నాయకుడు రామగుండం నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర రాజకీయాలపై విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని బి.ఆర్.ఎస్ నాయకుడు కౌశిక హరి విమర్శించారు. ముందుగా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన, రామగుండంలో తాగునీటి కొరత, సాగునీటి సమస్యలు ఇప్పటికీ పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రామగుండంలో బూడిద దందా జరుగుతోందనే ఆరోపణలు, ప్రజల ఇళ్ల కూల్చివేతల వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆయన కోరారు. స్థానిక సమస్యలను పక్కనబెట్టి ఇతర నాయకులపై విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని కౌశిక హరి విమర్శించారు. పెన్షన్ పెంపు, మహిళలకు నెలకు ₹2,500 ఆర్థిక సహాయం, నిరుద్యోగ భృతి వంటి కీలక హామీలు ఇప్పటికీ అమలు కాలేదని గుర్తు చేశారు. ముందుగా ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు మరియు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి, అనంతరం ఇతర రాజకీయ పార్టీలపై విమర్శలు చేయాలని ఆయన సూచించారు. ప్రజలకు మాటలు కాదు.. చేతల్లో కనిపించే అభివృద్ధి కావాలని, రామగుండం నియోజకవర్గంలో తాగునీరు, సాగునీరు, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కౌశిక హరి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే నిజమైన రాజకీయమని ఆయన స్పష్టం చేశారు.

# ప్రజల దాహానికి శాశ్వత పరిష్కారం

15వ వార్డులో కొత్త తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు
660 అడుగుల నూతన లైన్‌తో స్వచ్ఛమైన మంచినీటి సరఫరా
చైర్మన్, కమిషనర్‌కు కౌన్సిలర్ మంజుల రవి కృతజ్ఞతలు





**సుల్తానాబాద్, జూలై 21 (నినాదం):** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు లో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించినట్లు వార్డు కౌన్సిలర్ గాదాసు మంజుల రవి తెలిపారు. బస్టాండ్ వెనుక ప్రహరీ గోడను ఆనుకుని గత పాలకవర్గం తాగునీటి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయ గా, అనంతరం అదే పైప్‌లైన్‌పై మురుగు కాలువ నిర్మించడంతో పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో మురుగు నీరు కలిసిన దుర్వాసనతో కూడిన తాగునీరు సరఫరా అవుతూ ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ సమస్యను వెంటనే మున్సిపల్ చైర్పర్సన్ బిరుదు రాధాకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా, కమిషనర్ తిప్పరాజు రమేష్‌తో చర్చించి ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ పాత పైప్‌లైన్‌ను పూర్తిగా తొలగించి, సుమారు 660 అడుగుల పొడవుతో నూతన తాగునీటి పైప్‌లైన్ ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీంతో 15వ వార్డు ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా అందేలా చర్యలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యను వెంటనే పరిష్కరించడంలో సహకరించిన మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, కమిషనర్ తిప్పరాజు రమేష్‌లకు 15వ వార్డు ప్రజల తరఫున, తన తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కౌన్సిలర్ గాదాసు మంజుల రవి తెలిపారు.

# రజకుల ఐక్యతకు చిరస్మరణీయ చిహ్నం మామిడి ఆగయ్య..

ఆశయ సాధనకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేద్దాం!
7వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.. రజక సమాజ హక్కుల కోసం పోరాటాలను కొనసాగించాలని పిలుపు



**గోదావరిఖని, జూలై 21 (నినాదం):** రజకుల ఐక్యత, ఆత్మగౌరవం, సామాజిక హక్కుల సాధనే స్వర్గీయ మామిడి ఆగయ్య జీవిత లక్ష్యమని పెద్దపల్లి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు, డీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ పేర్కొన్నారు. స్వర్గీయ మామిడి ఆగయ్య 7 వ వర్ధంతి సందర్భంగా పెద్దపల్లి జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో, గోదావరిఖని పట్టణ రజక సంఘం అధ్యక్షుడు పైడిపల్లి తిరుపతి అధ్యక్షతన భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన స్మారక సభలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**"రజకుల చరిత్రలో మామిడి ఆగయ్యది ప్రత్యేక అధ్యాయం"**

ఈ సందర్భంగా పెండ్యాల మహేష్ మాట్లాడుతూ.. 2016లో మామిడి ఆగయ్య నాయకత్వంలో పెద్దపల్లి జిల్లా రజక సంఘం ఏర్పాటై రజకుల ఐక్యతకు బలమైన పునాది పడిందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన 'రజక సింహగర్జన' సభతో సమాజ బలాన్ని ప్రభుత్వానికి చాటిచెప్పిన ఘనత ఆయనదేనని కొనియాడారు. హక్కుల కోసం ఎన్నో విజయాలు

రజక సంఘం పోరాటాల ఫలితంగా పీకే రామయ్య కాలనీలో ప్రభుత్వ ప్లాట్ల కేటాయింపు, చాకలి ఐలమ్మ సర్కిల్ నామకరణం, ప్రభుత్వ ఉద్యోగుల రజక సంఘం ఏర్పాటుకు చేసిన కృషి వంటి ఎన్నో చారిత్రాత్మక విజయాలు సాధించామని తెలిపారు.

**ఆశయ సాధనకు ఐక్యంగా ముందుకు సాగుదాం**

మామిడి ఆగయ్య చూపిన ఐక్యత, సేవా స్ఫూర్తి, ఉద్యమ మార్గాన్ని ప్రతి రజకుడు కొనసాగించాలని, రాబోయే రోజుల్లో సమాజ అభివృద్ధి, హక్కుల సాధన కోసం మరింత సంఘటితంగా పోరాడాలని పెండ్యాల మహేష్ పిలుపునిచ్చారు.

పాల్గొన్న ప్రముఖులు, ఈ కార్యక్రమంలో జిల్లా రజక సంఘం గౌరవ సలహాదారు జనగామ సాయిలు, గోదావరిఖని పట్టణ ప్రధాన కార్యదర్శి మామిడి సతీష్, ఉపాధ్యక్షుడు వ్యతిరేకొండయ్య, బస్తీ నాయకులు గూడెపు రామచందర్, మామిడి పోచం, జాలిగం ఐలయ్య, నడిబొట్టు పోచం, జిల్లా నాయకులు కరాటే రాజేశం, రాచూరి నర్సయ్య, మామిడి కుమార్, మామిడి మహేందర్, ముక్కెర శ్రీనివాస్, మాచర్ల రాజన్న, నేరెళ్ల రవీందర్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ వైనాల సతీష్, మహిళా నాయకురాళ్లు, మామిడి ఆగయ్య కుటుంబ సభ్యులు, యువజన నాయకులు, రజక సంఘం కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు

# సర్ ప్రక్రియలో ఇంటింటి ప్రచారం

ఫారం-6 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 21(నినాదం) :** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు కౌటాల మండల కేంద్రంలోని 8వ వార్డులో డిసిసి ఉపాధ్యక్షుడు జానకిరావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంగళవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. గతంలో ఓటు హక్కు ఉన్నప్పటికీ ప్రస్తుతం సర్ ఫారం అందని ఇద్దరు ఓటర్లను గుర్తించి, వారి వివరాలను ఫారం-6లో నమోదు చేయాలని బీఎల్‌వో సూపర్వైజర్‌ను కోరారు. అలాగే ఇప్పటివరకు సర్ ఫారం నింపని అర్హులైన ఓటర్లను గుర్తించి, వారి దరఖాస్తులను నింపించి బీఎల్‌వోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దుర్గం జానకిరావు, బీఎల్ఏ సూపర్వైజర్ బట్టమేకల గట్టయ్య, బీఎల్ఏలు బట్టమేకల నానయ్య, లింగడే శ్రీనివాస్, వార్డు సభ్యుడు జాడి రాంకుమార్, కాంగ్రెస్ నాయకులు కిషోర్, సుధాకర్, రవి, గౌస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వర్ రెడ్డి ని కలిసిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు



**నిర్మల్ ప్రతినిధి, జూలై 21 (నినాదం ):** బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రిటైర్డ్ ఉద్యోగుల యోగక్షేమాలు, వారి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆర్టీసీలో 38 సంవత్సరాల పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన 34,188 మంది ఉద్యోగులకు 2017, 2021 సంవత్సరాలకు సంబంధించిన పీఆర్సీ బకాయిలు ఇప్పటికీ అందలేదని తెలిపారు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు ఆలస్యం కావడంతో కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు, ఇతర కనీస అవసరాలు తీర్చుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాబోయే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు.

# శునక దళం, డాగ్ హ్యాండర్లను అభినందించిన ఎస్పీ



**నిర్మల్ ప్రతినిధి, జూలై 21 (నినాదం):** తెలంగాణ పోలీసు ఇంటెలిజెన్స్ విభాగం విడుదల చేసిన 2026 తొలి అర్ధవార్షిక సేవా నివేదిక (జనవరి-జూన్) లో నిర్మల్ జిల్లా పోలీసు శునక దళం (Dog Squad) అత్యుత్తమ పనితీరుకు రాష్ట్రస్థాయిలో ప్రశంసలు దక్కాయి. ఈ నివేదికలో నిర్మల్ జిల్లా పరిధిలో నమోదైన హత్య, అనుమానాస్పద మృతి, దొంగతనం, ఆలయ చోరీ, మాదకద్రవ్యాల కేసులతో పాటు పలు కీలక కేసుల్లో పోలీసు శునకాలు" యామి, జెస్సీ, బోల్ట్" సంఘటన స్థలాల్లో కీలక ఆధారాలను గుర్తించడం, నిందితుల జాడలను కనిపెట్టడం, దర్యాప్తును వేగవంతం చేయడంలో విశేష పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శునకాలతో సమన్వయంగా విధులు నిర్వహించి కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషించిన ఏఆర్పీసీ జి. పరమేశ్వర్, ఏఆర్పీసీ కె. శ్రీనివాస్, ఏఆర్పీసీ జి. సాయేందర్లను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేరాల దర్యాప్తులో శునక దళం అందించే సేవలు అమూల్యమైనవని, శాస్త్రీయ దర్యాప్తులో పోలీసు శునకాల పాత్ర రోజురోజుకూ మరింత కీలకంగా మారుతోందని తెలిపారు. ఇదే నిబద్ధత, క్రమశిక్షణతో భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని డాగ్ హ్యాండ్లర్లను ప్రోత్సహించారు . నిర్మల్ జిల్లా పోలీసు శునక దళం సాధించిన ఈ రాష్ట్రస్థాయి గుర్తింపు జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, జిల్లా డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఆర్ఐ శేఖర్ ,రామకృష్ణ , ఆర్ఎస్ఐలు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# యువ కౌన్సిలర్ దూకుడు

విజ్జన్న ఆశీస్సులతో 13వ వార్డులో అభివృద్ధి పరుగులు
ప్రతి వీధిలో ప్రగతి అడుగులు
మట్టి రోడ్లకు ముగింపు.. ఆదర్శ వార్డే లక్ష్యం
13వ వార్డు సిద్ధ తిరుపతి అభివృద్ధి మంత్రం





**సుల్తానాబాద్, జూలై 21 (నినాదం):** అభివృద్ధిలో యువ కౌన్సిలర్ దూకుడు మొదలైం ది. వార్డు రూపు రేఖలే మార్చే ప్రయత్నంలో సి సి రోడ్డు ప్రారంభించారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణారావు ఆశీస్సులతో సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రం లోని 1 3వవార్డును ఆదర్శవంతమైన వార్డుగాతీర్చి దిద్దేందు కు కౌన్సిలర్ సిద్ధ తిరుపతి కృషి చేస్తున్నారు. వార్డు అభివృద్ధిని వేగవంతం చేస్తూ మౌలిక వస తుల కల్పన, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ముం దుకు సాగుతున్నారు. వార్డులోని ప్రతి వీధిని స్వ యంగా పరిశీలిస్తూ పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సా రిస్తున్నారు. ముఖ్యంగా వార్డులో మట్టి రోడ్లు లే కుండా చేసి అన్ని వీధులను అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని కౌన్సిలర్ సిద్ధ తిరుపతి తెలిపారు. పరిశుభ్రమైన వార్డు నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఇంటి చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ సిబ్బందికే అందించాలని, పరిసరాల ను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకా రంతో 13వ వార్డును సుల్తానాబాద్ లోనే ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాన ని కౌన్సిలర్ సిద్ధ తిరుపతి స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టేలా చూడాలి

బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశంలో
ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



**నిర్మల్ ప్రతినిధి, జూలై 21( నినాదం):** జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా జరిగేటట్టు చూడాల్సిన బాధ్యత బిజెపి నాయకులు కార్యకర్తలు పై ఉందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బోగస్ ఓట్లను తొలగించేందుకే ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియ చేపట్టడం జరిగిందని , ప్రతి ఒక్కరు ఎస్. ఐ. ఆర్. లో తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. గడుపులోగా బిజెపి పార్టీ బిఎల్ఎలు మరింత కృషి చేసి ఎస్. ఐ ఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు పాటుపడాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి సంఘటన మంత్రి ప్రధాన చంద్రశేఖర్ జీ ను బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావ్ ను ఎమ్మెల్యే తో పాటు, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు రితిష్ రాథోడ్, స్వాగతించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# గోరింటాకు వేడుకల్లో మహిళలతో మమేకమైన కందుల సంధ్యారాణి..!!

సంప్రదాయ సంస్కృతికి పెద్దపీట...
మహిళల ఐక్యతకు గోరింటాకు వేడుకలు ప్రతీక అని వ్యాఖ్య

**గోదావరిఖని, జూలై 21 (నినాదం):** మార్కండేయ కాలనీలో శ్రీ లక్ష్మీ గణపతి మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గోరింటాకు వేడుకలు సంప్రదాయ శోభతో, మహిళల సందడితో కళకళలాడాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి గోరింటాకు పెట్టించుకుని వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలను కాపాడే ప్రధాన శక్తి మహిళలేనని ఆమె అన్నారు. గోరింటాకు వంటి సంప్రదాయ కార్యక్రమాలు మహిళల మధ్య ఆత్మీయత, అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఆధునికత ఎంత పెరిగినా మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు.

**ఆటపాటలతో సందడి.. మహిళలతో ఆత్మీయ ముచ్చట్లు**

వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ ఆటలు, పాటల్లో కందుల సంధ్యారాణి మహిళలతో కలిసి పాల్గొని సందడి చేశారు. అనంతరం మహిళలతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆమెకు ఘన స్వాగతం పలికి జ్ఞాపిక అందించి సత్కరించారు.



పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు

ఈ కార్యక్రమంలో గుర్రం వీణ, బైరి శ్రీదేవి, గడ్డం ధనశ్రీ, వంగల స్వాతి, బి. శ్రీలత, తాజంపురం సంధ్యారాణి, జక్కన రాజమణి, రమ్య, రాధిక, సాయిప్రియ, భైరభట్ల సారథి, ఓదెల పద్మావతి, నడిపెల్లి అంజలి, కొక్కుల అనిత, దేవునూరి స్వప్నతో పాటు మార్కండేయ కాలనీకి చెందిన మహిళలు, యువతులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం

బిజీఎం శ్రీనివాస్



**మంచిర్యాల, జులై 21(నినాదం):** ప్రతి ఒక్కరు తమ తల్లి పేరుతో ఒక మొక్కనాటాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం ఏక్ పేడ్ మా కే నామ్ నినాదంతో తల పెట్టిన మొక్కలు నాటే కార్యక్రమం భాగంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ , కోల్ కంట్రోలర్ ఆర్గనైజనేషన (సీసీఓ) ఆదేశాల మేరకు శ్రీరాంపూర్ ఏరియాలో మెగా ప్లానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీరాంపూర్ ఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ఉన్న సెంట్రల్ నర్సరిలో జీఎం మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీసైదా, ఏరియా ఇంజనీర్ రమణ రావు, ఎస్ ఓ టూ జీఎం కృష్ణ ప్రసాద్, ఏజీఎం ఫైనాన్స్ సుమలత మొక్కలను నాటారు. అనంతరం జీఎం కార్యాలయం వివిధ విభాగాల అధిపతులు , ఉద్యోగులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణిలో శ్రీరాంపూర్ ఏరియాలో పచ్చదానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు ఏరియా వ్యాప్తంగా మొక్కల పెంపకం ఒక నిరంతర ప్రక్రియలా కొనసాగుతోంది అన్నారు. ప్రతీ ఏటా ఏరియా వ్యాప్తంగా రెండు నుంచి మూడు లక్షల మొక్కలు నాటుతున్నామన్నారు. జూన్ 5న వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే సందర్భంగా ఐకే ఓసీలో రెండు వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఓసీ ఓబీ లపై కూడా పెద్ద సంఖ్యలో మొక్కలు పెంచుతూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్నట్లు తెలిపారు.

# మోకా అనేది ఒక మోసం..



**పెద్దపల్లి రూరల్,జూలై 21(నినాదం):** మోక అనేది ఒక మోసంగా పరిగణించాల్సిన పరిస్థి తులు ఏర్పడుతున్నాయి. గ్రామీణ పట్టణ ప్రాంతా ల్లో భూ సంబంధిత కొనుగోలు అమ్మకాలలో వారసత్వ భూములలో మోక పెను ప్రమాదంగా మారింది. పట్టాదారు తన భూమిని తాను అమ్ము కునే పరిస్థితులు లేకుండా పోతున్నా యి. ఏళ్ల తరబడి కౌలు చేసుకున్న వారు పట్టాదారులకు కొనుగోలుదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. లక్షలు వెచ్చించి భూమి కొనుగోలు చేసినప్పటికీ కౌలుదారులు మోకా పేరుతో అధికారులను తప్పుదోవ పట్టించి కొనుగోలుదారు లను అమ్మకందారులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తెలంగాణలో రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్ బుక్స్ చట్టం (ధరణి )అధి కారి కంగా 2020 అక్టోబర్ 29 నుండి అమల్లోకి వచ్చిం ది. ధరణి చట్టంలో మోకా కబ్జా అనే అంశా లను స్పష్టంగా తొలగించడం జరిగింది. మోకా అనేది మోస పూరిత ప్రయోజనా లకు తావిస్తూ భూ సంబంధిత సమస్యలకు ప్రధాన కారణంగా నిలు స్తుంది. అందుచేతనే ధరణి దాని తదనంత రం భూభారతి అనే చట్టాలను ప్రభుత్వాలు అమల్లోకి తీసుకొచ్చాయి. రెవెన్యూ చట్టాలు మార్పులు వచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులు మార్పు రాకపోవడం చట్టాలపై అవగాహన లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారుతుంది.

**అయోమయంలో పోలీస్ రెవెన్యూ అధికారులు..**

గత ఆర్. ఓ. ఆర్,చట్ట పరిధిలో భూముల కొనుగోలు అమ్మకాలు సాదా బాయనామ కాగితాలపై కొనసాగాయి. భూమిని కొనుగోలు చేసిన సదరు వ్యక్తి వివరాలను ఆర్ఓఆర్ చట్టం ప్రకారం రెవెన్యూ రికార్డు లోని కబ్జా కాలంలో నమోదు చేసేవారు. భూ సంబంధిత పరిష్కారాల కోసం గత బీ. ఆర్. ఎస్, ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేసి ధరణి చట్టాన్ని రూపొందించారు. అప్పటినుండి కొనుగోలు అమ్మకాలు ఎంతో పారదర్శకంగా జరిగాయి. ధరణి మరియు భూభారతి చట్టాలలో లేని మోకా ను ఒక కారణంగా చూపుతూ రెవెన్యూ క్షేత్రస్థాయి అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో భూ సంబంధిత సమస్యలు మరింత జటిలంగా తయారై గ్రామీణ ప్రాంత రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వారసత్వ భూములను వారసుల కు వాటాల పద్ధతిలో క్రమబద్ధీకరించా ల్సిన రెవెన్యూ అధికారులు మోకా పేరుతో ఏకపక్ష పట్టా మార్పిడిలను చేయడంపై సర్వత్ర విమర్శలు వస్తున్నాయి. పోలీసులు అధికారులు సైతం ఒక్క అడుగు ముందుకు వేసి భూ సంబంధిత వ్యవహారాల్లో కలగజేసుకుంటూ రెవెన్యూ అధికారులు జారీ చేసిన రికార్డులను పరిశీలించకుండా భూమి ని కొనుగోలు చేసిన వ్యక్తులకు వారసత్వ వాటాలు పొందవలసిన వ్యక్తులకు న్యాయం చేయకుండా మోకా పై మీరు లేరు అంటూ భూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. ధరణి చట్టం ప్రకారం లేదా భూభారతి చట్టం ప్రకారం భూమిని పట్టాదారు నుండి కొనుగోలు చేసిన వ్యక్తి ఆ భూమిని పొందలేని పరిస్థితులు నెలకొంటున్నా యి. ఇకనైనా రెవెన్యూ పోలీస్ యంత్రాంగాలు అయో మయ పరిస్థితులను వీడి మోకా అనేది ఒక నాటకంగా పరిగణించి సదరు కొనుగోలుదారుల కు పట్టాదారులకు సముచిత న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందన్న విషయాన్ని గుర్తించాలని రైతులు ప్రజలు కోరుతున్నారు.

భూ సంబంధిత సమస్యలకు ప్రధాన కారణం....
కొనుగోలు అమ్మకం దారులకు తప్పని తిప్పలు....
రెవెన్యూ చట్టంలో లేని మోకా క్షేత్రస్థాయిలో అమలు పై విమర్శలు...
అయోమయంలో పోలీస్ రెవెన్యూ అధికారులు

**రెవెన్యూ అధికారులు స్పందించాలి..**



**సాగల మల్లేష్ లోకపేట**

లోకపేట శివారులోని 137 సర్వే నెంబర్లు లో ఎకరం 30 గుంటల భూమిని పట్టాదారు నుండి కొనుగోలు చేశాను. మోకా పేరుతో పట్టాదారు ను నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రస్తుతం జరు గుతున్న భూముల రీ సర్వే ద్వారా అక్రమంగా భూమిని పొందేందుకు నేను కొనుగోలు చేసిన భూమి చుట్టూ కంచ నిర్మిస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

**వాటాల ప్రకారం మా భూమి మాకు రావాలి..**

**కుడుదుల భాగ్యమ్మ ఎలిగేడు**



గ్రామ శివారులో వారసత్వంగా మాకు సంక్రమిం చాల్సిన భూమిని మోకా పేరుతో కబ్జా చేయాలని చూస్తున్నారు. ఏకపక్షంగా వారసత్వ భూమిని పట్టా చేసుకున్న కుడుదుల మల్లమ్మ పట్టాను రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. మా వారసత్వ భూమిని కౌలుకు చేసుకున్న ఒక వాటాదారు నేనేమోక మీద ఉన్న అంటూ మమ్ములను బెదిరి స్తున్నారు. వాటాల ప్రకారం మా భూమి మాకు రావాలి

## సర్‌'లో ప్రతి ఒక్కరూ
# భాగస్వాములు కావాలి



### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల ప్రతినిధి జూలై 21 (నినాదం) :** భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (SIR)లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జగిత్యాల జిల్లా ఎండపెల్లి మండలంలోని ముంజంపల్లి, మారేడువెల్లి గ్రామాల్లో జరుగుతున్న SIR ప్రక్రియను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓటరు నమోదు, వివరాల ధృవీకరణ పనులను అధికారులను అడిగి తెలుసుకుని, కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మారేడువెల్లి ప్రభుత్వ పాఠశాల లో రూ. 5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్డును మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా విద్యార్థులతో కలిసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అందువల్ల ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వ హించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో కార్యక్రమం ఎలా కొనసాగు తుందో తెలుసు కునేందుకే తాను స్వయంగా పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అధికా రులకు పూర్తి వివరాలు అందించి SIR ప్రక్రియను విజయ వంతం చేయా లని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్నికల సంఘం అధికారులు, సిబ్బందిని మంత్రి అభినంది ంచారు. ప్రతి అర్హులైన ఓటరు తమ వివరాలను నమోదు చేయించుకుని ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సత్యసాయి మిల్లులో
# భారీ అక్రమాలు

**రూ.7.17 కోట్ల విలువైన ధాన్యం కొరత.. యజమానిపై 6-ఏ కేసు నమోదు**



**కౌల్చారం, జూలై 21 (నినాదం):** మెదక్ జిల్లా కౌల్చారం మండలంలోని శ్రీ సత్యసాయి ఆగ్రో రైస్ మిల్ ఇండస్ట్రీస్‌లో నిర్వహించిన సంయుక్త తనిఖీల్లో భారీ స్థాయిలో ధాన్యం కొరత వెలుగులోకి వచ్చింది. ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధిం చిన లి3,029. 960 మెట్రిక్ టన్నుల (75,749 బ్యాగు లు) ధాన్యం లెక్కల్లో తేడా ఉన్నట్లు అధికారులు గుర్తిం చారు. కొరతగా ఉన్న ధాన్యం విలువ రూ. 7,17,79, 752.40లిగా అంచనా వేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద తెలిపిన వివరాల ప్రకారం, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ బృందం (రామచంద్రాపురం), జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, అసిస్టెంట్ పౌర సరఫరాల అధికారి, సివిల్ సప్లైస్ ఇన్‌స్పెక్టర్‌లు సంయుక్తంగా మంగళవా రం కౌల్చారం గ్రామంలోని శ్రీ సత్య సాయి ఆగ్రో రైస్ మిల్ ఇండస్ట్రీస్‌లో తనిఖీలు నిర్వ హిం చారు. తనిఖీల సందర్భంగా ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధిం చిన ధాన్యం నిల్వలను పరిశీలించగా, రికార్డులతో పోల్చితే 3,029.960 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు గుర్తిం చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రైస్ మిల్ యజ మాని లిడి. శ్రీనివాస్పై లిలిఎస్సెన్షియల్ కమోడిటీస్ చట్టం-1955లి ప్రకారం లి6-ఏ కేసులి నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంపై తదుపరి చర్యల కోసం పూర్తి నివేదికను మెదక్ జిల్లా కలెక్టర్‌కు సమర్పించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద తెలిపారు.




# సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పకడ్బందీగా అమలు చేయాలి

### కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జూలై 21 (నినాదం):** సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శ కాల మేరకు జిల్లాలో రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని చర్యలను సమర్థవంతంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాల ను గణనీయంగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాల యాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావే శానికి డి.సి.పి. ఎ.భాస్కర్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాటా డుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారు లపై అనుమతించిన లే-బైలు, వే-సైడ్ సౌకర్య కేంద్రాలు మినహా ఇతర ప్రాంతాలలో భారీ, వాణిజ్య వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నిషేధిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దాబాలు, హోటళ్లు, వాణిజ్య సంస్థల సమీపంలో అక్రమంగా నిలిపే భారీ వాహనాల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నం దున ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, రహదారులపై ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ వీధి దీపాలు, సి.సి కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ కంట్రోల్ చర్యలు, రంబుల్ స్ట్రిప్‌లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఇందారం వంతెన నుంచి గోదావరి వంతెన వరకు వీధి దీపాల ఏర్పాటు, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిర్వహణ, యూ-టర్న్‌ల పున: వ్యవస్థీకరణ, రహదారుల షోల్డర్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. రహదారుల పర్యవేక్షణ కోసం అధునాతన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ, జి.పి.ఎస్. ఆధారిత నిఘా వ్యవస్థలను వినియోగించి ట్రాఫిక్ ఉల్లంఘ నలను గుర్తించి ఈ-చలాన్ వ్యవస్థతో అను సంధానం చేయాలని, అత్యవ సర పరిస్థితు లలో తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రతి 75 కిలో మీటర్లకు అంబులెన్స్, రికవరీ వాహనం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారి హక్కు పరిధిలో కొత్త దాబాలు, వాణిజ్య నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, ఇప్పటికే ఉన్న అనధికార నిర్మాణాలను తొలగించి రహదా రుల భద్రతకు ఆటంకం కలిగించే ఆక్రమణ లను నివారించాలని సూచించారు. రహదారు ల సమీప భూవినియోగాన్ని నిబంధనల ప్రకారం నియంత్రించి ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను అరికట్టాలని అధికారు లకు సూచించారు. పాఠ శాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాలలో రోడ్డు భద్రత పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలలో బాధ్యత పెంపొందించాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ రహదారి భద్రతను మరింత బలోపేతం చేసేందుకు పోలీ సు, రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక హైవే సర్వైలెన్స్ బృందాలను ఏర్పా టు చేసి 24 గంటల పర్యవేక్షణ నిర్వహిస్తామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్‌లోడ్ వాహనాలు, అక్రమ పార్కింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటా మని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రాహ్ వీర్ పథకం గురించి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని సూచిస్తూ, రోడ్డు ప్రమాద బాధితులను ప్రమాదం జరిగిన తొలి గంటలో సమీప ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం అందజేస్తుందని తెలిపారు. ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు భయపడకుండా ముందుకు రావాలని, సమయానికి అందించే సహాయం అనేక ప్రాణాలను కాపాడగలదని తెలిపారు.

# బొగతకు జలకళ..

### జలపాతం కనువిందు

ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతం జలకళను సంతరించుకుంది. ఎగువ అటవీ ప్రాంతాల్లో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలపాతంలో నీటి ప్రవాహం పెరిగి ఉరకలేస్తోంది. ప్రకృతి అందాలతో అలరారుతున్న బొగత జలపాతాన్ని చూసేందుకు సందర్శకులు తరలివస్తున్నారు. వర్షాలతో జలపాతం మరింత అందంగా మారడంతో పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (ములుగు) (నినాదం)**



N NADAM CINEMA





## ఎన్టీఆర్, త్రివిక్రమ్
# గాడ్ ఆఫ్ వార్

### హీరోయిన్‌గా కియారాపై చర్చ

యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో 'గాడ్ ఆఫ్ వార్' ఒకటి. స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించనున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచగా.. ఇప్పుడు హీరోయిన్‌కు సంబంధించిన వార్తలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ చిత్రం పురాణ గాథల స్ఫూర్తితో రూపొందనున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా అని వార్తలు వస్తుండగా.. ఎన్టీఆర్ ఇందులో శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నట్లు టాక్. కథలో కీలకమైన మహిళా పాత్రకు కియారా సరిపోతా రని మేకర్స్ భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్టీఆర్, కియారా అద్వానీ ఇప్పటికే 'వార్ 2' చిత్రంలో కలిసి నటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సినిమాలో వారి మధ్య పూర్తి స్థాయి జోడీ కనిపించలేదు. కియారా నటించిన 'భరత్ అనే నేను' ఘన విజయం సాధించగా, రామ్ చరణ్‌తో చేసిన 'వినయ విధేయ రామ', 'గేమ్ ఛేంజర్' ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయాయి. దీంతో కొందరు అభిమానులు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో సెంటిమెంట్‌గా చర్చిస్తున్నారు. నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహం చేసుకున్న తర్వాత కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతున్నారు. మరోవైపు ఎన్టీఆర్ ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'డ్రాగన్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే త్రివిక్రమ్ దర్శకత్వంలోని 'గాడ్ ఆఫ్ వార్' సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం.



## పంద్రాగస్ట్ పోటీలో
# సూర్య, నయనతార



తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆధవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు. సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ /సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్య దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణెలిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్య్ర దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.

## షూటింగ్‌లో గాయపడ్డ బాలయ్య




నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తుండగా, ఈ చిత్ర షూటింగ్ తాజాగా కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతుంది. అయితే భారీ యాక్షన్ ఎంటర్‌టై నర్ కోసం కాకినాడ పోర్ట్ పరిస రాలలో కీలక సన్నివేశాలు చిత్రీ కరి స్తుం డగా, ఆయన అను కోకుండా కాలు జారి కిందపడి పోయారు. దాంతో ఆయన మోకాలిక స్వల్ప గాయం అ యింది. వెంటనే చిత్ర బృందం షూటింగ్ ఆపేసి బాలయ్యని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్య బృందం ఇతర పరీక్షలు కూడా నిర్వహించారు. స్వల్ప గాయమే అయిందని, కంగారు పడాల్సిన పనిలేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే కొన్ని రోజుల పాటు బాలయ్య విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు సమా చారం. ఇక సినిమాల విషయానికి వస్తే.. గోపిచంద్ మలినేనితో పాటు కొరటాల దర్శకత్వంలోను బాలయ్య ఓ చిత్రం చేస్తున్నాడు.

# రామ్‌చరణ్‌తో సుకుమార్ మూవీ

### హీరోయిన్‌గా రష్మిక అంటూ ప్రచారం



క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థ లం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం సినిమా స్క్రిప్ట్ పూర్తిగా సిద్ధమైనట్లు తెలుస్తుండగా, ఇప్పుడు హీరోయిన్ ఎంపిక టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే సుకుమార్ కెరీర్‌ను పరిశీలిస్తే ఒక ఆసక్తికరమైన విషయం కనిపిస్తుంది. 'ఆర్య' నుంచి 'పుష్ప 2' వరకు ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమాలో కొత్త హీరోయిన్‌కే అవకాశం ఇచ్చారు. ఒకసారి నటించిన కథానాయికను వెంటనే మరో సినిమాలో రిపీట్ చేయలేదు. ఇదే ఆయనకు సెంటిమెంట్‌గా మారింది. అయితే ఈసారి రామ్ చరణ్ సినిమా కోసం ఆ సెంటిమెంట్‌ను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పలువురు నటీమణుల పేర్లు పరిశీలించినప్పటికీ, రష్మిక మందన్న పేరు ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. దర్శకుడు సుకు మార్‌తో 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాల్లో రష్మిక సక్సెస్‌ఫుల్‌గా పనిచేయ డంతో, మరోసారి ఆమెనే ఎంపిక చేయాలనే అభిప్రాయం టీమ్‌లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. రామ్ చరణ్, రష్మిక మందన్న ఇప్పటివరకు ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు. ఈ ఫ్రెష్ పెయిర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని చిత్రబృందం భావిస్తోందట. అంతేకాకుండా ప్రస్తుతం రష్మిక పాన్ ఇండియా స్థాయిలో వరుస విజయాలతో దూసుకుపోతుండటం కూడా నిర్మాతలకు అదనపు బలంగా మారింది. ఆమె క్రేజ్ సినిమాకు అన్ని భాషల్లో మంచి బిజినెస్‌కు దోహదపడుతుందనే అంచనాలు ఉన్నాయి. ఒకవేళ రష్మికనే హీరోయిన్‌గా ఖరారు చేస్తే, సుకుమార్ తన కెరీర్‌లో తొలిసారి ఒకే హీరోయిన్‌ను వరుసగా రెండు చిత్రాల్లో తీసుకున్న దర్శకుడిగా నిలుస్తారు. అయితే ప్రస్తుతం ఇవన్నీ ప్రచారంలో ఉన్న వార్తలే. చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే హీరోయిన్ ఎంపికపై పూర్తి స్పష్టత రానుంది.

## సింహాద్రి సన్నివేశంపై రాజమౌళి ఆసక్తికర వ్యాఖ్య



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత గుర్తింపు పొందిన భారతీయ దర్శకుల్లో ఒకరిగా నిలిచారు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలతో అంతర్జాతీ య స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు మహేష్ బాబు హీరోగా తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ వారణాసి తో మరోసారి ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. విదేశాల్లో నిర్వహిస్తున్న ప్రమోషనల్ ఈవెంట్లలో రాజమౌళి చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన ఓ ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న రాజమౌళి.. సినిమా నిర్మాణంలో ఎదురయ్యే సవాళ్ల గురించి మాట్లాడారు. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కించిన 'సింహాద్రి' చిత్రంలోని ఓ కీలక సన్నివేశాన్ని రాజమౌళి ప్రస్తావించారు. 'సింహాద్రి' సినిమాలో హీరో ఒక మంచి వ్యక్తిని చంపాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. సాధారణంగా హీరో చేత అలాంటి పని చేయించడం ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారనే సందేహాలు తన కుటుంబ సభ్యులు, టీమ్‌లో చాలామందికి ఉన్నాయని చెప్పారు. అయితే కథలో ఆ సంఘటన వెనుక బలమైన కారణం ఉందని, ఆ మంచి వ్యక్తిని హీరో చంపకపోతే వేలాది మంది అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని ఆయన వివరించారు. ఆ భావోద్వేగాన్ని ప్రేక్షకులకు బలంగా చేరవేయగలిగితేనే ఆ సన్నివేశం పనిచేస్తుందని తాను నమ్మానని రాజమౌళి వెల్లడించారు. దర్శకుడిగా కొన్ని సందర్భాల్లో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని, కథ చెప్పే విధానంపై నమ్మకం ఉంటే అలాంటి రిస్క్‌లు తీసుకోవాల్సిందేనని ఆయన పేర్కొన్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787